ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఒంగోలు

fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-7-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 169 పేజీలు: 12 వెల: 8.00

## రష్యాపై ఇయు మరిన్ని ఆంక్షలు
9లో

ప్రధాని వచ్చేవారం యుకె, మాల్దీవుల పర్యటన

# లిక్కర్ కేసు ఎంపి మిథున్ రెడ్డి అరెస్టు



### ఆరుగంటలుపైగా విచారణ జరిపిన సిట్

### డొల్ల కంపెనీల నుంచి ముడుపులు చేర్చడంపై మిథున్‌ను ప్రశ్నించిన అధికారులు

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో గత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో జరిగినట్లు చెప్పబడుతున్న లిక్కర్ స్కామ్ వ్యవహారం కేసులో సిట్ విచారణకు వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి శనివారం హాజరయ్యారు. 6గంటలకుపైగా జరిగిన సిట్ విచారణ ఈ సాయంత్రం ముగిసింది. విచారణ ముగిసిన నేపథ్యంలో సీట్ అరెస్ట్ చేస్తున్నట్లు ఆయనకు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని మిథున్ కుటుంబ సభ్యులకు వెల్లడించింది. ఆరు గంటలకుపైగా ఎంపీ మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నించారు. డొల్ల కంపెనీల నుంచి అంతిమ లబ్ధిదారునికి ముడుపులు చేర్చడంపై మిథున్ రెడ్డిని ఎక్కువగా ప్రశ్నలు అడిగినట్టు తెలుస్తోంది. మిథున్‌రెడ్డి విచారణ ఈ కేసులో కీలకంగా భావిస్తున్న పోలీసులు.. లిక్కర్ కేసు ప్రాథమిక చార్జ్‌షీట్లను కోర్టుకు తీసుకెళ్తున్నట్లు సమాచారం. ఏపీ మద్యం స్కాం కేసులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి ఏ4 నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ఏపీ హైకోర్టును ఆశ్రయించాడు. ఆయన ముందస్తు బెయిల్‌ను హైకోర్టు తిరస్కరించింది. హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. లిక్కర్ కేసులో తన ప్రమేయం లేకపోయినా రాజకీయ కక్షలో >>2

## మద్యం కుంభకోణంపై ప్రాథమిక నివేదిక సమర్పించిన సిట్ మరో 20 రోజుల్లో పూర్తి చార్జిషీట్

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** సంచలనం సృష్టించిన ఏపీ మద్యం కుంభకోణం కేసుపై సిట్ దర్యాప్తు బృందం ప్రాథమిక చార్జ్‌షీట్‌ను ఏసీబీ కోర్టులో దాఖలు చేసింది. 300లకుపైగా పేజీలతో దాఖలు చేసిన ఈ ప్రాథమిక చార్జ్‌షీట్‌ను శనివారం కోర్టుకు అప్పగించారు. దీనితోపాటు 100కుపైగా ఫొరెన్సిక్ >>2

# ప్లాస్టిక్‌పై పూర్తి నిషేధం

## అక్టోబర్ 2 నాటికి రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లు, 123 మునిసిపాలిటీల్లో అమలు

### ఆగస్టు 15కు సచివాలయం ప్లాస్టిక్ రహితం

### మహాయజ్ఞంలో ప్రజల భాగస్వామ్యం అవసరం

### తిరుపతిలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో సిఎం చంద్రబాబు



శనివారం తిరుపతిలో జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

**తిరుపతి,జూలై 19ప్రభాతవార్తప్రతినిధి:** జపాన్ దేశం తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ చెత్తరహిత రోడ్లను తీర్చిదిద్దాలని రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు సూచించారు. సమాజంలో వాతావరణం కలుషితమై పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్ వస్తువులు వినియోగం పూర్తిగా నిషేధిద్దామని ఆయన పిలుపునిచ్చారు. అక్టోబర్ 2వతేదీకి రాష్ట్రంలోని 17 కార్పొరేషన్‌లలో, 123 మున్సిపాల్టీల్లో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలుచేద్దామన్నారు. వాతావరణం కలుషితమైన క్యాన్సర్ రావడానికి కారణమవుతున్న ఒకేసారి వాడే ప్లాస్టిక్‌ను ముందుగా నిషేధించాల్సిన అవసరం ఉందని సిఎం స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను "స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర"గా తీర్చిదిద్దడంలో భాగంగా శనివారం మధ్యాహ్నం తిరుపతి ఎంఆర్‌పల్లిలోని పోలీసు మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఎం చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వద్దు అనే నినాదాన్ని రాష్ట్రమంతటా అమలు చేయాలని, ఆచరించాలని సూచించారు. స్వర్ణాంధ్ర సాధ్యం కావాలంటే ముందుగా స్వచ్ఛాంధ్రను సాధించాలని అన్నారు. ఇందుకోసం ఇకప్రతినెలా మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని మహాయజ్ఞంలా చేపడదామని, ప్రభుత్వంతోబాటు ప్రజలు భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదామని, ప్లాస్టిక్ వినియోగాన్ని క్రమంగా తగ్గించే ప్రయత్నం చేద్దామన్నారు. ప్లాస్టిక్ రహితంగా తయారైన సంచులు, వస్తువులు, ఉత్పత్తులను వాడుదామన్నారు. క్లాత్‌బ్యాగ్ వెండింగ్ యంత్రాలను కూడా త్వరలోనే ఏర్పాటు చేసేదిశగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో ప్లాస్టిక్ భూతాన్ని అంతంచేద్దామని, వాతావరణం కలుషితమై మనకు క్యాన్సర్‌లు రావడానికి కారణంగా ప్లాస్టిక్ మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కసారి వాడే ప్లాస్టిక్ వస్తువులు, సంచులు,స్ట్రాలు, కప్పులు,సీసాలు, ఆహార ప్యాకింగ్ వంటి వ్యర్థాలు పర్యావరణానికి హానికరంగా మారాయన్నారు. వీటిని రీసైక్లింగ్ చేయడం కూడా కష్టమన్నారు. సహజవాతావరణంలో ఎక్కువ కాలం భూమిలో కలవకుండా కలుషితం అవుతుందన్నారు. మొక్కలు, ఆహారం అంతా విషంగా తయారువుతోందని తెలిపారు. ప్లాస్టిక్‌ను కాల్చితే విషవాయువులు వెలువడి శ్వాససంబంధమైన వ్యాధులు వస్తున్నాయన్నారు. 120 మైక్రాన్ కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు అన్నిటినీ నిషేధిద్దామని సిఎం హితవు పలికారు. ఆగస్టు 15వతేదీకి రాష్ట్రసచివాలయంలో అసలు ప్లాస్టిక్ వాడకం అనేదిలేకుండా చేస్తామన్నారు. అక్టోబర్ 2గాంధీ జయంతి నాటికి 17 కార్పొరేషన్లలో, మునిసిపా >>2

## 23 దాకా భారీ వర్ష సూచన

### రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు

### గంటకు 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** ద్రోణి,ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఏపీలో పలు ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నాయి, దీంతో పలు జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈశాన్య బంగాళాఖాతం లోని ద్రోణి,ఉపరితల ఆవర్తన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఐఎండీ రెయిన్ ఎలర్ట్ చేసింది. మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈనేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) కీలక ఏపీని అలర్ట్‌ను జారీ చేసింది. జులై 19 నుంచి 23 వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ప్రత్యేకించి కేరళకు అతి భారీ వర్ష సూచన ఉందని తెలిపింది. జులై 19 నుంచి 20 వరకు ఆ రాష్ట్రంలో గరిష్ఠంగా 21 సెంటీమీటర్ల వర్షపాతం కురవొచ్చని ఐఎండీ అంచనా వేసింది. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా ప్రాంతం, దక్షిణ కర్ణాటక, లక్షద్వీప్‌లలోనూ అతిభారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు పేర్కొంది. రాబోయే ఐదు రోజుల పాటు దక్షిణాది రాష్ట్రాల్లోని తీర ప్రాంతాల్లో గంటకు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచేఅవకాశం ఉందని వాతావరణ విభాగం తెలిపింది. ఇదే సందర్భంలో రాబోయే ఐదు రోజులు >>2

# ఐసిఎఐ దేశానికి వెన్నెముక

### నేటి సిఎలు అధునాతన ఎఐ పరిజ్ఞానం కలిగి ఉండాలి

### త్వరలో కర్నూలులో డ్రోన్ సిటీ, కడపలో స్టీల్ ప్లాంట్, విశాఖలో ఎఎన్ఎస్ఆర్, సత్వజిసిసి, మిట్టల్ స్టీలు ప్లాంట్ రానున్నాయి: మంత్రి లోకేష్




శనివారం విజయవాడలో జరిగిన ఐసిఎఐ కార్యక్రమంలో మంత్రి లోకేష్‌కు అరుదైన జ్ఞాపికను ప్రదానం చేస్తున్న ప్రతినిధులు

**విజయవాడ.జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** కంప్యూటింగ్ రంగంతో అనుసంధానమైన ప్రతి అంశాల్లో అద్భుతాలు సాధించాలన్నదే ఏపీ ప్రభుత్వం ముందున్న కీలక లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.నేటి సీఏలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచవ్యాప్తంగా అవగాహన ఏఐఆధారిత కమ్యూనికేషన్, నైతికత కలిగి ఉండాలన్నారు.ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) అన్నది భారతదేశ మేధోశక్తికి వెన్నెముక లాంటిది. ఐసిఎఐ స్థాపించి 76 సంవత్సరాలు నిండినా ఆ సంస్థ ఇప్పటికీ యవ్వనంగానే ఉంది. ఇది భారతదేశంలో అతిపెద్ద సంస్థగా మాత్రమే కాదు, ప్రపంచంలోనే అతిపెద్ద అకౌంటింగ్ పవర్‌హౌస్‌గా ఉందన్నారు. గుంటూరు బండ్లమూడి గార్డెన్స్ లో ఐసిఎఐ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యాన"స్ఫూర్తి" పేరుతో నిర్వహించిన మెగా సిఎ విద్యార్థుల సమావేశానికి లోకేష్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఐసిఎఐ ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన, విశ్వసనీయ సంస్థగా గుర్తింపు పొందింది. ప్రపంచంలో ఫొరెన్సిక్ అకౌంటింగ్ ప్రమాణాలతో పనిచేస్తున్న మొట్టమొదటి సంస్థ ఇది. ఐసిఎఐ ద్వారా 10లక్షలమందికి పైగా చార్టర్డ్ అకౌంటింగ్ విద్యను అభ్యసిస్తుండగా, ప్రతిఏటా 2లక్షలమంది పరీక్షలు రాస్తున్నారు. 4.07 లక్షల మంది సభ్యులు, 54 విదేశీ చాప్టర్లు కలిగిన అతిపెద్ద సంస్థ ఐసిఎఐ. వ్యాపారం ఎక్కడ ఉంటే భారత్ అక్కడ ఉంటుంది, భారత్ ఎక్కడ ఉంటే అక్కడ ఐసిఎఐఉంటుంది.సౌత్ ఆసియా లోనే మొట్టమొదటి క్వాంటమ్ కంప్యూటర్ జనవరిలో అమరావతిలో ఆవిష్కృతం కాబోతోంది. గతంలో జన్మభూమి, స్వయం సహాయక సంఘాలు, ఇగవర్నెన్స్, ఐటీ హబ్‌లతో రాష్ట్ర చిత్రపటాన్ని మార్చేసిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీతో ఎపి రూపురేఖలు మార్చబో తున్నారు. మేం మార్పుకోసం వేచిచూడకుండా ఇక్కడనుంచే మార్పునకు శ్రీకారం చుడుతున్నాం. పెట్టుబడుల కోసం పొరుగు రాష్ట్రాలతో పోటీపడు తున్నాం. అభివృద్ధి కోసం పోటీపడతామే తప్ప రాజకీయ ఘర్షణ మా అభిమతం కాదు.అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో ముందుకు >>2

## విజయవాడలో

# లులు మాల్ ఏర్పాటు!

### రూ.1222 కోట్ల పెట్టుబడులు, 1500 మందికి ఉపాధి కల్పన

### ఆర్‌టిసికి గొల్లపూడి వద్ద ప్రత్యామ్నాయ స్థలం

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:**విజయవాడలో లులు మాల్ ఏర్పాటు కానుంది. పండిట్ నెహ్రూ బస్టాండ్‌కు సమీపంలోని పోలీస్ కంట్రోల్ రూమ్ జంక్షన్ వద్ద ఉన్న గవర్నర్‌పేట2 ఆర్టీసీ డిపో స్థలాన్ని ప్రభుత్వం లులు గ్రూప్‌కు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. లులు గ్రూప్ సంస్థ విశాఖపట్నం, విజయవాడల్లో మాల్స్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ రెండు చోట్లా కలిపి 1,222 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టడంతోపాటు 1,500 మందికి ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేసింది. దీంతో విజయవాడలో లులు సంస్థ మాల్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన భూమి కేటాయింపుపై ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ పరిశీలన చేసింది. చివరకు గవర్నర్‌పేట2 ఆర్టీసీ డిపో ఉన్న స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా డిపో స్థలాన్ని తమకు ఇవ్వాలంటూ ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిశోర్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఇటీవల లేఖ రాశారు. ప్రస్తుతానికి దీనిపై ఏ నిర్ణయం తీసుకోవాలనే దానిపై ఆర్టీసీ యాజమాన్యం పరిశీలిస్తోంది. ఆ స్థలాన్ని లులు మాల్‌కు ఇవ్వాలంటూ ప్రభుత్వ పెద్దల నుంచి సైతం ఆర్టీసీ ఎండీకి సూచన వచ్చినట్లు సమాచారం. గవర్నర్‌పేట2 ఆర్టీసీ డిపో సుమారు 5 ఎకరాల్లో ఉంది. ఇక్కడ గవర్నర్‌పేట2తో పాటు, ఒకటో డిపోకి చెందిన బస్సులను కూడా ఉంచుతారు. 1, 2 ఆర్టీసీ డిపోల మేనేజర్ల ఆఫీసులు సైతం ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడు ఈ భూమిని లులు మాల్ >>2

## మాజీ మంత్రి నారాయణ స్వామికి సిట్ నోటీసులు

### లిక్కర్ కేసు

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** లిక్కర్ స్కామ్ కేసులో గత ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా పని చేసిన నారాయణ స్వామికి సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు విచారణకు రావాలంటూ నోటీసుల్లో స్పష్టం చేసింది. కేసులో ఎంపి మిథున్ రెడ్డి ఈ రోజు విచారణకు హాజరయ్యారు. ఇదే కేసులో సిట్ అధికారులు ఇప్పటి వరకు మొత్తం 49 మందిని నిందితులుగా చేర్చారు. అందుతో 11 మందిని సిట్ అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఎ1గా కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి (రాజ్ కసిరెడ్డి), ఎ2 దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, ఎ3గా దొడ్డ వెంకట సత్యప్రసాద్, ఎ4 పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎ5 మాజీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి, ఎ6 సజ్జల శ్రీధర్ రెడ్డి, ఎ7గా ముప్పిడి అవినాష్ రెడ్డి, ఎ8గా బూనెటి చాణక్య, ఎ9గా తుకేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఎ10గా సైఫ్ అహ్మద్ ఉన్నారు.

# పరాకాష్టకు చేరుతున్న టిడిపి దుష్ట సంస్కృతి

### రోజాపై ఎమ్మెల్యే భానుప్రకాష్ వ్యాఖ్యలను ఖండిస్తున్నా: మాజీ సిఎం జగన్



**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:**టీడీపీ దుష్ట సంస్కృతి రోజు,రోజుకు పరాకాష్టకు చేరుతుందని మాజీ ముఖ్యమంత్రి వైసీపీ నేత, మాజీ మంత్రి వైఎస్ జగన్ ఆరోపించారు. మహిళనేతలపైన, కార్యకర్తలపై అత్యంత హేయంగా పోస్టింగులు పెట్టడం,అనుచిత ఆరోపణలు చేయడం టీడీపీ ఆధి నుంచి అనుసరిస్తున్న దుష్ట సంప్రదాయమన్నారు.మళ్ళీ తిరిగి బాధితులపైనే అభియోగాలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.మాజీ మంత్రి రోజాపై నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అనుచిత వ్యాఖ్యలు చేసినట్టుగా ఆరోపణలు వచ్చాయి.ఈ నేపథ్యంలో వైసీపీ అధినేత జగన్ వ్యవహారంపై స్పందించారు. రోజాపై టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో భారీ ట్వీట్ చేశారు. మాజీ మంత్రి రోజాపై టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయం. తెలుగుదేశం ప్పార్టీలో దారుణంగా మారిన దుష్ట సంస్కృతికి ఆ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపుతూ గట్టిగా మాట్లా డుతున్నందుకు, వాటిని ప్రశ్నిస్తున్నందుకూ ఓర్చుకోలేక, రెండుసార్లు ఎమ్మెల్యేగానూ, మంత్రిగానూ పని చేసిన నా సోదరి రోజాను అత్యంత అసభ్యకరమైన పదజాలంతో దూషించారు. ఇది యాదృచ్ఛికంగా జరిగింది కాదు. తమను విమర్శించే మహిళల గొంతు నొక్కడమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీలో ఒక తంతుగా మారిన అత్యంత హేయమైన సంస్కృతికి ఇది ఒక నిదర్శనం. గత ఏడాది కాలంగా అనేక మంది మహిళా నాయకులను వారు దారుణంగా వేధించారు, అవమానించారు. తనపై ఒక ఎమ్మెల్యే చేసిన అత్యంత హేయమైన వ్యాఖ్యలపై ఫిర్యాదు చేయడానికి రోజా వెళ్లగా, వాస్తవాలు స్పష్టంగా కళ్లెదుటే కనిపిస్తున్నా పోలీసులు తిరిగి ఆమెపైనే సందేహాలు వ్యక్తంచేశారు. ఇది రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఎంతదారుణంగా మారింది? టీడీపీ గుండాలను రక్షించేందుకు వారు >>2

# నేర చరితుల్ని ఊడ్చేయాలి

### నా జీవితంలో హత్యారాజకీయాలు లేవు

### తిరుపతి సభలో సిఎం చంద్రబాబు ఉద్వేగం

**తిరుపతి,జూలై 19ప్రభాతవార్తప్రతినిధి:**నా రాజకీయ జీవితంలో ఎప్పుడూ హత్యారాజకీయాలు లేవని, నక్సలిజం,ఫ్యాక్షన్ మతకలహాలపై పోరాడానని సిఎం చంద్రబాబు నాయుడు ఉద్వేగభరితంగా వెల్లడించారు. నక్సలైట్లు నన్ను చంపాలని చూస్తే ఆ వేంకటేశ్వరస్వామి కాపాడారని దేవునిపై విశ్వాసం మరోసారి గుర్తుచేసుకున్నారు. గత ఐదేళ్ళు ప్రజలకు స్వేచ్ఛలేదని, గత పాలకులు ప్రజల ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయలేదన్నారు. ప్రజల భూములను కబ్జాచేసేందుకు యత్నించారని అన్నారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం మధ్యాహ్నం తిరుపతిలోని పోలీసు మైదానంలో జరిగిన సమావేశంలో సిఎం చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత ఫ్యాక్షనిజం, మతకలహాలను నివారించామన్నారు. హత్యారాజకీయాలు చేయాలని చూస్తే ఎవరినీ వదలిపెట్టేదిలేదని, నేరస్థుల గుండెల్లో నిద్రపోతానని మరోసారి ఉద్ఘాటించారు. గతంలో వైసిపి నేతలు వివేకా హత్యను గుండెపోటుగా చిత్రీకరించారని, నారాసురరక్తచరిత్ర అని తనపై వివేకా హత్యనిందవేశారన్నారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో రోడ్డుపై మామిడి కాయలు పోసి పులివెందుల రాజకీయం చేశారని, అయితే మామిడి రైతులకు టన్నుకు 12వేల రూపాయలు ఇచ్చి ఆదుకున్నామని చంద్రబాబు తెలిపారు. రాజకీయాలు కలుషితమైపోయాయని, నేరచరిత్ర ఉన్న వాళ్ళు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. నేరరాజకీయాలు చేసేవాళ్ళు మనకు అవసరమా అని ప్రజలకు ప్రశ్నవేసి సమాధానం రాబట్టారు. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో హైటెక్‌సిటీ నెలకొల్పి ఐటికి ప్రాధాన్యతనిచ్చానని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు క్వాంటమ్ వ్యాలీకి ప్రాధాన్యత నిస్తున్నానన్నారు. ఎఐ అమలుచేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. వాట్సాన్‌గవర్నెన్స్ తీసుకువచ్చి ప్రభుత్వ సేవలు సులభతరం చేశామని సిఎం స్పష్టం చేశారు. ఈ గవర్నెన్స్ ద్వారా 700 సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో తిరుపతి నగరపాలకసంస్థకు స్వచ్ఛసర్వేక్షన్ అవార్డులు వచ్చాయని, వారిని మనస్ఫూర్తిగా అభినందించారు. రాష్ట్రం ప్రగతిపథంలో తీసుకెళ్ళే దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నానన్నారు. ప్రపంచంలో ఏ వస్తువు నిరుపయోగం కాదని, నిరుపయోగంగా ఉన్న వస్తువు నుండి సంపద సృష్టించవచ్చని సిఎం తెలిపారు. స్వర్ణాంధ్ర కార్పొరేషన్, మెప్మా శాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను చంద్రబాబు పరిశీలించి నిపుణులు, నిర్వాహకులతో మాట్లాడారు. అక్కడ ప్రదర్శించిన ఉత్పత్తుల వివరాలను తెలుసుకున్నారు. కొబ్బరివ్యర్థాలతో ఓ యువకుడు ఔత్సాహిక పారిశ్రామిక వేత్త తయారుచేసిన వస్తువులను సిఎం పరిశీలించారు. శ్రీవారిచిత్రమున్న మెమొంటోను ఆసక్తిగా తిలకించారు. తిరుమల,తిరుపతిలోనూ కొబ్బరిచిప్పలను కూడా కళారూపాలుగా వివిధ ఉపయోగకర వస్తువులూ రూపొందించే అంశాన్ని పరిశీలించాలని సిఎం చంద్రబాబు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభికి, తిరపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు, సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు నారాయణ, అనగాని సత్యప్రసాద్, తిరుపతి ఎంఎల్ఎ శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జలసుధీర్‌రెడ్డి, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, రాష్ట్రస్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి,పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.సుగుణమ్మ, సిఎం ప్రత్యేక కార్యదర్శి ప్రద్యుమ్న, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, నగరపాలక కమిషనర్ మౌర్య పాల్గొన్నారు.

**గ్రీన్ ఎనర్జీపై ప్రత్యేక దృష్టి:** చిన్నపుడు కరెంట్ లేక లాంథర్ వెలుతురులోనే చదువుకున్నానని సిఎం చంద్రబాబు బాల్యాన్ని >>2

20-7pg2exHMNWJQE.qxd:20-7pg2exHMNWJQE.qxd 01/01/01 9:11 AM Page 1





స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు కృషి చేసిన తిరుపతి మున్సిపల్ పారిశుధ్యసిబ్బందితో సిఎం చంద్రబాబు

# ప్లాస్టిక్‌పై పూర్తి నిషేధం

>> ట్టీల్లో ఒకేసారి వాడే ప్లాస్టిక్ వస్తువులను నిషేధిద్దామన్నారు. రాష్ట్రంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధాన్ని దశలవారీగా అమలుచేయడానికి ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించాలని చంద్రబాబు కోరారు. సర్క్యులర్ ఆర్థికవ్యవస్థ దిశగా మనం ప్రయత్నాలు చేయాలని అన్నారు. తిరుపతివంటి అంతర్జాతీయ ఆధ్యాత్మికకేంద్రం, పుణ్యక్షేత్రం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎవరూ కూడా ఇళ్ళల్లో ఊడ్చే చెత్త రోడ్లపై పడేయొద్దని, మన ఇల్లు, మన పరిసరాలు మనమే పరిశుభ్రంగా ఉంచుకొందామన్నారు. తడి,పొడి చెత్తగా ఇంటింటినుండి నగరపాలకసంస్థలు, మున్సిపాల్టీలో చెత్తసేకరణ చేస్తున్నాయని, ఇందుకోసం ప్రత్యేకంగా వాహనాలను సమకూర్చామన్నారు. తడిచెత్త నుండి కంపోస్టు తయారుచేసుకుని ఇంటిలోనూ వాడుకునేందుకు అవకాశం ఉందన్నారు. చెత్తనుండి సంపద సృష్టించుకోవాలన్నారు. తిరుపతికి సమీపంలోని రేణిగుంట తూకివాకంలో 300 ఎకరాల్లో సర్క్యులర్ ఎకానమీ కోసం ఓ పారిశ్రామిక పార్కును తయారుచేశామన్నారు. అక్కడ వినియోగించిన నీటిని సాగునీటి కోసం పంపిణీ చేస్తున్నామన్నారు. వివిధ తడి వ్యర్థపదార్థాల ద్వారా బయోగ్యాస్, కంపోస్టు, పొడిచెత్తతో ప్లాస్టిక్ గ్రాన్యుల్‌స తయారుచేసేందుకు అవకాశం ఉందని సిఎం తెలిపారు. తిరుపతిని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్ది దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుదామని బాబు పిలుపునిచ్చారు. బాధ్యత కలిగిన పౌరులుగా రోడ్లపై చెత్తవేయవద్దని ఆయన సూచించారు. జపాన్ వంటి దేశాల్లో ఎక్కడా రోడ్లపై చెత్తవేయరని,మనం కూడా ఈ విషయంలో వారిని ఆదర్శంగా తీసుకుందామని అన్నారు. స్వచ్ఛసర్వేక్షన్‌లో ఐదు అవార్డులు సాధించి దేశానికే ఆదర్శంగా నిలిచామని సంతోషం వ్యక్తం చేశారు. తిరుపతి,గుంటూరు, రాజమండ్రి, విశాఖకు,విజయవాడ నగరాలకు అవార్డులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా మన నగరాల స్వచ్ఛతకోసం పనిచేసిన పారిశుధ్యకార్మికులు, అధికారులను సహకరించిన ప్రజలను అభినందిస్తున్నానని సిఎం వెల్లడించారు. రాష్ట్రంలోని 123 మున్సిపాల్టీల నుండి 9వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం 86లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను రోడ్లపై వదిలేసి వెళ్ళిందని, దాన్ని తొలగించి రోడ్లపై చెత్తలేకుండా చూస్తామని సిఎం చంద్రబాబు తెలిపారు. అనంతరం స్వచ్ఛసర్వేక్షన్ అవార్డుఅందుకున్న తిరుపతి నగరపాలకసంస్థ పారిశుధ్యకార్మికులను,నగర కమిషనర్ మౌర్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, తిరుపతి ఎంఎల్‌ఎ శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జలసుధీర్‌రెడ్డి, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, రాష్ట్రస్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి,పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.సుగుణమ్మ, సిఎం ప్రత్యేక కార్యదర్శి ప్రద్యుమ్న, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, నగరపాలక కమిషనర్ మౌర్య, జిల్లా సంయుక్తకలెక్టర్ శుభంబన్సల్ ,స్వచ్ఛాంధ్రలో భాగస్వామ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయవాడలో లులు మాల్ ఏర్పాటు!

>> కోసం ఇస్తే, ప్రత్యామ్నాయంగా గొల్లపూడి సమీపంలో ఆర్టీసీకి 5 ఎకరాల భూమిని కేటాయించేలా ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే ఆ భూమికి సంబంధించిన వివరాలను సైతం ఆర్టీసీ యాజమాన్యానికి తెలియజేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశం గురువారం జరగగా, అందులో లులు గ్రూప్‌సంస్థ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. దీంతో త్వరలోనే గవర్నర్‌పేట2 ఆర్టీసీ డిపో స్థలాన్ని ఆ సంస్థకు కేటాయించనున్నట్లు ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ఈ స్థలంలోని కొంత భాగంలో గతంలో మున్సిపల్ కార్పొరేషన్ ఐరన్ స్క్రాప్ మెటీరియల్‌తో రూపొందించిన బొమ్మలతో పార్క్ ఏర్పాటు చేసింది. దీనిని కూడా లులు మాల్‌కు కేటాయించే అవకాశం ఉన్నట్లు సమాచారం.ప్రస్తుత గవర్నర్‌పేట2 ఆర్టీసీ డిపో ఉన్న ప్రదేశం ఒకప్పుడు విజయవాడ బస్టాండ్‌గా ఉండేది. అక్కడే విజయవాడ1 ఆర్టీసీ డిపో సైతం ఉండేది. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు పండిట్ నెహ్రూ బస్టాండ్ (శివితీళీ) నిర్మాణం చేపట్టారు. ఈ బస్టాండ్ నిర్మాణం 1990లో ప్రారంభమైంది. అప్పట్లో విజయవాడ1 ఆర్టీసీ డిపోని కూడా కొత్త బస్టాండ్ ఆవరణలోనే ఏర్పాటు చేశారు. దీంతో పాత బస్టాండ్ ఉన్న ప్రాంతాన్ని సిటీ బస్సుల కోసం గవర్నర్‌పేట2 ఆర్టీసీ డిపోగా పేరు మార్చారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలోనే లులు మాల్ రానుంది. విశాఖలో లులు గ్రూప్‌నకు భూమి కేటాయింపు: ఇప్పటికే విశాఖపట్నంలో లులు గ్రూప్ నిర్మించనున్న షాపింగ్ మాల్, హైపర్ మార్కెట్ల నిర్మాణానికి భూమిని కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. తిశిIIది ద్వారా లులు గ్రూప్‌కు విశాఖలో భూకేటాయింపులు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ బీచ్ రోడ్డులోని హార్బర్ పార్కులో ఉన్న 13.43 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి బదలాయించాలంటూ వీఎంఆర్డీఏకు ఈ ఏడాది మార్చి నెలలోనే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# 23 దాకా భారీ వర్ష సూచన

>> ఏపీలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. పిడుగులతో కూడిన వర్షాలతోపాటు ఈదురు గాలులు వీచే అవకాశముందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలంటూ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. శనివారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, గుంటూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలకు కురిసాయి. ఇక ఆదివారం ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నామని తెలిపారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఇక నిన్న అనకాపల్లి, ఏలూరు, కృష్ణా, అల్లూరి సీతారామరాజు, పల్నాడు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ప్రకాశం తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో రెండు వారాలకు పైగా వేసవిని తలపిస్తున్న ఎండలతో తిరుగుతున్న జనాలకు వర్షంతో ఉపశమనం లభించింది. **ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:** ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ, విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి అవగాహన కల్పించాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో 24 గంటల పాటు పని చేసే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ వెల్లడించారు. ప్రాణ, పశు నష్టం జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు.

# ఇక మరణ శిక్షకాదు, యావజ్జీవఖైదు
## రాజ్యాంగసవరణలు చేస్తున్న పాకిస్థాన్

**కరాచి,జూలూ 19:** పాకిస్థాన్ పార్లమెంటులో క్రిమినల్ లాస్ (అమెండ్‌మెంట్) బిల్లు2025 ఆమోదం పొందింది. ఈ బిల్లు టెర్రరిస్టులకు, హైజాకర్లకు ఆశ్రయం ఇవ్వడం, మహిళలకు బహిరంగంగా బట్టలు ఊడదీయడం వంటి నేరాలకు మరణశిక్షను రద్దు చేసి, బదులుగా జీవిత ఖైదును విధించేలా చేస్తుంది. ఈ బిల్లును పాక్ హోం శాఖ సహాయ మంత్రి తలాల్ చౌదరి చట్టసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు పాకిస్థాన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 354ఎ, 402సి లలో సవరణలు చేస్తున్నది. సెక్షన్ 354ఎ ప్రకారం, ఎవరైనా మహిళపై దాడి చేసి, ఆమె బట్టలు ఊడదీసి, బహిరంగంగా అవమానిస్తే, మరణశిక్ష లేదా జీవిత ఖైదు, జరిమానాతో శిక్షించబడతారు. కానీ, కొత్త బిల్లు ఈ నేరాలకు మరణశిక్షను తొలగించి, జీవిత ఖైదును తప్పనిసరి శిక్షగా విధిస్తుంది.

ఈ బిల్లు యూరోపియన్ యూనియన్‌తో జీఎస్‌పీ ప్లస్ వాణిజ్య ఒప్పందంలో భాగంగా అంతర్జాతీయ బాధ్యతలను నెరవేర్చేందుకు తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా, ఈ సవరణలకు పాకిస్థాన్ తెహ్రీక్‌ఎఇన్సాఫ్ (పీటీఐ) పార్లమెంటరీ నాయకుడు సయ్యద్ అలీ జఫర్, బలూచిస్థాన్ అవామీ పార్టీ సెనెటర్ సమీనా ముంతాజ్ జెహ్రీ తదితరులు వ్యతిరేకత వ్యక్తం చేశారు. మహిళలపై ఇటువంటి దాడులు హత్యకు సమానమైన నేరాలని, వీటికి మరణశిక్షను కొనసాగించాలని వారు వాదించారు. 1982లో జనరల్ జియా ఉల్ హక్ హయాంలో మహిళను బట్టలు ఊడదీయడం వంటి నేరానికి ఏడేళ్ల జైలు శిక్ష నుంచి మరణశిక్షగా మార్చినట్లు సెనెటర్ జఫర్ గుర్తు చేశారు. అయితే, ఈ చట్టాన్ని కొందరు కుటుంబ, ఆస్తి వివాదాల్లో దుర్వినియో గం చేస్తున్నారని, పోలీసులకు లంచాలు ఇచ్చి తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని మంత్రి తలాల్ వెల్లడించారు. మరోవైపు ఈపరిణామాలపై చైనా సానుకూలంగా స్పందించడం గమనార్హం.

# పవన్ నటించిన హరిహర వీరమల్లు సినిమా టికెట్ రేట్లు పెంపు

**విజయవాడ,జులై19,ప్రభాతవార్తప్రతినిధి:** పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా టికెట్ రేట్లు పెంచుతూ ఏపీ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. 14 రోజుల పాటు టికెట్ రేట్లు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాలని నిర్మాత ఏ ఎం రత్నం నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, 14రోజుల పెంపు విజ్ఞప్తిని తిరస్కరించిన ఏపీ సర్కార్ పది రోజులకు మాత్రమే టికెట్ ధరను పెంచుకునేలా అనుమతి ఇస్తూ నిర్ణయం చేసింది. తద్వారా అన్ని సినిమాలను సమానంగానే చూస్తామంటూ సంకేతాలు ఇచ్చారు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. ఈసారి టిక్కెట్ ధర పెంపు పై స్వయంగా నిర్ణయం వెలువరించిన ముఖ్యమంత్రి కార్యాలయం.. మరి కాసేపట్లో దీనిపై అధికారి ఉతర్వులు జారీ చేసే అవకాశం ఉంది. ఈ ఏడాది విడుదల కానున్న భారీ చిత్రాల్లో హరి హర వీరమల్లు ఒకటి. పవన్ కళ్యాణ్ కథానాయకుడు. జ్యోతి కృష్ణ దర్శకుడు. ఏ.ఎం.రత్నం సమర్పణలో ఏ.దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంపై అభిమానుల అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. యోధుడు వీరమల్లు పాత్రలో పవన్ నటిస్తున్నారు. మొఘల్ రాజుల నుంచి కోహినూర్ వజ్రాన్ని చేజిక్కించుకోవడంతోపాటు, ప్రేక్షకుల మనసు దోచుకునేందుకు వీరమల్లు సిద్ధమవుతున్నారు. అభిమానులంతాఎంతగానో ఎదురుచూస్తున్న ఈ చిత్రాన్ని మొదట మార్చి 28న విడుదల చేయాలని అనుకున్నారు. అయితే, కొన్ని సాంకేతిక కారణాల రిత్యా ఈ సినిమా జులై 24వ తేదీన రిలీజ్ కానుంది.

# పరాకాష్టకు చేరుతున్న టిడిపి దుష్ట సంస్కృతి

>> ఏ స్థాయిలో తమ బాధ్యత, కర్తవ్యాన్ని మర్చి వ్యవహరిస్తున్నారన్నది చూపుతున్నాయి. నిజానికి ఒక్క రోజా విషయంలోనే కాదు. మాజీ మంత్రి విడదల రజని, కృష్ణా జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికతో పాటు, మా పార్టీకి చెందిన పలువురు నాయకుల కుటుంబ సభ్యుల విషయంలో కూడా చాలా అవమానకర ఘటనలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఏ మాత్రం రక్షణలేకుండాపోయింది. వారికి కనీసగౌరవ, మర్యాదలు దక్కడం లేదు. వారికి ఏ విధంగానూ న్యాయం జరగడంలేదు.ఇకనైనా మాజీమంత్రి రోజాను దారుణంగా అవమానించిన ఎమ్మెల్యే భానుప్రకాశ్‌ను తక్షణమే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అంటూ జగన్ డిమాండ్ చేశారు.

# ఐసిఎఐ దేశానికి వెన్నెముక

>> వెళ్తున్నాం. భారతదేశం గర్వించదగిన ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా కుటుంబసభ్యులు అందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నేను చార్టర్డ్ అకౌంటెంట్ కాకపోయినా స్టాన్ఫోర్డ్ ఎంబీఏ గ్రాడ్యుయేట్‌గా సిఏ ప్రాధాన్యత నాకు తెలుసు. ఇది కేవలం ఒక కోర్సు కాదు, నిబద్ధత కూడుకున్న విద్య. మా కుటుంబ వ్యాపారాల్లో సిఏల కష్టాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. మా ప్రభుత్వం సీఏల ఇన్‌పుట్‌లకు విలువ ఇస్తుంది, పాలనా నిర్ణయాలలో మేము సీఏలను సంప్రదిస్తాము. మీరు బ్యాలెన్స్ షీట్‌లను మాత్రమే ధృవీకరించరు, రాష్ట్ర ఆర్థిక వెన్నెముకను తయారు చేస్తారు. న్యూ ఏజ్ సీఏ అనేది కాలిక్యులేటర్ కంటే ఎక్కువ. భారతదేశ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఫ్యాక్టరీ గుంటూరు నగరం. ఆశ్చర్యకరంగా గుంటూరు సిటీ వైద్యులు, ఇంజనీర్లకంటే ఎక్కువగా సిఏలను తయారుచేస్తోంది. డాక్టర్లు, ఇంజనీర్లకంటే సిఏ చదువుతున్న 10వేలమంది విద్యార్థుల సంఖ్య ఎక్కువ. ఈ కార్యక్రమంలో నారా లోకేష్‌కు అరుదైన జ్ఞాపికనను ఐసిఎఐ ప్రతినిధులు,విద్యార్థిని,విద్యార్థులు అందించారు,.ఈ సమావేశంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఐసిఎఐ వైస్ ప్రెసిడెంట్ డి.ప్రసన్నకుమార్, సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ముప్పాళ్ల సుబ్బారావు, గుంటూరు బ్రాంచి చైర్మన్ ఎన్.రాజశేఖర్, సదరన్ ఇండియా చార్టర్డ్ అకౌంటెంట్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ గుంటూరు బ్రాంచ్ చైర్మన్ చింతా రఘునందన్, వైస్ చైర్మన్ బి.ఝాన్సీ లక్ష్మి, కార్యదర్శి వనిమిరెడ్డి వి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.



శనివారం విశాఖలో తలసేమియా రన్‌ను ప్రారంభిస్తున్న భువనేశ్వరి తదితరులు

# ‘తలసేమియా రన్’ కు విశేష స్పందన
## పాల్గొన్న సిఎం సతీమణి భువనేశ్వరి, కరణం మల్లీశ్వరి, తమన్
### విశేషంగా ఆకట్టుకొన్న స్త్రీశక్తి కార్యక్రమం

**విశాఖపట్నం, జులై 19 ప్రభాతవార్త:** తలసేమియా వ్యాధి పై అవగాహనా కల్పించే కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌లో నిర్వహించిన 10కె, 5కె, 3కె రన్ కు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా ఎన్టీఆర్ ట్రస్ట్ ఛైర్మన్, నారా భువనేశ్వరి, ఒలింపిక్ పతక విజేత కరణం మల్లీశ్వరి, ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ లు హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమం లో ఎన్టీఆర్ ట్రస్ట్ ఛైర్మన్, నారా భువనేశ్వరి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఆహ్వానించిగానే హాజరైనా కరణం మల్లీశ్వరి, తమన్ లకు కృతజ్ఞతలు తెలిపారు. 1997 ఫిబ్రవరిలో ఎన్టీఆర్ ట్రస్ట్ స్థాపించిన నాటి నుండి ఇప్పటివరకు 8 లక్షల మందికి రక్తం అందించామని, 15వేల ఆర్యోగ శిబిరాలు నిర్వహించామని తెలిపారు. అదేవిధంగా స్త్రీ ల అభ్యున్నతికి స్త్రీ శక్తి కార్యక్రమం ద్వారా చేయూత అందిస్తున్నామని, తెలిపారు. అంతేకాకుండా రానున్న రోజుల్లో ప్రజల విద్య, ఆరోగ్యం అభ్యున్నతికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆమె అన్నారు. అనంతరం రాన్ విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించారు. రన్ తర్వాత ఆర్ కె బీచ్ లో తమన్, సమీరా భరద్వాజ్ నేతృత్వంలో మ్యూజికల్ నైట్ నిర్వహించారు. ఇప్పటికే తలసేమియా బాధితులకు అండగా నిలిచే లక్ష్యంతో ఎన్టీఆర్ ట్రస్ట్ అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఈ ఏడాది జనవరిలో విజయవాడవేదికగా యుఫోరియా మ్యూజికల్‌నైట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకుడు తమన్, ట్రస్ట్ సీఈఓ రాజేంద్ర పాల్గొన్నారు. అలాగే ఫిబ్రవరి 15న ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఈ కన్సర్ట్‌ని నిర్వహించారు. ప్రస్తుతం తలసేమియాపై అవగాహన కోసం విశాఖ ఆర్కే బీచ్‌లో 10కె, 5కె, 3కె రన్ చేపట్టారు.

# ప్రభుత్వ పాఠశాలల ముందు ‘ప్రవేశాలు లేవు’ బోర్డులు రావాలి: మంత్రి లోకేష్
## నాణ్యమైన విద్య అందిస్తున్నామని తల్లిదండ్రుల్లో నమ్మకం కల్గించాలి
### పెనమలూరు జడ్పీ హెచ్‌ఎం దుర్గాభవానీని సన్మానించిన మంత్రి

విజయవాడ,జులై 19,ప్రభాతవార్త ప్రతినిధి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడం ద్వారా ప్రవేశాలు పెంచడమే తమ లక్ష్యమని రాష్ట్ర విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. కృష్ణాజిల్లా పెనమలూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అద్భుత ఫలితాలు సాధించిన ప్రధానోపాధ్యాయురాలు యలమంచిలి దుర్గాభవానిని ‘షైనింగ్ టీచర్’ పేరుతో ఉండవల్లి లోని తన నివాసంలో మంత్రి శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘మా లక్ష్యం ఒక్కటే,వచ్చే నాలుగేళ్ళల్లో ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గాలి.ప్రభుత్వ బడుల్లో పెరగాలి.ప్రభుత్వ పాఠశాలల ముందు ‘ప్రవేశాలు లేవు’ అనే బోర్డులు ఉండాలి. అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య అందిస్తారని తల్లిదండ్రులు నమ్ముతారు.మనం నిజంగా విజయం సాధించిన వారమవుతాం.ఇందుకోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం.క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు ఉపాధ్యాయులను నేరుగా కలవాలని నిర్ణయం తీసుకున్నాం. వచ్చే నాలుగేళ్ళు విద్యార్థుల అభ్యసన ఫలితాలపై దృష్టి సారిస్తాం’ అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రధాన ఉపాధ్యాయురాలు దుర్గాభవాని నుంచి మంత్రి ఈ సందర్భంగా సలహాలు సూచనలు తీసుకున్నారు. అద్భుత పనితీరుతో ఉపాధ్యాయులందరికీ ఆదర్శంగా నిలిచారని ఆమెను ప్రశంసించారు.పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పదేళ్ళు పనిచేసిన దుర్గాభవాని వృత్తి పట్ల నిబద్ధత చూపి విద్యార్థులను సమున్నతంగా తీర్చిదిద్దారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 54 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. ఏడుగురు విద్యార్థులు ట్రిపుట్ ఐటీలో ప్రవేశాలు పొందారు.రాష్ట్రంలో మొదటిసారి ప్రభుత్వ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఈవెంట్ నిర్వహించారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ ద్వారా వాల్ ఆర్ట్స్,డాన్స్,మ్యూజిక్ తరగతులు కంప్యూటర్ శిక్షణ అందించారు. ఈ పాఠశాల విన్నూత్న ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచింది. అటల్ టింగరింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు వారే విన్నూత్న పరిష్కారాలు కనుగొంటున్నారు. తడిచిన ధాన్యం ఆరబోసే యంత్రంతో పాటు పాఠశాలలో చెత్తను శుభ్రం చేసేందుకు పాత వస్తువుల నుంచి బ్లోయర్ తయారీ,ఆల్కాహాల్ సెన్సింగ్ హెల్మెట్ వంటివి ఇక్కడి విద్యార్థులు రూపొందించారు.



శనివారం కపిలేశ్వర ఆలయాన్ని శుభ్రం చేస్తున్న సిఎం చంద్రబాబు

# కపిలేశ్వరుని ఆశీస్సులందుకున్న సిఎం చంద్రబాబు
## ఆలయం శుభ్రం చేసిన ముఖ్యమంత్రి

**తిరుపతి,జులై 19ప్రభాతవార్తప్రతినిధి:** మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుపతికి విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడు మధ్యాహ్నం కైలాసం కపిలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఇక్కడ ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కపిలేశ్వరుని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో చెత్త ఊడ్చుతున్న పారిశుధ్యసిబ్బందితో కలసి చేతిలో చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు.కార్మికులతో సరదాగా సిఎం చంద్రబాబు కలసి పనిచేయడంతో కార్మికులు కూడా స్ఫూర్తి పొందారు. **కందిమలం పండితుల ఆశీర్వచనం:** తిరుపతి పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం అలిపిరి వద్ద కందిమలంశెట్టి మహామండపాన్ని సిఎం చంద్రబాబు సందర్శించారు. ఇక్కడ వేదపండితులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఎంపి మిథున్ రెడ్డి అరెస్టు

>> భాగంగా తనను అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో మిథున్ రెడ్డి పేర్కొన్నారు.అయితే, ఈ పిటిషన్ పై వాదనలువిన్న సుప్రీంకోర్టు ధర్మాసనం.. ముందస్తు బెయిల్ కోసం మిథున్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. దీంతో శనివారం విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారణకు మిథున్ రెడ్డి హాజరయ్యారు. అంతకుముందు ఢిల్లీ నుంచి గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకున్న మిథున్ రెడ్డికి వైసీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఆయన సిట్ కార్యాలయంకు చేరుకున్నారు. గన్నవరం ఎయిర్ పోర్టులో మీడియాతో మాట్లాడిన ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

**రాజకీయ కక్షతో నా పై తప్పుడు కేసు:** సిట్ విచారణకు హజరయ్యే ముందు మిథున్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాజకీయ కక్షతో తప్పుడు కేసులు పెట్టి.. తాత్కాలికంగా రాక్షస ఆనందం పొందుతున్నారని కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటి మాటలతో కేసు పెట్టారు,ఎలాంటి ఆధారాలు లేవు. కేసులను చట్టపరంగా ఎదుర్కొంటామని మిథున్ రెడ్డి చెప్పారు.విచారణ అనంతరం తనను అరెస్ట్ చేస్తారని ఇందు తాను భయపడనన్నారు.అరెస్ట్ చేస్తే చట్టపరంగా పోరాడి బయటకు వస్తాను.న్యాయం స్దానం బెయిల్ ఇస్తుందని నమ్ముతున్నట్లు తెలిపాను. మిథున్ రెడ్డి సిట్ కార్యాలయం వద్దకు చేరుకోవటంతో పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. సిట్ కార్యాలయం వద్ద బారికేట్లు పెట్టిన పోలీసులు, ట్రాఫిక్ పక్క రోడ్లకు మళ్లించారు. సిట్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# మద్యం కుంభకోణంపై ప్రాథమిక నివేదిక సమర్పించిన సిట్

>> ల్యాబ్ నివేదికలు, ఎలక్ట్రానిక్ పరికరాలను జత చేసారు.మొత్తం రూ.62 కోట్లును సీజ్ చేసినట్లుగా ఈ ప్రైమరీ చార్జీ షీట్‌లో సిట్ వివరించినట్లు సమాచారం 268 మంది సాక్షులను విచారించినట్లు చార్జీషీట్‌లో వెల్లడించారు.11 మంది వాంగ్మూలాలు, రిమాండ్ రిపోర్టులు,ఇతర పత్రాలను దీనికి జత చేసారు.బ్యాంకులు, ఆస్పత్రుల్లో పెట్టుబడులపై వాంగ్మూలాలు పొందుపరిచిన సిట్, బంగారు దుకాణాలు, స్థిరాస్తి సంస్థల్లో పెట్టుబడులపై వాంగ్మూలాలు పొందుపరిచిన సిట్ మిథున్‌రెడ్డి పాత్రపై ఈ ఛార్జ్‌షీట్‌లో పేర్కొనని సిట్ అధికారులు 20 రోజుల్లో మరో ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని పేర్కొన్న సిట్. త్వరలో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని సిట్ అధికారులు తెలిపారు.2024 సెప్టెంబర్ 25 న కేసు నమోదు చేసిన సీఐడీ 2024 అక్టోబర్ 22, 23 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా మద్యం డిస్టిలరీ కంపెనీల్లో తనిఖీలు 2025 ఫిబ్రవరి 5న మద్యం కుంభకోణంపై సిట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో 2019 అక్టోబర్ నుంచి 2024 మార్చి వరకు రాష్ట్రంలో మద్యం అక్రమాలపై సిట్ విజయవాడ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో మొత్తం ఏడుగురు సభ్యులతో సిట్. సిట్‌కు కావాల్సిన సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ శాఖను ఆదేశించింది. తర్వాత ప్రతి 15 రోజులకోసారి దర్యాప్తు అంశాలను ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. మద్యం కేసులో మిథున్‌రెడ్డి అరెస్టుకు ఈనెల 18న ఏసీబీ కోర్టులో సిట్ పిటిషన్ దాఖలు చేసారు.

# నేర చరితుల్ని ఊడ్చేయాలి

>> గుర్తుచేసుకున్నారు. నేటు ఇంటిపైనే సోలార్‌కరెంట్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. 20లక్షల ఇళ్ళపై సోలార్ విద్యుత్‌కు అనుమతించామన్నారు. ఇల్లూ, కార్యాలయాలు, పొలాలు కరెంట్ ఉత్పత్తి చేసే కేంద్రాలుగా తయారవుతున్నాయని అనుభూతి వ్యక్తం చేశారు. ఒకప్పుడు కరెంట్ బొగ్గుతో తయారయ్యేదని, నేడు గాలితో కరెంట్ ఉత్పత్తి వచ్చిందని, గ్రీన్‌ఎనర్జీపై శ్రద్ధపెట్టానని సిఎం అన్నారు. గ్లోబల్‌వార్మింగ్ వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని, దీనికి పరిష్కారం గ్రీన్ ఎనర్జీనేనని అన్నారు. అనంతరం బంగారుకుటుంబాలు ఎంపికైన కుటుంబసభ్యులతో చంద్రబాబు ప్రత్యేకంగా ముచ్చటించారు. వారి కుటుంబం ఆర్థికంగా ముందుకు రావడానికి కృషిని వివరించారు.

# ట్రక్కుల పరిశ్రమను ఏపిలో నెలకొల్పండి
## ఆనంద్ మహీంద్రాకు లోకేష్ వినతి

**విజయవాడ,జూలై 19,ప్రభాతవార్తప్రతినిధి:** మహీంద్రా ట్రక్కుల తయారీ పరిశ్రమను ఏపీలో నెలకొల్పాలని మహీంద్రా గ్రూపు అధినేత ఆనంద్ మహీంద్రాను మంత్రి నారా లోకేష్ కోరారు. మహీంద్రా బృందానికి ఆతిథ్యం ఇచ్చి...రాష్ట్రంలో ఉన్న విస్తృత అవకాశాల గురించి వివరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మహీంద్రా కంపెనీ మార్కెటలోకి విడుదల చేసిన కొత్త ట్రక్కుపై తెలుగులో రూపొందించిన వాణిజ్య ప్రకటనను ఆనంద్ మహీంద్రా తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేయగా దాన్ని లోకేష్ రీపోస్టు చేశారు. ‘మీ తెలుగు ప్రకటన చాలా బాగుంది.ట్రక్కులకు ఏపీలో అతి పెద్ద మార్కెట్ ఉది. రాష్ట్రంలో మీరు పరిశ్రమను ఏర్పాటు చేస్తే మా ఆటోమోటివ్ ఎకోసిస్టమ్‌కు ఉపయుక్తంగా ఉంటుంది’అని పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

20-07-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
అషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
దశమి మ.12.12
కృత్తిక రా.10.53
వర్జ్యం : మ.1.43-3.11
దు.సా.4.56-5.48, 2)సా.5.07-6.44
శుభసమయం: ఉ.6.30-7.15, సా.7.00-8.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** వివాహ యత్నాలు అనుకూలిస్తాయి. వీసా, పాస్‌పోర్ట్ వంటి అంశాలు అనుకూలిస్తాయి.

**వృషభం :** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. జీవిత భాగస్వామి నుండి సహాయ సహకారాలు అందుతాయి.

**మిథునం:** సంతానం నూతన ప్రయత్నాలలో విజయం సాధిస్తారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**కర్కాటకం :** ఉద్యోగాల్లో పదోన్నతులు పొందుతారు. రాజకీయ, కళారంగాల వారికి అనుకూల పరిస్థితులు.

**సింహం:** కోర్టుకేసుల నుండి బయట పడతారు. ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది.

**కన్య :** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకు పరుస్తాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు.

**తుల :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన సన్నిహితుల సాయంతో పూర్తిచేస్తారు.

**వృశ్చికం:** దైవకార్యక్రమాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించండి.

**ధనుస్సు:** ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. నూతన మిత్రులు పరిచయమై కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**మకరం:** ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు అవకాశాలున్నాయి. నూతన భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**కుంభం:** శ్రమాధికంతో కార్యక్రమాలు పూర్తికాగలవు. భాగస్వామ్య వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**మీనం :** ఆదాయ మార్గాలు పెరుగుతాయి. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు పొందుతారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

3rd Page ONG 20-07Pg3exHMNWJQETL.qxd:20-07Pg3exHMNWJQETL.qxd 01/01/01 10:14 AM Page 1



# రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం: మంత్రి సవిత

**వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం**

**మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



మొక్కలు నాటుతున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే, మాజీమంత్రి

**నల్లమాడ జూలై 19 ప్రభాతవార్త,** కూటమి పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మారుస్తామని రాష్ట్ర బీసీ చేనేత సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ పేర్కొన్నారు. శనివారం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర మంత్రి సవితమ్మ కు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నల్లమాడ సమీపంలోని రాగానిపల్లి రహదారి సమీపంలో నిర్మించిన వ్యవసాయ గోడౌన్ వద్ద రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ ,ట్రీ సేస్ ప్రతినిధులు అనురాగ్ మనోహర్ సహకారంతో రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి మంత్రి సవిత ఎమ్మెల్యే పల్లె సిందూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలు తయారుచేసిన హ్యాండ్స్ క్రాఫ్ట్స్ వస్తువులను మంత్రి సవితమ్మతో పాటు ఎమ్మెల్యే ,మాజీ మంత్రి పరిశీలించారు. రెడ్స్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగానికి సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు అందిస్తూ వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా నడిపిస్తున్న రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి రూ.3857 కోట్ల తో హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్ గా తయారు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని పిలుపునిచ్చారు. ఇన్ఫోసిస్ సంస్థ సహకారంతో చెట్లు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రెడ్స్ సంస్థ ప్రతినిధి భానుజ గారిని అలాగే సేస్ ట్రీ ప్రతినిధులు మనోహర్ అనురాగ్ లను ఎమ్మెల్యే అభినందించారు. నియోజకవర్గంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు. రైతులు పండ్లతోటల పెంపకం ద్వార ఆదాయ మార్గంలో పయనించవచ్చునని పేర్కొన్నారు. రైతులు చిరుధాన్యాలను పండించి మంచి పౌష్టికాహారాన్ని ప్రజలకు అందించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి హరితాంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో సబ్సిడీతో వ్యవసాయ పరికరాలను అందిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ సాగుచేసిన పంటలకు ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు .పుట్టపర్తి నియోజకవర్గానికి కృష్ణా జిల్లాలో తీసుకొచ్చి మరో కోస్తా ఆంధ్రగా మారుస్తామన్నారు. 2014 నుంచి 2019 వరకు మరియు 2019 నుంచి 2024 వరకు చేసిన అభివృద్ధి పనులకు త్వరలో బిల్లులు చెల్లిస్తామన్నారు.

## వక్ఫ్ ఆస్తులను స్థిరమైన ఆదాయం పెంచే విధంగా అభివృద్ధికి చర్యలు

**విజయవాడ,జూలై 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ నగరంలోని పలు వక్ఫ్ ఆస్థులను పరిశీలించారు. ముందుగా విజయవాడ లోని కాళేశ్వరరావు మార్కెట్ వద్ద గల ముసాఫిర్ ఖానాను పరిశీలించారు. అక్కడి పరిస్థితుల గురించి అధికారులనడిగి తెలుసుకున్నారు. అక్కడ ఆదాయం పెరిగే విధంగా తీసుకోవాల్సిన చర్యలు సూచించి తక్షణమే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇబ్రహీంపటనం మండలం కొండపల్లి గ్రామం లోని 3.21 ఎకరాల వక్ఫ్ భూమిని పరిశీలించారు. ప్రస్తుతం అందులో 1.4 ఎకరాల భూమి ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ స్థానిక ప్రాధ్యానం,భవిష్యత్ అవకాశాలు దృష్టిలో పెట్టుకొని సదరు భూమి నందు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయించారు. వక్ఫ్ బోర్డుకు స్థిరమైన ఆదాయం పెరిగే విధంగా చర్యలు తీసు కుంటామని తెలిపారు. వారితో పాటు వక్ఫ్ బోర్డు సభ్యులు అక్రమ్,సీఈఓ మొహమ్మద్ ఆలీ,వక్ఫ్‌బోర్డు అధికారులు,మాజీ కార్పొరేటర్ ఫతావుల్లా ఉన్నారు.

# తిరుమల సమాచారం

## టిటిడి ఈ యేడాది వినూత్న నిర్ణయం శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఇస్రో సేవలు



**తిరుమల,జూలై 19ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలకు సాధారణరోజుల్లోనే 90వేలమంది వరకు భక్తులు వస్తుండగా ఏడాదిలో తొమ్మిదిరోజులు జరిగే స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు భక్తులు అశేష సంఖ్యలో చేరుకుంటారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది టిటిడి వినూత్నంగా ఇస్రో సేవలు అందుకుని భక్తుల భద్రతపై మరింత దృష్టి సారించనుంది. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల ప్రణాళికల రూపకల్పనలో ఇస్రో సేవలు వినియోగించుకునేందుకు ఆలోచన చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన వాహనసేవల్లో పాల్గొంటున్న భక్తుల సంఖ్యను ఏర్పాట్లుబట్టి టిటిడి లెక్కిస్తోంది. సెప్టెంబర్ 24న తిరుమలలో మొదలుకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు 28వతేదీ రాత్రి గరుడసేవ రోజు భక్తులు మాఢవీధులు, గ్యాలరీలు, కొండంతా వేచివుంటారు.ఇలా భక్తులను లెక్కించడానికి అత్యాధునిక శాటిలైట్ వినియోగం కోరుతోంది. సమాచారాన్ని తెలుసుకునేందుకు తగిన ఏర్పాట్లు కూడా చేసుకునే ఆలోచనలో టిటిడి ఉంది.

## నేటి నుండి శ్రీవారి పుష్కరిణి మూసివేత



**తిరుమల,జూలై 19ప్రభాతవార్తప్రతినిధి:** సెప్టెంబర్‌లో జరగనున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు నెలరోజుల ముందు తిరుమల స్వామివారి పుష్కరిణి మూసివేసి మరమ్మతులు చేయడం పరిపాటి. ఇందులో బాగంగా నేటి నుండి ఆగస్టు 19వరకు స్వామివారి పుష్కరిణి మూసివేస్తున్నారు. పుష్కరిణిలో పైపులు,ఇంకా ఏదేని మరమ్మతులు చేసి మళ్లీ కొత్తనీటిని విడుదల చేస్తారు. ఈ నెలరోజులు భక్తులు స్నానాలకు వరాహస్వామి ఆలయం సమీపంలో కొళాయిలు ఉంటాయి. నెలరోజులు పుష్కరిణి హారతి కూడా రద్దుచేశారు. భక్తులు సహకరించాలని టిటిడి కోరింది.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నాం: ప్రముఖులు



**తిరుమల,జూలై 19ప్రభాత వార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం సంతోషమని ప్రముఖులు తెలిపారు. శనివారం ఉదయం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి,రాష్ట్రమంత్రి నారాయణ, సినీ సంగీత దర్శకుడుమణిశర్మ కుటుంబంతో కలసి తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో వీరంతా వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని దేవదేవుని ఆశీస్సులందుకున్నారు. శ్రీవారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## టిటిడిలో మరో నలుగురు అన్యమత ఉద్యోగులపై వేటు

**తిరుమల,జూలై 19ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడిలో విధులు నిర్వహిస్తూ హిందూ మతాన్ని గాకుండా అన్యమతాన్ని ఆచరిస్తున్న మరో నలుగురు ఉద్యోగులపై టిటిడి ఇఒ శ్యామలరావు చర్యలు తీసుకున్నారు. అన్యమతం ఆచరిస్తున్నట్లు ఆధారాలతో నివేదికలు అందడంతో వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. శనివారం అన్యమతాన్ని ఆచరిస్తున్నట్లు టిటిడిలో క్వాలిటీ కంట్రోల్ విభాగం డిప్యూటీ ఇఇ బి.ఎలిజర్,బర్డ్ ఆస్పత్రి స్టాఫ్ నర్స్ ఎస్.రోషి,గ్రేడ్ 1 ఫార్మాసిస్ట్ ఎం.ప్రేమావతి, ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీకి చెందిన డాక్టర్ జి.,అసుంతలను టిటిడి సస్పెండ్ చేసింది. అన్యమత ఆచరిస్తున్నారనే ఆధారాలతో టిటిడి ప్రవర్తనా నియమావళిని పాటించలేదని ,ధార్మికసంస్థకు భంగం కలిగించేలా ప్రవర్తించారనిశాఖాపరమైన చర్యలతో బాటు సస్పెండ్ చేయడం జరిగింది. గతంలో ఇద్దరిని సస్పెండ్ చేసిన విషయం విదితమే.

## డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టుల్లోకి మారేందుకు దరఖాస్తుల స్వీకరణ

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** డిగ్రీలో అమలుచేయనున్న సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం లోకి కళాశాలలు మారేందుకు అవకాశం కల్పిస్తూ ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేసింది.2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి స్వల్ప మార్పులతో సింగిల్ మేజర్ విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. అందులో భాగంగా ఎయిడెడ్,ప్రైవేట్ ఎయిడెడ్ కళాశాలలు సబ్జెక్టులను మార్చుకునేందుకు ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించింది. ఇప్పటికే డబుల్ మేజర్ విధానం లోకి మారేందుకు కళాశాలలు రూ.5వేల చొప్పున చెల్లించినందున మరోసారి చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారం నుంచి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పింది. ధరఖాస్తులు సమర్పించేందుకు ఈ నెల 24 చివరి గడువని,అపరాధ రుసుం రూ.2వేలతో 27 వరకు,రూ.5వేలతో 30 వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొంది. ధరఖాస్తుల పరిశీలన 25 నుంచి 31 వరకు ఉంటుందని షరతులతో కూడిన ప్రొవిజనల్ ప్రొసీడింగ్‌ను ఆగస్టు 1న జారీ చేస్తామని వెల్లడించింది.

## ఎన్టీఆర్ జిల్లాలో ఇరిగేషన్ ఎఇఇ అదృశ్యం

**రిలీవ్ చేయకుండా అధికారులు, ఎమ్మెల్యే వేధిస్తున్నారని సూసైడ్ నోట్**

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** తాను బదలీ అయినా రిలీవ్ చేయకుండా అధికారులు ఎంఎల్ఏ వేధిస్తున్నారని, దీంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని జల వనరుల శాఖ ఎఇఇ రక్తంతో లేఖ రాసి అదృశ్యమయ్యారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో గురువారం జరిగిన ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. 'ప్రభుత్వం బదిలీ చేసి నెల రోజులవుతున్నా రిలీవ్ ఆర్డర్ ఇవ్వకుండా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఇఇ,స్పెషల్ డివిజన్,విజయవాడ) పి.గంగయ్య డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డిఇ,స్పెషల్ సబ్ డివిజన్,కంచికచర్ల) ఎస్.ఉమాశంకర్,తిరువూరు ఎంఎల్ఏ కొలికపూడి శ్రీనివాసరావు కలిసి ఆడుతున్న రాజకీయ నాటకంలో నేను అలిసిపోయాను.ఒక దళిత ఉద్యోగిగా నాకు జరిగిన అన్యాయం ఇంకెవరికీ జరుగకుండా చర్యలు తీసుకోవాలి' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు,మంత్రి నారా లోకేష్‌కు,ఎస్‌సి కమీషన్ చైర్మన్ కెఎస్ జవహర్‌క ు విజ్ఞప్తి చేస్తూ తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖ రాసి ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఎఇఇ) వేసుపోగు కిషోర్ అదృశ్యమయ్యారు. ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాటు గ్రామానికి చెందిన కిషోర్ జల వనరుల శాఖలో తిరువూరు ఎఇఇగా పని చేస్తున్నారు గత నెల 16న నాగార్జున సాగర్ కెనాల్ (ఎన్ఎస్‌సి) ఓ అండ్ ఎం సెక్షన్ గౌరవరం (జగ్గయ్యపేట నియోజకవర్గం)నకు ప్రభుత్వం బదిలీ చేసింది. రిలీవ్ ఆర్డర్ ఇవ్వకుండా జలవనరుల శాఖ ఇఇ గంగయ్య డిఇఇ ఉమాశంకర్,తిరువూరు ఎంఎల్ఏ కొలికపూడి శ్రీనివాసరావు వేధిస్తున్నారు. దీంతో ఇఇ,డిఇ,ఎంఎల్ఏపై, పరోక్షంగా వారికి సహకరించిన సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, మంత్రి పిఎ బి.శ్రీనివాసరావులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ లేఖ రాసి అన్ని శాఖల ఉద్యోగుల వాట్సప్ గ్రూప్‌ల్లో పోస్టులు చేసి అదృశ్యమయ్యారు. కిషోర్ మామ జె.ఆనందరావు ఫిర్యాదు మేరకు తిరువూరు ఎస్ఐ సత్యన్నారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు కిషోర్ చివరి ఫోన్‌కాల్ సరిహద్దు ఖమ్మం జిల్లా విఎం బంజరులో గుర్తించినట్లు పోలీసులు చెప్పారని జల వనరుల శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి మూలాలపై ఉక్కు పాదం

**యేడాదిలో 2 వేల మంది అరెస్ట్**

**విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి**

**గజపతినగరం (విజయనగరం జిల్లా), జూలై 19 ప్రభాతవార్త :** తమ రేంజ్ పరిధిలో గంజాయి మూలాలపై ఉక్కు పాదం మోపుతున్నామని, మరో ఏడాదిలో గంజాయి ఆనవాళ్లు లేకుండా చేసేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని విశాఖ రేంజ్ పోలీస్ డిఐజి గోపీనాథ్ జట్టి అన్నారు. శనివారం సాయంత్రం వార్షిక తనిఖీల్లో భాగంగా గజపతినగరం సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లు క్షుణ్ణంగా పరిశీలించారు. సర్కిల్ పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైబర్ నేరాల అదుపుకు ఎప్పటికప్పుడు ఆధునిక టెక్నాలజీతో ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రజలు కూడా సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విశాఖ రేంజ్‌లో గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. గడిచిన ఏడాదిలో 2 వేల మంది గంజాయి ముద్దాలను అరెస్టు చేశామన్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు 29 చెక్‌పోస్టుల వద్ద 24/7 నిఘా విభాగం పని చేస్తుందన్నారు. ఆర్టీసీ బస్సులు, రైల్వే మార్గాల్లో కూడా గంజాయి అక్రమ రవాణాపై నిఘా ఉందన్నారు. ఈ ఏడాదిలో గంజాయి సాగును జీరో పర్సంటేజ్‌కి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## జాతీయస్థాయి సిఎస్ఎస్ఆర్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ మూడో స్థానం

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** సదరన్ లెవెల్ జాతీయస్థాయి సీఎస్ఎస్ఆర్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఏపీఎస్‌డీఆర్ఎఫ్) మూడో స్థానంలో నిలిచి సత్తా చాటింది. న్యూఢిల్లీలో జరిగిన పోటీల్లో హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ సహా వివిధ రాష్ట్రాలతో పోటీపడి తృతీయస్థానాన్ని కైవసం చేసుకుంది. ఏప్రిల్‌లో ఘజియాబాద్‌లో జరిగిన పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో అర్హత సాధించింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఈ బృందం సభ్యులు డీజీపీని ఆయన కార్యాలయంలో కలిశారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా క్రీడాకారులను అభినందించారు.

# గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ భేటీ

**- విదేశాల్లో భారత విద్యార్థుల సమస్యల ప్రస్తావన**



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు విదేశాల్లో భారతీయ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరిస్తున్న ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

**విజయవాడ, జూలై 19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ విద్యావేత్త, సాహితీవేత్త ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ శనివారం విజయవాడ రాజ్‌భవన్‌లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్, జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ పలు కీలక అంశాలను గవర్నర్‌కి వివరించారు. ముఖ్యంగా విదేశాల్లో ఉన్న భారతీయ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేకంగా చర్చించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన నూతన విధాన మార్పులు భారత విద్యార్థులకు సమస్యగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల హక్కులను కాపాడటానికి విద్యా, దౌత్యా రంగాల సమన్వయంతో చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని గవర్నర్‌కు వివరించారు.అమెరికాలో తన పర్యటనలో భాగంగా యునైటెడ్ నేషన్స్‌లో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్‌ను కలసిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా భారత భాషల అంతర్జాతీయ ప్రాధాన్యత, భారత విద్యార్థుల సంక్షేమం తదితర అంశాలపై చర్చ జరిగినట్టు తెలిపారు. అమెరికన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తొలిసారి తెలుగు వ్యక్తిగా ఎన్నికైన డాక్టర్ ముక్కామల శ్రీనివాస్ (బాబీ) ఘన విజయాన్ని గవర్నర్‌కి వివరించారు.

ఇది ప్రపంచ తెలుగు సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. అమెరికాలోని తెలుగు భాషా అభివృద్ధికి కృషిచేస్తున్న యూనివర్సిటీ ఆఫ్ సిలికాన్ ఆంధ్ర అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్‌తో తన సమావేశ వివరాలను కూడా గవర్నర్ తో పంచుకున్నారు. అలాగే, హిందీని ఐక్యరాజ్యసమితిలో అధికారిక భాషగా గుర్తించే దిశగా తాను చేస్తున్న ప్రయత్నాలను గవర్నర్‌కి వివరించారు.

ఆచార్య లక్ష్మీ ప్రసాద్ హిందీ, తెలుగు భాషల అభివృద్ధికి దేశంలోనే కాదు విదేశాల్లోనూ చేస్తున్న సేవలను గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశంసించారు. భాషా, విద్యా రంగాలలో వారి యత్నాలకు తన సంపూర్ణ మద్దతు అందిస్తానని హామీ ఇచ్చారు.

## ఎక్సైజ్ శాఖలో ముగ్గురు డిప్యూటీ కమీషనర్లుకు పోస్టింగులు

**విజయవాడ.జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** ఎక్సైజ్ శాఖలో ముగ్గురు డిప్యూటీ కమీషనర్లుకు పోస్టింగులు ఇచ్చారు.ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసారు.విజయనగరం జిల్లాకు వై.శ్రీనివాస చౌదరిని, ప్రధాన కార్యాలయానికి వి.వివేక్‌ను డిప్యూటీ కమీషనర్లుగా పంపించారు.ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ఎన్.సుర్జిత్ సింగ్‌ను నియమించారు.

## తొలి త్రై మాసికంలో కేంద్ర సాయంలో భారీ కోత - కాగ్ నివేదికల్లో వెల్లడి

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్రం నుంచి రావాల్సిన సాయంలో భారీగా కోతలు పడినట్లు కాగ్ నివేదికలు చెబుతున్నాయి, 2025-25 ఆర్థిక సంవత్సరంలో తొలి త్రైమాసికంలో కేవలం నాలుగు శాతం నిధులు మాత్రమే రావడంతో ఆ ప్రభావం రాష్ట్ర ఖజానాపై పడుతోంది. ఇది భారీగా అప్పులు చేయాల్సిన పరిస్థితికి దారితీస్తోంది. కాగ్ ప్రకటించిన త్రైమాసిక నివేదిక ప్రకారం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. అటు సొంత ఆదాయం తగ్గడం,కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడం,అప్పులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొనడంతో ఖజానా కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్రం నుంచి గ్రాంట్లు రూపంలో ఏడాది మొత్తానికి రూ.32,284 కోట్లు రావాల్సి ఉండగా తొలి మూడు నెలల్లో కేవలం రూ.1,465 కోట్లు మాత్రమే వచ్చాయి. నెలకు సగటున రూ. 2,690 కోట్లతో మూడు నెలలకు ఎనిమిది వేల కోట్ల వరకు రావాల్సి ఉంటతుంది. అయితే కేవలం 4.54 శాతం నిధులు మాత్రమే రావడం గమనార్హం.గత ఏడాది తొలి త్రైమాసికంలో 6.64 శాతం వచ్చింది. ఈ ఏడాది రెండు శాతం వరకు తగ్గిపోవడం గమనార్హం.ఇది రాష్ట్రంలో అమలు చేసే పథకాలకు ఇబ్బందికరంగా మారుతుందని అధికారులు చెబుతున్నారు.

రాష్ట్ర సొంత ఆదాయాన్ని పరిశీలిస్తే ఇప్పటి వరకు 20 శాతం నిధులు సమకూరాయి. బడ్జెట్ అంచనాల మేరకు రూ.1.66 లక్షల కోట్లుగా అంచనా వేయగా మూడు నెలల్లో రూ.33 వేల కోట్లు మాత్రమే చేతికందింది.

# మాజీ ముఖ్యమంత్రి జగన్‌ది వికృత మనస్తత్వం: హోంమంత్రి అనిత



**విజయవాడ,జులై 19,ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి జగన్‌ది వికృత మనస్తత్వం.అధికారంలో ఉన్న ఐదేళ్ళు ఒకలా ఓడిపోయిన తర్వాత మరోలా క్రూరత్వం చూపుతున్నారని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు,హోంమంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. మహిళలే లక్ష్యంగా దాడులు,మురికి వ్యాఖ్యలు చేయిస్తున్నారన్నారు. రాష్ట్ర తెలుగు మహిళ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. 'ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటి అమలు చేస్తుంటే,వాటికి అడ్డు తగలడానికి వైకాపా కుట్ర పన్నుతోంది.గత ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయి అడ్డాగా మారిస్తే కూటమి ప్రభుత్వం ఈగల్ టీంను నియమించి ఉక్కుపాదం మోపింది.' అని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి వాస్తవాలను వివరించాలని కార్యకర్తలను కోరారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ 'మహిళలను కించపర్చిన వారు పుట్టగతులు లేకుండా పోతారు.వాళ్ళు రాజకీయంగా ఎంతటి శక్తిమంతులైనా ప్రజల తీర్పునకు తలొగ్గక తప్పదు అని అన్నారు.ఇదే సమావేశంలో గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై ప్రశ్నించే హక్కు ఎంఎల్ఏగా నాకు ఉంది. నా ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నన్ను వ్యక్తిగతంగా టార్గెట్ చేశారు. చెల్లిలి వరస అవుతానని కూడ చూడకుండా ప్రసన్నకుమార్‌రెడ్డి నాపై సభ్యసమాజం సిగ్గుపడేలా మురికి వ్యాఖ్యలు చేశారు. అని కోవూరు ఎంఎల్ఏ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై త్వరలో రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

## రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలలో ఎవరికెన్ని ఓట్లు?

**గుంతకల్లు రైల్వే, జూలై 19,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ ప్రధాన కేంద్రంలోని రైల్వే ఇన్స్‌స్టిట్యూట్ పాలక మండలికి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్యానెల్ అఖండ విజయం సాధించగా, ప్రత్యర్థి ఎంప్లాయిస్ సంఘ్ ప్యానల్ నుంచి పోటీ చేసిన 9మందిలో ఒక్కరంటే ఒక్కరు కూడా గెలవకపోవడం సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది. శుక్రవారం గుంతకల్లులో జరిగిన రైల్వే ఇన్స్‌స్టిట్యూట్ సార్వత్రిక ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్‌ల మధ్య హోరాహోరీగా జరిగిన ఎన్నికలలో రైల్వే కార్మికులు మజ్దూర్ యూనియన్‌కు విజయం చేకూర్చారు. మజ్దూర్ యూనియన్ ప్యానెల్ నుండి కార్యదర్శిగా పోటీ చేసిన కె యల్లప్ప తన సమీప ప్రత్యర్థి మల్లికార్జునపై 56ఓట్ల మెజార్టీతోను, సంయుక్త కార్యదర్శిగా పోటీ చేసిన ఎం ప్రవీణ్ కుమార్ తన సమీప ప్రత్యర్థి డి షేక్షావలిపై 252ఓట్ల అత్యధిక ఓట్ల మెజార్టీతో అఖండ విజయం సాధించగా, కోశాధికారిగా పోటీ చేసిన యస్ నథాని యేల్, తన సమీప ప్రత్యర్థి నాగరాజుపై 177ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కాగా కమిటీ సభ్యులుగా ధన్‌రాజ్ 175ఓట్లు, రామాంజనేయులు 133ఓట్లు, షఫీఉల్లా 105ఓట్లు, జి చంద్రమౌళి తన సమీప ప్రత్యర్థి షేక్ సుభానుల్లాపై 207ఓట్లు, శ్రీనివాసులు 191ఓట్లు,కె నెట్టికల్లు 233ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. రైల్వే ఇన్స్‌స్టిట్యూట్‌లో మొత్తం 944మంది అర్హులైన ఓటర్లు ఉండగా 865ఓట్లు పోలయ్యాయి. రైల్వే ి రేణిగుంట, నందలూరు,కడపఇన్స్‌స్టిట్యూట్‌లను మజ్దూర్ యూనియన్ ఏకగ్రీవంగా ఎన్నిక అయారు.

## బాధితుని న్యాయహక్కులకు కవచంలా నిలిచే బలమైన వ్యవస్థగా ప్రాసిక్యూషన్ ఉండాలి

**విజయవాడ క్రైం,జులై 19,ప్రభాతవార్త** భాధితుని న్యాయ హక్కులకు కవచంలా నిలిచే బలమైన వ్యవస్థగా ప్రాసిక్యూషన్ ఏర్పడాలని,మన న్యాయ పోరాటం భాధితుల మద్దతుతో నడవాలని ప్రాసిక్యూషన్ విభాగం డైరెక్టర్ బైరా రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రాసిక్యూషన్ విభాగం,ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్‌లు సంయుక్తంగా మనుషుల అక్రమ రవాణా,బంధిత కార్మిక నిర్మూలన వ్యవస్థ చట్టం-1976పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన బైరా రామకోటేశ్వరరావు మాట్లాడుతూ భాధితుల పట్ల సానుభూతిపరమైన ధృక్పథంతో వ్యవహరించడంతో పాటు,బానిసత్వం,మానవ అక్రమ రవాణా కేసుల్లో సాక్ష్యాల లోపాలను తొలగించి, న్యాయ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. దోషులకు తగిన శిక్షలు పడేలా చేయడమే కాకుండా,భాధితులకు న్యాయపూర్వక పునరావాసం కల్పించడంలో ప్రాసిక్యూటర్ల పాత్ర కీలకమన్నారు. న్యాయ ప్రక్రియ భాధితుడిని కేంద్రంగా ఉంచుకొని సాగాలన్నారు.


దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayindia

మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

PUB/0874

**ఇ-టెండర్ ప్రకటన**

భారత రాష్ట్రపతి తరపున డివిజనల్ రైల్వే మేనేజర్ (S&T) విజయవాడ వారు క్రింది పనికి తేదీ : 11.08.2025న 15.30గం. వరకు ఇ-టెండర్‌లు కోరుతున్నారు.

క్ర.సం.: 01 పని పేరు: టెండర్ ప్రకటన నం & తేదీ : SCR-BZA-SNT-E08-OT-25-26. తేదీ: 18.07.2025. విజయవాడ డివిజన్: సిగ్నల్ మరియు టెలికాం విభాగం: S&T పనులు వీనితో సంబంధించి 1) BZA డివిజన్-విజయవాడ డివిజన్‌లో లోపభూయిష్టమైన కేబుల్స్ రిప్లేస్‌మెంట్. 2) అదే డివిజన్‌లో విశ్వసనీయ సిగ్నలింగ్ కొరకు ఎర్తింగ్ మరియు సర్జ్ రక్షణ పద్ధతులను పటిష్టపరచుట. 3) DL నెట్ వర్కింగ్‌కు సంబంధించి ఇతర పలు రకాల పనులు. 4) BZA-VSKP సెక్షన్-హంసవరం స్టేషన్‌కు దువ్వాడ స్టేషన్ మధ్య ఎయిర్ పుషింగ్ పద్ధతిచే 2.0MX2.5M, 5.0MX2.5M మరియు 2X4.0M X 2.5M యొక్క సైజ్‌ల RCC బాక్స్‌తో, (1X4.57)= 5నం.లు 717 (UP) మరియు 734 (డౌన్) (2X3.66) 675 (డౌన్) (1X4.57), 673 (డౌన్) (1X1.83) 579 (డౌన్) (1X1.83) నం.ల పాడైన RCC స్లాబ్ వంతెనల యొక్క రిప్లేస్‌మెంట్‌కు సంబంధించిన S&T పనులు. 5) BZA-VSKP సెక్షన్‌న-హంసవరం స్టేషన్‌కు దువ్వాడ స్టేషన్ మధ్య "ఎయిర్ పుషింగ్ పద్ధతి"చే 4.0M X 2.5M యొక్క సైజ్‌ల RCC బాక్స్‌తో 8నం.లు. 696 UP, 668 UP, 666 UP, 722 DN, 694 DN, 601 DN, 597 DN, 596 DN, నం.ల పాడైన RCC స్లాబ్ బ్రిడ్జి యొక్క రిప్లేస్‌మెంట్ 6) BZA DIV GDR-BZA సెక్షన్ - SSE/W/BPP సెక్షన్‌లో (IRPSM ID11.06.32.24.3.55.016) ఓపెన్ కట్ పద్ధతిచే RCC బాక్స్‌లతో ప్రస్తుతం వున్న Br No.620 UP యొక్క రిబిల్డింగ్‌తో సబంధించిన S&T పనులు. 7) GDR-BZA సెక్షన్ ప్రస్తుతం వున్న ROB యొక్క LHS సైడ్‌పై NH16@ రోడ్ కి.మీ. 431+415 యొక్క చిలకలూరిపేట విజయవాడ సెక్షన్ రోడ్ పై మరియు పెద్దవడ్లపూడి మరియు కృష్ణా కెనాల్ జంక్షన్ స్టేషన్ మధ్య రైల్వే కి.మీ. 421/6-8 వద్ద 2 లేన్ ROB యొక్క రీబిల్డింగ్ NHAI ROB ప్రతిపాదన. 8) కృష్ణపట్నం పోర్ట్-KAPT-OBVP దగ్గర, రైల్వే KM 109/33 వద్ద తమ్మినపట్నంకు నారికెళ్ళపల్లి ROB వద్ద కృష్ణపట్నం పోర్ట్ దగ్గర, ఖండలేరు క్రీక్ యొక్క ఉత్తర మరియు దక్షిణ పారిశ్రామిక సముదాయం కలిపే గ్రీన్ ఫీల్డ్ రోడ్ యొక్క ఫోర్ లేనింగ్ యొక్క నిర్మాణం. 9) విజయవాడ డివిజన్‌లో సెకండరీ సెల్స్ యొక్క ఇనీషియల్ ఛార్జింగ్. టెండర్ విలువ : (రూ): 7,11,69,327.70, బయానా : (రూ): 5,05,900.00 CTB: (రూ) నిల్. పూర్తి చేయు కాలం : 365 రోజులు.

క్ర.సం.:1 వివరణ : ముగింపు తేదీ మరియు సమయం : సమయం : 15.30గం., తేది: 11.08.2025.

కాగోరు టెండర్‌దారులు ఏ టెండర్‌కైనా ఏవైనా మార్పులు /సవరణ గమనించడానికి, టెండర్ ముగింపు యొక్క తేదీ ముందు "www.ireps.gov.in" వెబ్‌సైట్‌ను వీక్షించవలసినదిగా సూచించడమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (S&T), విజయవాడ.

A1078

తదుపరి టెండరు నిబంధనలు /వివరములు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్‌కు, దయచేసి వెబ్‌సైట్లు https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in చూడవచ్చును.

ప్రభుత్వ తోడ్పాటు, ప్రజల సహకారంతో ఏ దేశమైన అద్భుతాలు చేయవచ్చని ఇజ్రాయిల్ నిరూపించింది. ఇజ్రాయిల్ దేశ భూభాగంలో సగానికి పైగా ఎడారి వాతావరణం వ్యవసాయానికి అనుకూలంగా ఉండదు. దీనికి తోడు సాగు నీటి కొరత. 20 శాతం భూభాగం మాత్రమే సాగుకు అనుకూలం. కానీ వ్యవసాయంలో సాగు విధానంలో ప్రపంచానికే ఇజ్రాయిల్ దేశం ఆదర్శంగా నిలుస్తుంది. ఇజ్రాయిల్లో ఆధునిక వ్యవసాయం అభివృద్ధి 19వ శతాబ్దం చివరిలోమొదలైంది. 1948లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సాగులో ఉన్న మొత్తం విస్తీర్ణం 4.8 లక్షల ఎకరాల నుండి 10.70లక్షల ఎకరాలకుపెరిగి వ్యవసాయ ఉత్పత్తి పదహారు రెట్లుపెరిగింది. వ్యవసాయం ముఖ్యంగా రెండు పద్ధతుల్లో సాగుతుంది. మొదటిది సామూహిక వ్యవసాయ పద్ధతి. ఊరు లేదాప్రాంతం అంతా కలిసి తలా ఒక పనిచేస్తూ సామూహికంగా పంట ఉత్పత్తి చేస్తారు. రెండవది మోన్ పద్ధతి. కుటుంబం తన సొంత భూమిలో పంట సాగు చేయడం. ఇజ్రాయిల్ మొత్తం వ్యవసాయ ఉత్పత్తులు, పండ్లు,కూరగాయలు 50శాతం. 2014లో పండ్లు, కూరగాయలు, ఉత్పత్తులు విలువ 3బిలియన్ డాలర్లు. మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల విలువ 8 బిలియన్ డాలర్లు. ఇజ్రాయిల్లో డ్రిప్ మైక్రోఇరిగేషన్ పరిష్కారాలు ప్రపంచ వ్యాప్తంగా వాడుతున్నారు. డ్రిప్ ఇరిగేషన్లో సొంతంగా శుభ్రపరచుకొని ఏకరీతినీటి ప్రవాహం ఉండేటట్లు అభివృద్ధి చేశారు. నీటిని 50 శాతం వరకు తగ్గించడం, జీవ సంబంధమైన తెగులు నియంత్రణకోసం ప్రయోజనకరమైన కీటకాలు, పురుగుల పెంపకం వంటి చర్యలద్వారా ఉత్పత్తి పెరిగింది. డీసాలినేషన్ ప్లాంట్ విస్తృతంగా ఉపయోగించుకుంటోంది. వ్యవసాయం కోసం శుద్ధి చేసిన మురికినీటిని పునర్వినియోగం చేస్తుంది. లీకేజ్లను కనిపెట్టి, నీటి వేస్టేజ్ తగ్గించడానికి ముందస్తుహెచ్చరిక వ్యవస్థలు, కంప్యూటరీకరించిన బిందుసేద్యం, మైక్రో స్ప్రింక్లర్లు మొదలైనవి వాడుతుంది.

# సాగులో వెనుకబడిన సాంకేతికత

**సిహెచ్ వి వి రఘుబాబు**

దేశంలోని వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అంతంత మాత్రంగానే అమలవుతోంది. అవగాహన లేకపోవడం, ప్రభుత్వాలు విస్తృతంగా రైతులకు తెలియ చేసేలా ప్రచారం చేయకపోవడం వంటి కారణాలతో రైతులు ఇంకా సాంకేతిక వైపు మళ్లడం లేదు. ఇండియాలో ఎక్కువ మంది వ్యవసాయ రంగాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. భారత ఆర్థికవ్యవస్థకు వ్యవసాయం కేంద్ర బిందువుగా ఉంది. రైతు సేద్యంచేస్తారు. ప్రభుత్వం అతనికివిద్యుత్, ధరల విషయంలో చట్టపరమైన సహకారం అందిస్తుంది. ప్రైవేటు వ్యాపారులు పంటకు విలువను జోడిస్తారు. దాన్ని వినియోగదారుడి దగ్గరకు చేర్చే పాత్రను మార్కెట్ పోషిస్తుంది. అయితే, ఈ వ్యవస్థలోని కొందరి అసమర్థత కారణంగా దేశంలో అదనపు ఉత్పత్తి ముఖ్యంగా వరి, గోధుమల విషయంలో ఎక్కువగా జరిగింది.1950లో సుమారు 5 కోట్ల టన్నులుగా ఉన్న ఈ అదనపు ఉత్పత్తి, నేడు 50కోట్ల టన్నులకు చేరుకుంది. కానీ, ఇప్పటికీ దేశంలోని పంటల దిగుబడి రేటు మాత్రం తక్కువగానే ఉంది. ప్రపంచ సరాసరి దిగుబడితో పోల్చినప్పుడు ఈ లోపం స్పష్టంగా కనిపిస్తుంది.అమెరికా తర్వాత అత్యధిక శాతం వ్యవసాయ భూమి ఉన్న దేశం భారత్. దిగుబడిలో మాత్రం ఆ దేశం కన్నా నాలుగురెట్లు వెనకబడి ఉంది. భారత్తో పోల్చినప్పుడు చైనాలో సేద్యపు భూమి తక్కువ, కానీ దిగుబడి ఎక్కువ. భారతదేశపు సగటు వ్యవసాయ భూకమతం వినియోగం 1.08 హెక్టార్లు కాగా చైనాలో అది 0.67 హెక్టార్లుగా ఉంది. కానీ ఆ దేశ వ్యవసాయోత్పత్తి భారత్ కన్నా మూడింతలు ఎక్కువ. వ్యవసాయంలో వైవిధ్యంతోపాటు పరిశోధన,అభివృద్ధి మీద వారు ఎక్కువ దృష్టిపెడతారు. భారతీయ జనాభాలో ఎక్కువ మందికి వ్యవసాయం అనేది జీవనోపాధికి ప్రధాన వనరు అయినప్పటికీ ఇప్పటికీ సాంకేతిక పరంగా ఇంకా వెనుకబడి ఉంది. మరో పక్క ప్రధాన మంత్రి ధన్ధాన్య కృషి యోజన పథకం అందుబాటులోకి తెస్తోంది. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, భారతదేశం అంతటా స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించే లక్ష్యంతో దీనిన్ని అమలు చేయాలని కేంద్ర మంత్రివర్గం తీర్మానించింది. ఈ పథకం 11 వేర్వేరుమంత్రిత్వ శాఖల నుండి ఇప్పటికే ఉన్న 36 పథకాలను విలీనం చేస్తుంది. ఇది 2025-26 నుండి ప్రారంభమయ్యే ఆరు సంవత్సరాల పాటు సంవత్సరానికి రూ.24,000 కోట్ల ఆర్థిక వ్యయాన్ని కలిగి ఉంటుంది. దేశవ్యాప్తంగా 1.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూర్చడం దీని లక్ష్యం. 112 వెనుకబడిన జిల్లాలను వ్యవసాయ ఉత్పత్తులను పెంచడం వంటి



వాటిలో అభివృద్ధి చెందేలా చేయనుంది. ఇదే సమయంలో వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆర్థిక వ్యవస్థకు ప్రాముఖ్యత ఉన్నప్పటికీ ఈ రంగాన్ని పునరుద్ధరించడానికి భారత ప్రభుత్వం చాలా తక్కువ మొత్తంలో నిధులను కేటాయిస్తున్నది. పనిముట్ల నుండి ఫైనాన్సింగ్ వరకు కూడా భారతీయ వ్యవసాయ రంగం అనేక సమస్యలతో బాధపడుతోంది. నాణ్యత, పరిమాణం, పంపిణీ నిల్వకు సంబంధించిన సవాళ్లను పరిష్కరించడం ద్వారా టెక్నాలజీ భారతీయ వ్యవసాయాన్ని మార్చగలదు. వ్యవసాయ ఉత్పత్తుల సమాచారం ఎల్లపుడు రైతులు గత సీజన్ పోకడల ఆధారంగా పంటలను ఎంచుకుంటు ఉంటారు. వాతావరణ పరిస్థితులు, ఎక్కువ డిమాండ్ గల విషయాలు, ధరల యొక్క హెచ్చుతగ్గుల వివరాలను జాగ్రత్తగా విశ్లేషించడానికి ప్రస్తుతం పెరిగిన సాంకేతికత పరిజ్ఞానం వారికి సహాయపడుతుంది. అలాగే ఈ టెక్నాలజీ సరఫరా డిమాండ్ మధ్య మంచి సమతుల్యతను సృష్టిస్తుంది. టెక్నాలజీ ఎనేబుల్డ్ ఫార్మింగ్ టూల్స్ అనేది చిన్న చిన్న పొలాలకు ఒక వరంగా మారింది. అభివృద్ధి చెందిన దేశాలలో ఉపయోగించే పెద్ద యంత్రాలు మన చిన్న పొలాలలో ఉపయోగించడానికి సరిపోవు. చిన్న పొలాలకు అనువైన యాంత్రికరణలను ఉపయోగించడం ముఖ్యమైన భాగం. అలాగే తక్కువ సమయంలో ఎక్కువ పనిని చేయడానికి కూడా ప్రేరిపి స్తాయి. దేశంలో కొత్త టెక్నాలజీలు వ్యవసాయ రంగం అభివృద్ధి చెంద డానికి, మంచి దిగుబడిని సాధిం చడానికి ఆ పంటకు తగ్గ స్థలాన్ని గుర్తించడం చాలా అవసరం. వ్యవసాయ రంగంలో మొబైల్ అప్లికేషన్స్ స్మార్ట్ఫోన్లు తక్కువ ధరలో దొరు కుతున్న కారణంగా రైతులు డిజిట లైజేషన్ పరంగా అడుగులు వేయాల్సి న అవసరం ఉంది. ఈ కొత్త మొబైల్ అప్లికేషన్స్ సాంకేతికత వ్యవసాయ రంగంలో కూడా ప్రయోజనాల సామర్థ్యాన్ని పెంచే వీలుకలుతుంది. అలాగే వ్యవసాయ ఉత్పత్తుల వస్తువుల కోసం ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ పోర్టల్ అయిన ఇనామ్ (నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్)తో వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. రైతులకు ప్రయోజనం చేకూర్చే కొన్ని రాష్ట్రాలు వ్యక్తి గత కార్యక్రమాలు చేపట్టాయి. పంజాబ్ ప్రభుత్వం పంజాబ్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ను ప్రవేశ పెట్టింది. వీటితో పాటుగా ఐఖెట్ మెన్, ఇపెహోల్ ఇప్రివెంట్ వంటి మరో అప్లికేషన్లు కూడా ఉన్నాయి. ఇక వ్యవసాయ రంగంలో డ్రోన్స్ పనితీరు విషయానికి వస్తే ఇది పంటల అన్ని రకాల డేటాను సేకరిస్తుంది. ఇవి ఖచ్చితమైన లేదా స్మార్ట్ వ్యవసాయం కోసం అవసరమైన ఖచ్చితమైన సమాచారాన్ని అందిస్తుంది.సరైన సెన్సార్లను ఉపయోగించడం ద్వారా డ్రోన్లు రైతులకు వారు ఎంచుకోవలసిన పంటలు, నేలక్షీణత, పొడి ప్రాంతాలు, ఫంగల్ ఇన్ఫెక్షన్ మొదలైన వాటికి సంబంధించిన నిజమైన సమాచారాన్ని అందించగలవు. అలాగే ఈ డ్రోన్లను ఉపయోగించి పంట పొలాలపై మందులను పిచికారీ చేయడానికి కూడా ఉపయో గిస్తారు. కానీ వీటని రైతాంగానికి అందుబాటలో తేవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినంత శ్రద్ధ చూపించడం లేదు. కలుపు తీయడం విత్తనాలను నాటడం వంటి వాటికి చిన్నచిన్న పనిముట్ల ను అందుబాటు ధరలో లభిస్తున్నాయి. ఆన్లైన్ ద్వారా కొనుగోలు చేయడానికి రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు ముందుకు రావడం లేదు. వ్యవసాయంమీద ఆధారపడే పడే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆఫర్లను అందిస్తున్నా ఆ సమాచారం వారికి చేరడంలేదు. వ్యవసాయ యంత్రాలను కొనుగోలు చేయడానికి లోన్లను సబ్సిడీ ధరలకు అందిస్తున్నాయి.కాని బ్యాంకులు రైతులకు రుణాలపై యంత్రాలను అందించేందుకు ముందుకు రావడం లేదు. కొత్తగా రైతులకోసం కేంద్రప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డులను కూడా అందించడం మొదలు పెట్టింది. కిసాన్ క్రెడిట్ కార్డ్ల ద్వారారైతులు రాయితీ రేటుకురుణాలుతీసుకోవడానికి వీలు కల్పిస్తుంది. మనీలెండర్లు వసూలు చేసే అధికరేట్ల నుండి రైతులను కాపాడడానికి రూపొందించిన ఈ పథకం కింద రైతులు రెండు శాతంకంటే తక్కువ వడ్డీరేటుతో రుణాలను పొందవచ్చు. అంతేకాకుండా లబ్ధిదారులు వారు తీసుకున్న మొత్తాన్ని పంట కోత లేదా మార్కెటింగ్ వ్యవధిపై ఆధారపడి తిరిగి చెల్లించే అవకాశాన్ని కూడా అనుమతిస్తుంది. ఈకార్డుల ద్వారా ప్రతి రైతు సుమారు మూడు లక్షల వరకు రుణమొత్తాన్ని పొందవచ్చు. కానీ ఇక్కడ కూడా రైతులకు బ్యాంకులు అన్యాయమే చేస్తున్నాయి. నిరక్షరాశ్యులైన ఎక్కువ మంది రైతులకు కిసాన్ క్రికెడిట్ కార్డులు గూర్చి తెలియని పరిస్థితి ఉంది.రుణాల నిమిత్తం సహకార సంఘాలు, బ్యాంకుల్లో రైతులకు ఖాతాల ఉన్నప్పటికీ, వారందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వడం లేదు.తెలిసిన రైతులు దరఖాస్తు చేసుకున్నా వారికి కార్డులు మంజూరు చేయకుండా బ్యాంకులు మోకాలడ్డుతున్నాయి. వీటన్నింటిని అధిగమించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలంటే అందుకు కేంద్ర, రాష్ట్రాలు గట్టి కృషి చేయడం ద్వారానే లక్ష్యాలను అధిగమించే వీలుంటుంది. ●

రైతుమిత్ర

# 'సర్' కొరడా!

**ఎ.వి.వి ప్రసాద్**

రాష్ట్రం

బీహార్

అసలే కోతి.. ఆపై కల్లు తాగింది.. ఇక చెప్పేదేముంది! దాని రచ్చకు హద్దేం ఉంటుంది! బీహార్లో ఉన్న పరిస్థితి ఇప్పుడు అదే. అసలే బీహార్, ఆపై ఎన్నికలు అనుకోవలసిందే.ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నుంచి, ఆ సీటులో కూర్చోవాలనుకుంటున్న తేజస్వి యాదవ్, చిరాగ్ పాశ్వాన్ వరకు అంతా ఒక రేంజిలో రెచ్చిపోతున్నట్లే కనిపిస్తుంది. ఒకరిపై ఒకరు ఆరోపణలు దాటి పార్టీ వర్గాలు ఒకరిపై ఒకరు దాడులు జరుపుకోవడం వరకు వెళ్తోంది. కాలు కదపలేక పోయినా మెదడు చురుగ్గానే ఉన్న మాజీ సిఎం, అవినీతి కేసుల ఊబిలో కూరుకుపోయిన లాలూ యాదవ్ కూడా తాను తక్కువ తిన్నదేమీలేదని మరోసారి ప్రతాపం చూపుదామనుకుంటున్నారు. ఎన్నికల పండుగ ఇక మూడు నెలల్లోకి రావడంతో అంతా బాగానే ముస్తాబవుతున్నారు. అయితే అక్కడే ఎన్నికల కమిషన్ కూడా బరిలోకి దిగి తన కొరడా ఝుళిపించడంతో అంతా ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. ఇసి చేతిలో ఉన్న ఆ కొరడా 'సర్' ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ). ఇప్పుడు అన్ని పార్టీల నేతలు గగ్గోలు పెడుతూ సర్ చుట్టూ తిరుగుతున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నుంచి ఆర్జెడీ ఛోటా నాయకుడి దాకా అందరూ 'సర్'ని దుమ్మెత్తి పోస్తుంటే బిజెపి, ఎన్డీయేలోని మిత్ర పక్షాలు మాత్రం ఇసి చర్యకు హారతి పడుతున్నాయి. బీహార్ ఓటర్లలో స్థానికులను డామినేట్ చేస్తూ నేపాలీలు, రోహింగ్యాలు, మయన్మార్, బంగ్లా జాతీయులు ఉన్నారనీ, వారి ఓట్ల కారణంగా ఫలితాలు తారుమారయ్యే ప్రమాదం ఉన్నదనీ కొన్ని పార్టీలు శంక లేవనెత్తడంతో ఇసి రంగంలోకి దిగింది. వెంటనే 'సర్'ను ప్రకటించి అటువంటి అనర్హఓటర్లు రాష్ట్రంలో 35.65లక్షల దాకా ఉన్నట్లుతేల్చింది.రాష్ట్రంలో నమోదైన మొత్తం ఓటర్లు 7.90 కోట్లు ఉండగా, వారిలో 5.76లక్షల మంది పేర్లు పలు చోట్ల ఉన్నాయట. ఓటర్ల జాబితాల్లో ఇది సాధారణంగా కనిపించే అసాధారణ అంశమే అయినా, మరీ అన్ని లక్షల్లో ఉండడం ఆశ్చర్యకరమే.ఇంకా ఓటర్లుగా చెలామణి అవుతున్న'మృతులు'12.55 లక్షల దాకా ఉన్నారట.ఇది మరింతఆశ్చర్యకరం. అంటే అన్ని ఓట్లను కొన్ని పార్టీలు యధేచ్ఛగా తమ గెలుపు కోసం ఉపయోగించుకొంటున్నాయన్న మాట. జాబితాల్లో ఉన్న చిరునామాలు వేరు, ఆ ఓటర్లు ఉంటున్న ప్రదేశాలు వేరు. అటువంటి వారు కూడా అధికసంఖ్యలోనే ఉన్నారు. జాబితాల్లోనే ఉన్నా,వ్యక్తులు ఎదురుగా కనిపిస్తున్నా వారువారేనని నిరూపించుకోగల'ఆధార' పత్రాలు లేని వారు కూడా లక్షల్లోనే ఉన్నారు. పార్టీలు ప్రత్యేకంగా తయారు చేసిన ఓటర్లు మరికొన్ని లక్షలు ఉన్నారు. ఇలా కొన్ని పార్టీల గెలుపునకు సందర్భాను సారంగా ఉపయోగపడే ఓటర్లు దాదాపు 36 లక్షలు ఉండడంతో ఇసి కూడా ఆశ్చర్యపోతోంది. అందుకే 'సర్'ను రంగంలోకి దింపింది. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి అసలు ఓటర్లు ఎవరో, నకిలీ ఎవరో గత రెండు వారాలుగా నిగ్గుతేల్చడం ఆరంభించారు. ఇసి ఈ సర్ కొరడా ఝుళిపించేసరికి పార్టీల వెన్నులో వణుకు మొదలైంది. దాదాపు 36 లక్షల ఓటర్లను జాబితాల నుంచి తొలగిస్తే దాదాపు నాలుగున్నర శాతం ఓట్లు మాయమైపోతాయి ఒక్క శాతం ఓట్లు తగ్గితేనే దాదాపు 20 సీట్లు పడిపోతాయి. దానితో పార్టీలు, నేతలు డీలా పడిపోతున్నారు. నాలుగున్నర శాతంఓట్లు తొలగిస్తే దాదాపు 100 సీట్లు తారుమారవుతాయి. అంటే ఏదో ఒక రకంగా అధికారంలోకి రావాలనుకొనే నేతల వ్యూహాలు తలకిందులవుతాయి. అందుకే ఈ గగ్గోలు.7.89కోట్ల ఓటర్లలో 6.60 కోట్ల మంది పేర్లు సరైనవని తేలినట్లు ఇసి గత సోమవారం ( 14,జూలై) అధికారికంగా ప్రకటించింది. అంటే 83.66 శాతం మంది ఓటర్లు వివాదరహితంగా ఉన్నారన్నమాట.ఇంకా దాదాపు కోటి మంది పేర్లు ఖరారు కావలసి ఉంది.వాటిలో ఎన్ని మళ్లీవివాదంలో చిక్కుకొంటాయో తెలియదు. ఆ పేర్లన్నీ యధాతథంగా ఉంచాలనీ, కేంద్రం కుట్రవల్లే ఈపరిస్థితి తలెత్తిందనీ విపక్షాలు విమర్శిస్తున్నాయి. కేంద్రంలోని అధికార బిజెపికి ఎన్నికల కమిషన్తొత్తుగా మారిందనీ, మోడీ, అమిత్ షా కనుసన్నల్లో ఇసి పనిచేస్తోందనీ రాహుల్,తేజస్వి యాదవ్ ఘాటుగానేలో ఆరోపిస్తున్నారు కానీ ఇసి తనపనితాను చేసుకుపోతోంది. ఓటర్లందరు తమ ధ్రువపత్రాలు సమర్పించవలసిన గడువుముగుస్తుండడంతో పత్రికాప్రకటనల ద్వారా ఇసి వారినిజాగృత పరుస్తోంది. అయినా నిర్లిప్తంగానే ఉన్నవారు ఇంకా 15లక్షలమంది వరకు ఉన్నారట. ఓటరుజాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ' సబబేఅయినా ఎన్నికలు సమీపిస్తున్నవేళ మొదలు పెట్టడమేమి టని కూడా చాలామంది ప్రశ్నిస్తున్నారు. కొన్ని విపక్షాలు, ప్రజాసంఘాలు ఇసిచేపట్టిన 'సర్'నుసుప్రీం కోర్టులో సవాల్చేశాయి కూడా. దానిపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. అటువంటి ప్రక్రియ అవసరమేనని అభిప్రాయపడుతూనే,ఎన్నికలముందు హడావుడిగా చేపట్టడమేమిటని సుప్రీంకోర్టుకూడా ప్రశ్నించింది. ఓటర్ల గుర్తింపు నకు పరిశీలించే పత్రాలలో ఆధార్,రేషన్, ఓటర్ ఐడి కార్డునూ చేర్చాలని ఇసికి సుప్రీంకోర్టు సూచించింది. అయితే ఆధార్ను ధ్రువపత్రంగా పరిగణించడానికి ఇసి కొన్నిఅభ్యంతరాలను వ్యక్తంచేస్తోంది. ఆధార్ కార్డుల్లో కూడా నకిలీలు పెరిగిపోవడమేఅందుకు కారణం. ఒకే వ్యక్తికి నాలుగైదు రకాల అడ్రస్లతో వేర్వేరు ఆధార్ కార్డులు ఉండడాన్ని కూడా ఇసి కనుగొనడంతో చాలాచోట్ల నిజమైన కార్డులు న్నవారు సైతంవేరే ధ్రువపత్రాలు తేలేక ఇబ్బందులు పడుతున్నారు. ఆకారణంగా కూడా చాలా మందిఓటర్లు కాలేకపోతున్నారు ఇవన్నీ కేంద్రం కుట్రలే అంటున్నాయి విపక్షాలు.బీహార్ అయ్యాక అసోం, బెంగాల్, కేరళ, తమిళనాడు ఎన్నికలు రాబోతున్నాయి.ఈ 'సర్' కొరడాను ఆ రాష్ట్రాల్లో కూడా ఇసి ప్రయోగిస్తుంది కనుక ఇప్పటి నుంచే గణన మొదలు పెడితే ఎన్నికల ముందు సమస్యలేర్పడకుండా ఉంటాయి. ముందు బీహార్ ఎలా గట్టెక్కుతుందో చూడాలి. ●



ఓటర్లు

# సంక్షోభాలు, సవాళ్లకు ఎదురీత!

**గన్ని మోహన్**

దేశం

జపాన్

అమెరికాతో ఎదురవుతున్న సుంకాల ఆంక్షలు, దేశంలో పెరుగుతున్న జీవన వ్యయం, ధరల పెరుగుదల, నగదు కొరత వంటి వాటితో ఆసియాలోనే మూడో అతిపెద్ద దేశం అయిన జపాన్ ఇప్పుడు రాజకీయ సంక్షోభం ఎదుర్కొంటోంది. ఇప్పటికే గత ఏడాది అక్టోబరులో దిగువసభకు జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ప్రధాని షిగేరు ఇషిబాకు ఇప్పుడు ఎగువ సభ ఎన్నికలు సవాల్గా మారాయి. ఒక్క మాటలో చెప్పాలంటే సంక్షోభాలు, సవాళ్లకు ఇషిబా ఎదురీదుతున్నట్లుగా ఉంది. 248 సీట్లు ఉన్న జపాన్ ఎగువ సభలో ఇషిబా లిబరల్ డెమొక్రటిక్పార్టీ పైచేయి సాధించాలంటే తన సుదీర్ఘకాల మిత్రపక్షం కోమీటోతో కలిపి 50 స్థానాలు అదనంగా గెలవాలి. మొత్తం66 స్థానాలు ఇప్పుడు ఎన్నికలకు వచ్చాయి. వీటిలో 50 స్థానాలు విధిగా గెలిస్తేనే ఇషిబాకు అటు ప్రజల్లో విశ్వాసం పెరగడం, ప్రభుత్వంపైనా పాలకపక్షం పైనా పట్టు సాధించుకోగలుగుతారు. నిజానికి గత ఏడాది అక్టోబరులో జరిగిన దిగువ సభ ఎన్నికల్లో ఎల్డీపీతో పాటు సంకీర్ణ పక్షం కోమీటో రెండూ కూడా ఘోరంగా విఫలం అయ్యాయి. జపాన్కు అత్యంత శక్తివంతమైన దిగువ సభలో వీరు తమ పట్టును నిరూపించుకోలేకపోయారు. 2009లో అధికారం కోల్పోయిన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో కూడా షిగేరు పట్టుసాధించడంలో పూర్తిస్థాయి విజయం సాధించలేకపోయారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సుదీర్ఘ కాలం జపాన్లో ఎల్డీపీయే పాలించింది. అలాంటి పార్టీకి ఇప్పుడు గడ్డుకాలం ఎదురయింది. ఇక ఎగువ సభ ఎన్నికల్లో ముఖ్యంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం కూడా ప్రధాన సమస్య. బియ్యం ధరలు దాదాపుగా రెట్టింపు అయ్యాయి. దిగుబడులు లేకపోవడం, ప్రభుత్వ విధానాలు వంటివి ధరల పెరుగుదలకు కారణం కాగా ప్రజల్లో ఎల్డీపీ పట్ల అసంతృప్తిని పెంచేందుకు దోహదం చేసింది. ఇందుకు ధీటుగా ప్రతిపక్షాలు పన్నుల్లో కోతలు ఉంటాయని, సంక్షేమ పథ కాలు కొనసాగిస్తామని, జపాన్ను దీర్ఘకాలంగా పీడిస్తున్న ఆర్థిక ప్రతిష్టంభనకు తెరదించుతామని వాగ్దానాలు చేస్తూ ఎన్నికలకు వస్తున్నాయి. నిజానికి ప్రజలకు దేశంలో కరెన్సీ యెన్ మరింత క్షీణించడంతో జీవన వ్యయం మరింత పెరిగింది. దీనివల్ల విదేశీ టూరిస్టులు ఎక్కువ మంది వస్తున్నారు. స్థానిక సాంప్రదాయాలకు విలువలు పోతున్నాయన్న అసంతృప్తి అసమ్మతి కూడా ప్రజల్లో పెరగడంతో ప్రతి పక్షంలో ఉన్న శాన్సీటో ఇదే అస్త్రంగా వాడుతోంది. గడచిన కొవిడ్-19తో ఈపార్టీకి ప్రజల్లో మరింత ఆదరణ పెరుగుతూ వస్తోంది. ఇప్పుడు అమెరికా తరహాలోనే జపనీస్ ఫస్ట్, జపాన్ ఫస్ట్ నినాదంతో ఎన్నికల ప్రచారం ముమ్మరం చేసింది. అలాగే అక్రమ వలసలను సమూలంగా నిర్మూలిస్తామని హామీలు ఇస్తోంది. వలసదారులపై చాపకిందనీరులా దండయాత్ర తప్పదన్న హెచ్చరికలతో ప్రజల్లో చొచ్చుకుపోతున్నది. మొత్తం జనాభాలో 3శాతం వరకూ వలస దారులే ఉన్నందున జపాన్కు వస్తున్న అక్రమ వలసదారులను కట్టడిచేస్తే దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు దేశంలో జీవన వ్యయం కూడా నియంత్రించుకోగలుగతామని ఈ పార్టీ వాదిస్తోంది. గడచిన మూడు దశాబ్దాల్లో పది లక్షల మంది వలస ఉద్యోగుల వల్ల జపనీయులకు ఉద్యోగ భద్రత కొరవడిందన్న వాదనను తెరపైకి తీసు కురావడంతో అధికారంలో ఉన్న షిగేరుకు కొత్త సమస్యలు ఎదురయినట్లయింది. శాన్సీటో వ్యవ స్థాపక అధ్యక్షుడు 47 ఏళ్ల కామియా ఎన్నికల్లో గెలవాలంటే ప్రస్తుత ప్రభుత్వం పెరుగుతున్న వసలకు జవాబు చెప్పాల్సి ఉంటుందని చెప్పారు. గతంలో ఎవ్వరైనా వలసలపై మాట్లాడితే వామపక్షాలు తీవ్రస్థాయిలో దాడికి దిగేవి. ఇపుడు మాకు వలసలపై ప్రజలనుంచి మద్దతు లభిస్తోందని ఎల్డీపీ, కోమీటో ఇపుడు మౌనంగా ఉంటే చాలదని ప్రధాన సమస్య సవాలుగా మారిన వలసలపై జవాబు చెప్పాల్సిందేనని ఆయన పట్టుబడుతున్నారు. అయితే ఎన్నికల్లో శాన్సీటో పార్టీ కేవలం పదినుంచి 15కి మించి సీట్లు సాధించలేదన్న సర్వేలున్నా ప్రధాని ఇషిబాకు ఈ స్థానాలు కూడా కొంత విఘాతం కలిగించేవే. ఎల్డీపీ సంకీర్ణంలో సీట్ల సంఖ్య తగ్గితే ఇషిబా తన పట్టునిరూపించుకునేందుకు మరిన్ని అస్త్రాలు ప్రయోగించాల్సి ఉంటుంది. ప్రతిపక్ష పార్టీలతో కొన్ని రాజీసూత్రాలకు దిగాల్సి ఉంటుంది. అలా కాని పక్షంలో ఇషిబా పదవినుంచి దిగిపోయే ముప్పు తప్పదని మేధావులుఅంచనా వేస్తున్నారు. అదే జరిగితే జపాన్లో మళ్లీ రాజకీయ సంక్షోభం ఉధృత రూపం దాలుస్తుంది. వీటన్నింటిని పక్కన పెడితే అమెరికా వచ్చే ఆగస్టు ఒకటినుంచి 25 శాతం సుంకాలు వేస్తామని ప్రకటించింది. సుంకాలను అధిగమించేందుకు అత్యవసరంగా అమెరికా, జపాన్ ఆర్థిక మంత్రులు చర్చలకు దిగారు. చర్చల అనంతరం ఒక మంచి డీల్ కుదిరిందని అమెరికా ఆర్థిక మంత్రి బెస్సెంట్ వెల్లడించడంతో అధికార కూటమికి కొంత ఊరట లభించింది. పరస్పరం ప్రయోజనకారి అయిన ఆర్థిక ఒప్పందం జపాన్ అమెరికాల మధ్య సానుకూలం అవుతున్నదని అమెరికా ఆర్థికమంత్రి స్వయంగా ప్రకటించడంతో ఎగువసభ ఎన్నికల పరంగా ప్రధాని షిగేరు ఇషిబాకు కొండంత బలం చేకూరినట్లయింది. ఆసియా ఖండం మొత్తం జిడిపలో 10.89 శాతం వాటాతో ఉన్న జపాన్ జనాభా 12.31 కోట్లమంది మాత్రమే. అయితే కూడా మేధావులకు కొదవలేదు. శాస్త్రసాంకేతిక రంగాల్లో నిపుణులకు కొదవలేదు. ప్రపంచ వ్యాప్తంగా 11వ ప్రభావవంతమైన దేశం అయిన జపాన్లో మొత్తం జనాభాలో 93.1శాతం పట్టణ ప్రాంతాల్లోనే జీవిస్తారు. ఆర్థికవృద్ధిలో ఒకప్పుడు చైనాతో పోటీపడిన ఈ దేశం ఇప్పుడు విభిన్న సంక్షోభాలతో సతమతం అవుతోంది. ఈ సవాళ్ల నుంచి ప్రస్తుత ప్రధాని ఇషిబా బయటపడిఆర్థిక వ్యవస్థను ఎలా గాడిన పెడతారన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా నిలిచింది. ●




షిగేరు ఇషిబా

# బనకచర్ల ప్రాజెక్టుపై వివాదం ఎందుకు!

**బొల్లిముంత సాంబశివరావు**

తెలుగు రాష్ట్రాల మధ్య పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టు వివాదం రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సృష్టి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన ప్రాజెక్టు డిజైన్ దృష్టా అది ఉపయోగం లేనిది. ఉపయోగంలేని ప్రాజెక్టు గురించి వివాదం ఎందుకు. ఏపీ ప్రభుత్వం పంపిన బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ వెనక్కి పంపింది. కేంద్ర జల సంఘం అనుమతి తీసుకోకపోవటమే అందుకు కారణం. పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ (ప్రాజెక్టు సమగ్ర రూపం) ప్రతిపాదన) రూపకల్పనకు అనుమతి కోరుతూ ఏపీ ప్రభుత్వం తరపునకృష్ణా డెల్టా చీఫ్ ఇంజనీర్ మే 22న కేంద్ర జల సంఘంకు ప్రాథమిక నివేదికను సమర్పించారు. దీనిపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అభిప్రాయాన్ని కేంద్ర జలసంఘం కోరింది. దీనిపై పీపీఏ ఈ ప్రాజెక్టుకు నీరు ఇవ్వటం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. పోలవరం జలాశయంలో 41.15 మీటర్ల ఎత్తువరకే నీటి నిల్వతో ప్రాజెక్టు పూర్తి చేయటానికి కేంద్ర మంత్రి మండలి ఆమోదించిందని, ప్రాజెక్టు నీరుదాని ఆయకట్టు భూములకే సరిపోదని, అలాంటప్పుడు బనకచర్లకు నీరు ఇవ్వటం ఎలా సాధ్యమని పీపీఏ డైరెక్టర్ మన్నూ జీ ఉపాధ్యాయ కేంద్ర జల శక్తికి లేఖ వ్రాశారు. 45.72 మీటర్ల ఎత్తున నీటిని నిల్వ చేసేలా పోలవరాన్ని పూర్తి చేశాకే పోలవరం బనకచర్లపై ఆలోచన చేయవచ్చని స్పష్టం చేశారు. అసలు ఈ ప్రాజెక్టు పోలవరంలో భాగం కాదని పేర్కొన్నారు. పోలవరం బనకచర్ల ప్రాజెక్టుపై తన అభిప్రాయాన్ని పోలవరం అథారిటీ చెప్పిన తర్వాత కూడా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఈ ప్రాజెక్టు గురించి చర్చించటానికి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఎందుకు పిలవాలి. ఇరువురు ముఖ్యమంత్రులు సమావేశానికి వెళ్లే విషయమై చేసిన విరుద్ధమైన ప్రకటనలపై చర్చలు సాగి చివరికి ముఖ్యమంత్రులు ఇద్దరూ కేంద్ర మంత్రి వద్దకు పోవటం, పైకి మాత్రమే ఇద్దరి మధ్య వివాదమని తేలింది. సమావేశం తర్వాత విలేకరులు బనకచర్ల ప్రాజెక్టు విషయం అడగగా, దానిపై చర్చే జరగలేదని, ఎజెండాలో లేని దాని గురించి మాట్లాడానికి ఏముందని,ప్రాజెక్టు కడతామని ఎపి ప్రస్తావిస్తే గదా, మేము ఆపమని అభ్యంతరం చెప్పేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అదే రాత్రి 7.27 గంటలకు కేంద్ర జల శక్తి శాఖ విడుదల చేసినప్రెస్ సమాచార ప్రకటనలో బనకచర్ల ప్రస్తావనే లేదు. ఎపి జల వనరుల మంత్రి నిమ్మల రామ నాయుడు బనకచర్లపై చర్చ జరిగిందని బనకచర్లపై నిపుణులతో కూడిన సాంకేతిక కమిటీ వేస్తామని ప్రకటించాడు. ముఖ్యమంత్రి రేవంతరెడ్డి, ఎపి జల వనరుల మంత్రి ప్రకటనలు పరస్పర విరుద్ధంగా ఉండటంతో గందరగోళానికి, అనుమానాలకు అవకాశం ఏర్పడింది. దీనిపై రెండు రాష్ట్రాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతున్నాయి. పోలవరం బనకచర్ల పై జరుగుతున్న రాద్ధాంతమంతా ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు అమలు జరపడంలో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం కావడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఈ వ్యతిరేకతను పక్కదారి పట్టించటానికే పోలవరం బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తెచ్చి రెండు రాష్ట్రాల ప్రజల మధ్య వివాదం సృష్టిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాగు నీటి రంగ విధానాలు రైతాంగ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎపిలో జల వనరులు పుష్కలంగా ఉన్నావాటిని వ్యవసాయానికి మళ్లించడంలో రాష్ట్ర పాలకులు విఫలమయ్యారు. చిన్న, మధ్య తరహా ప్రాజెక్టుల నిర్మాణంకాకుండా కొద్ది భారీ ప్రాజెక్టుల వైపు మొగ్గు చూపారు. ఫలితంగా సాగు నీటి సమస్య కొనసాగుతుంది. రైతుల ఆందోళన ఫలితంగా సాగు, తాగు నీరు కోసమంటూ కొన్ని నీటి పథకాలు చేపట్టి దశాబ్దాలు గడిచినా అవి ఇంకా పూర్తి కాలేదు. ఫలితంగా రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం, పల్నాడు, విజయనగరం జిల్లాలో కొన్ని ప్రాంతాలు కరువు పీడిత ప్రాంతాలుగా నేటికీ కొనసాగుతున్నాయి. పాలకుల విధానాల వెడల రైతాంగంలో వ్యతిరేకత వ్యక్తమైన ప్రతి సందర్భంలో కొత్త సాగునీటి పథకాలు ముందుకు తెస్తున్నారు. అందులో భాగమే కొత్తగా తెరమీదకు వచ్చిన పోలవరం బసకచర్ల ఎత్తిపోతల లింక్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, పల్నాడు ప్రాతాలకు సాగు నీరు, తాగు నీరు అందించటం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇందు కోసం తాజాగా ' జల హారతి కార్పొరేషన్ లిమిటెడ్' అనే సంస్థను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది అమరావతి కేంద్రంగా పనిచేస్తుంది. ఈ ప్రాజెక్టు అనుసంధానానికి 81,900 కోట్ల భారీ ఖర్చుగా అంచనా వేశారు. ఈ అనుసంధానం ద్వారా 12.4 లక్షల హెక్టార్ల భూమికి సాగు నీరు, 400 వందల కిలోమీటర్ల పొడవునా ఉన్న గ్రామాలకు తాగు నీరు,340 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా కూటమి ప్రభుత్వ ప్రకటించింది. ఈ ప్రాజెక్టుకోసం 54 వేల ఎకరాల భూసేకరణ అవసరమని పేర్కొంది. వరద నీటిని ఉపయోగించుకోవటానికే ఈ ప్రాజెక్టు నిర్మాణం చేస్తున్నట్లు చంద్రబాబు ప్రభుత్వం అంటే, ప్రాజెక్టు వల్ల తీవ్ర నష్టం జరుగుతుంది, ప్రాజెక్టు ప్రతిపాదన విరమించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం అంటున్నది. ఈ ప్రాజెక్టును నీటిపారుదల అధికారులు మూడు దశలుగా విభజించారు. మొదటి దశలో పోలవరం నుండి తాడిపూడి వరద కాలువ ద్వారా 175 కిలోమీటర్ల వరకు 18 వేల క్యూసెక్కుల డిశ్చార్జ్తో ప్రకాశం బ్యారేజ్కు నీటిని విడుదల చేస్తారు. దీనికి 1,401 ఎకరాల భూమి కావాలి. ఈ మొదటి దశకోసం 13,800 కోట్లు ఖర్చు చేయాలి. రెండవ దశలో ప్రకాశం బ్యారేజ్ నుండి బొల్లాపల్లి రిజర్వాయర్ వరకు 23వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తారు. ఇందుకు 83.40 కిలోమీటర్ల మేర ఓపెన్ కెనాల్ నిర్మించి,12.05 కిలోమీటర్ల పైప్లైన్, ఆరు లిఫ్టులు నిర్మించాలి. మూడవ దశలో బొల్లాపల్లి రిజర్వాయర్ నుండి బనకచర్ల రెగ్యులేటర్ 23 వేల క్యూసెక్కుల నీటి విడుదలతో నీటిని తరలిస్తారు. ఇందుకోసం 109.80 కిలోమీటర్ల మేర ఓపెన్ కెనాల్ నిర్మించాలి. మూడో దశ చాలా క్లిష్టమైనదిగా సాగు నీటి రంగ నిపుణులు చెబుతున్నారు. నల్లమడ పులుల అభయార్యంలో 34 కిలోమీటర్ల మేర సొరంగంతవ్వాలి. 2005లో ప్రారంభించిన వెలుగొండ ప్రాజెక్టు రెండు సొరంగాల తవ్వకం పనులు నత్తనడకన నడుస్తూ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ అనుభవంరీత్యా నల్లమడలో తవ్వాల్సి నఔ అత్యంత క్లిష్టమైన సొరంగం ఎప్పటికి పూర్తి చేస్తారో చెప్పలేము.ప్రస్తుతం రాష్ట్రంలో 59ప్రాజెక్టులు నిర్మాణంలోఉన్నాయి. దశాబ్దాలు గడుస్తున్నా వీటి నిర్మాణం పూర్తి కాలేదు. నిధులు కేటాయిస్తే తక్కువ వ్యయంతో అనేక ప్రాజెక్టులు పూర్తి చేయవచ్చు.ముఖ్యంగా వెలుగొండ ప్రాజెక్టు, వంశధార రెండవ దశ,వంశధార నాగావళి,మహేంద్ర తనయ, గజపతి నగరం బ్రాంచికాల్వ,చింతలపూడి ఎత్తిపోతల పథకం, అమరావతి తీర్థసాగరం, సోమశిల స్వర్ణ ముఖి లింక్, గాలేరు నగరి ప్రాజెక్టు తొలిదశ, రెండవ దశ, హంద్రీనీవా తొలిదశ, పల్నాడు ప్రాంతంలో వరికలపూడి సెల పథకం, ఈ పథకాలన్నీ రూ.20వేల కోట్లలోపే పూర్తి చేయవచ్చు. 50 నుండి రూ.100కోట్ల ఖర్చుతో ఇంకాఅనేక ప్రాజెక్టులు పూర్తి అవుతాయి. ఇవన్నీ పూర్తిచేస్తే సాగునీటి సమస్య దాదాపు పరిష్కారం అయినట్లే. రూ.20 వేలకోట్లలోపు ఖర్చు చేసి పైన పేర్కొన్న ప్రాజెక్టులు పూర్తి చేయకుండా, 81 వేల కోట్లతో ప్రయోజనం లేని పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును ముందుకు తేవటం ఎందుకు. ఇలాంటి విధానాల వల్లసాగు నీటి సమస్య ఇంకా సుదీర్ఘ కాలం కొనసాగుతుంది. సాగు నీరు ప్రశ్నార్థకమైన ఈ ప్రాజెక్టు కోసం దాదాపు 82 వేల కోట్లు ఖర్చు చేయటం సరైన విధానంకాదు. ఒక వేల పోలవరం బనకచర్ల ప్రాజెక్టుమొదలు పెట్టినా, రూపొందించిన దాని డిజైన్లదృష్ట్యా అదిపూర్తి కావటానికి ఎన్ని సంవత్సరాలకు పూర్తి అయ్యేది చెప్పలేము. పూర్తిఅయ్యే నాటికి అనుకున్న వ్యయంకన్నా దానివ్యయం ఎన్నోరెట్లు పెరుగుతుంది. వేల కోట్లు జేబులు మారతాయి. ప్రాజెక్టు పేరుతో 54 వేల ఎకరాలు తమ భూములు రైతులు కోల్పోతారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఈ లింక్ ప్రాజెక్టువల్ల రెండుతెలుగు రాష్ట్రాలమధ్య గోదావరి జలాల వివాదం ముందుకు వచ్చింది. రెండూ రాష్ట్రాల ప్రజల మధ్య వైషమ్యాలు పెరిగే పరిస్థితులు ఏర్పడతాయి. ప్రయోజనకరం కాని బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ ప్రతిపాదన విరమించాలని, తక్కువ ఖర్చుతో పూర్తి అయ్యే ప్రాజెక్టులను ముందుగా పూర్తి చేసి, నిర్మాణంలో ఉన్న మిగిలిన ప్రాజెక్టులను కూడా పూర్తి చేసి,సాగు, తాగు నీరు అందించాలని యావన్మంది ప్రజలు ఉద్యమించాలి. ●



5_5.qxd 7/20/2025 12:53 AM Page 1



## పేరుకే ఆర్టీసీ బస్టాండ్.. ఒక్క బస్సు పాయింట్లోకి రాదు

- ప్రయాణికులు వేసవిలో ఒంగోలు
- కర్నూలు రహదారిపై బస్సులు కోసం గంటల తరబడి వేచి ఉండి సృహ కోల్పోతున్నారు



**సంతనూతలపాడు, జులై 19, ప్రభాతవార్త**

సంతనూతలపాడు ఆర్టీసీ బస్టాండ్ పేరుకే బస్టాండ్ ఒక్క బస్సు కూడా పాయింటులోకి రాదు. బసులన్నీ ఒంగోలు - కర్నూలు రహదారిపై కొన్ని నిమిషాలు పాటు ఆగి ఎగువప్రాంతానికి వెళ్తుంటాయి. సంతనూతలపాడులో ఆర్టీసీ బస్సులు ఎక్కాలంటే ప్రయాణికులు బస్టాండ్ విడిచి అవతల వైపు ఒంగోలు - కర్నూలు రహదారి మార్జిన్ ప్రాంతంలో వేచి ఉండవలసి ఉంది. దీని వల్ల ప్రయాణికులు బస్సు కోసం వేచి ఉండి కొందరు పెద్దలు వేసవిలో తట్టుకోలేక కింద పడిపోతున్నారు. ప్రస్తుతం సంతనూతలపాడు ఆర్టీసీ బస్టాండ్ బీజ పద్ధతిలో కొనసాగుతున్నది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఫ్లాట్లు ఉన్నాయి. కానీ అవి తెరవు. దీంతో ప్రయాణికులు ఇక్కట్లకు లోనవుతున్నారు. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఒంగోలు, చీమకుర్తి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఆర్టీసీ బస్టాండు పాయింట్లోకి వచ్చేటట్టు చర్యలు గైకొనాల్సిందిగా పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.



## కొత్తపట్నం మండలంలో పర్యటించిన ఒంగోలు ఎమ్మెల్యే



**కొత్తపట్నం జులై 19. ప్రభాతవార్త**

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మండలంలో సుడిగాలి పర్యటించారు. శనివారం సాయంత్రం నుండిమడనూరు,ఈత ముక్కల, రాజు పాలెం, గమండ్లపాలెం గ్రామాల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు పర్యటించారు. పార్టీ నాయకులు భారీ ర్యాలీతో బ్రహ్మ రథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా పాటించారన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటి ఇంటికి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లినప్పుడు మహిళలు ఆశీర్వదించారు ప్రభుత్వ పథకాలు అందాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి, గౌడ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జంపని రామచంద్రరావు, బలగాని వెంకటేశ్వరరావు బలగాని బోసు, కొత్తపట్నం పల్లెపాలెం గ్రామాల నుండి టిడిపి నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రైతు బంధు పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- మార్కెట్ యార్డు పాలక మండలి తీర్మానం - రైతులకు విజ్ఞప్తి




**అద్దంకి , జులై 19 ప్రభాతవార్త**

అద్దంకి వ్యవసాయ మార్కెట్ యార్డు పాలకమండలి శనివారం అద్దంకి మార్కెట్ యార్డు కార్యాలయంలో చైర్మన్ వరగాని పద్మావతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం పలు అంశాలను చర్చించింది. కూటమి ప్రభుత్వం రైతు బంధు పథకం ద్వారా అన్నీ పంటలను పండించిన రైతులకు, రైతు బంధు పథకం ద్వారా మేలు కలిగేవిధంగా నిర్ణయాన్ని తీసుకుందని,ఆ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటి పాలకమండలి సూచింది. ప్రధానంగా పంటలను సాగుచేసిన రైతులు, ఏ పంటనైనా, మార్కెట్ కమిటీ పరిధిలోని గోదాంలలో 6నెలల పాటు ఉచితంగా నిల్వ వుంచుకోవచ్చునని, ఆ నిల్వలపై ఎటువంటి వడ్డీ లేకుండా, 2లక్షల వరకు రుణం పొందవచ్చుని, 6నెలల కాల వ్యవధి వ్యవధి వరకు, ఆ రుణంపై ఎటువంటి వడ్డీ వుండదని, మార్కెట్ కమిటీ పాలకమండలి సమావేశంలో సూచించింది. 6నెలల వరకు గోదంలో వుంచిన సరుకుకు సంబంధించి, మెయిటెంటన్స్ చార్జీలు కూడ వుండవని, సమావేశంలో పేర్కొన్నారు. అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీకి సంబంధించి, నూతన భవనాన్ని నిర్మించాలని, అందుకు అవసరమైన ప్రతిపాధనలను సిద్దం చేయాలని, కమిటీ తీర్మానించింది. అదే విధంగా జాతీయ రహదారి పి.గుడిపాడు సమీపంలో కూరగాయల యార్డు కొరకు 11 ఏకరాల స్థలాన్ని ప్రభుత్వం ద్వారా సేకరించి, అంశంపై కూడ సమావేశం చర్చింది. అదే విధంగా అద్దంకి పట్టణంలో కూరగాయల మార్కెట్ విషయంలో రైతు బజార్ ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని పాలకమండలి, రెవిన్యూ యంత్రాంగాన్ని కోరుతూ తీర్మానం చేసింది. ఎన్ఎస్పి కాలనీ సమీపంలో అన్నా క్యాంటిన్ పరిసరాలలో, రైతు బజార్ కొరకు స్థలం కేటాయించాల చూడాలని సమావేశంలో తీర్మానించారు. అదే విధంగా రైతులకు సంబంధించి, పలు అంశాలను సమావేశంలో చర్చించారు. చైర్మన్ వరగాని పద్మావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్ ధర్మవరపు నాగేశ్వరరావు, పాలకమండలి డైరెక్టర్‌లు, మార్కెట్ కమిటీ సెక్రటరీతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమి పాలనలో ప్రజలే పాలకులు

- దర్శి పట్టణంలో టీడీపీ సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, జులై 19, ప్రభాతవార్త**

సుపరిపాలన ఏడాది తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మీ ఇంటికి వచ్చాం, మీ అభిప్రాయం తెలుసునేందుకు మీ గడపకి వచ్చాం అంటూ దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ శనివారం సాయంత్రం దర్శి పట్టణంలోని నాల్గువ వార్డు ఎస్సీ కాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రజాభిప్రాయం సేకరించారు. ఏడాది కూటమి పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రజా సంక్షేమం అభివృద్ధి కోసం పరితపిస్తున్నారు. ఏడాది పాలనలో 90 శాతం హామీలను నెరవేర్చి ప్రజల అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా మన కూటమి పాలన సాగుతుంది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఇంటికి చేరాలని నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ప్రజల సంతోషం ఆనందం వారిలో ఉన్న అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు వారదులుగా ప్రభుత్వానికి మేము సేవకులుగా ఇంటింటికి తిరుగుతున్నాము. ప్రజలకు జవాడుదారులుగా పని చేస్తున్నాము. ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రజలు ఎంతో ఆనందంగా ఏడాది కూటమి పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అదే స్ఫూర్తితో దర్శి నియోజకవర్గంలో అభివృదిన ఎజెండాగా మనం ముందుకు వెళ్తున్నాం. ఈ కార్యక్రమంలో దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, నియోజకవర్గంలోని దర్శి ముండ్లమూరు, తాళ్లూరు మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీను, మేడగం వెంకటేశ్వరరెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ(చిన్న), దర్శి మున్సిపల్ వైస్ చైర్మన్ గర్నెపూడి స్టీవెన్, కౌన్సిలర్లు ఇత్తడి సునీత, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలు, కేఎస్ఎస్ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## బోడపాడులో సిసిరోడ్లను ప్రారంభించిన మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి



**మార్కాపురం రూరల్, జూలై 19 ,ప్రభాతవార్త**

మార్కాపురం మండలంలోని బోడపాడు గ్రామంలో శనివారం మంత్రిడోలా బాల వీరాంజనేయ స్వామి మరియు మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి సిసి రోడ్లను ప్రారంభించారు. ముందుగా పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డికి ఎంతో కసి ఉందని అహర్నిశలు అదే పనిలో ఉన్నారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు అని బోడపాడు గ్రామంలో సుమారు రూ.25లక్షల విలువైన సిసిరోడ్లను ప్రారంభించడం సంతోషంగా ఉందని, మన పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చేయటమే నా లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో వక్కలగలడ్డ మల్లిఖార్జున, మాలపాటి వెంకటరెడ్డి, జివ్వాజి, రమణారెడ్డి, తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకం అనర్థం

**ఒంగోలు, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం ఒంగోలు నగరంలోని మున్సిపల్ కార్యాలయం నుండి ట్రంక్ రోడ్డు మీదుగా అద్దంకి బస్టాంబ్ వరకు అవగాహన ర్యాలీలో జాయింట్ కలెక్టర్, శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్న ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు. ర్యాలీ మధ్య మధ్యలో ప్రతి షాపును సందర్శించి షాపు యజమానులకు ప్లాస్టిక్ వాడుకోవడం వలన వచ్చే అనర్థాలు గురించి వివరిస్తూ ప్రతి షాపు యజమాని ప్లాస్టిక్ సంబంధిత వస్తువులు అమ్మకూడదని నగర పాల సంస్థనుప్లాస్టిక్ ఫ్రీసిటీగా నిలిపేందుకు ప్రజలందరూ ,షాపు యజమానులు సహకరించాల్సిందిగా జనార్ధన్ తెలియజేశారు. ప్లాస్టిక్ వ్యర్థపదార్థాలకు బదులు బయోడిగ్రేడబుల్ వస్తువుల్ని ఎలా వాడాలో నగరపాలక సంస్థ ప్రజలకు వివరించాలనితెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.






## మార్కాపురం బస్టాండ్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

- క్యాంటీన్ ధరలపై సీరియస్.. అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు..





**మార్కాపురం రూరల్, జూలై 19, ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలో శనివారం పర్యటించిన జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆకస్మికంగా బస్టాండును తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉన్న మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను ఆమె పరిశీలించారు. బస్టాండ్ నుంచి ఎన్ని సర్వీసులు నడుపుతున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో బస్టాండులోని ఒక షాపులో స్థానికంగా తయారైన త్రాగునీటి బాటిళ్లను అధిక రేటుకు విక్రయిస్తుండడాన్ని గుర్తించారు. ఎలాంటి ఎంఆర్‌పి లేకుండా ఇష్టానుసారంగా విక్రయిస్తున్నా స్థానికంగా తయారైన తినుబండారాల ప్యాకెట్లను కూడా ఆమె గమనించారు. షాపులో ధరల పట్టీ కూడా లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తాను ఈ షాపును తనిఖీ చేసి లోపాలను సరిచేసుకోవలని నోటీసు ఇచ్చినట్లు స్థానిక తహశిల్దార్ చిరంజీవి ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె స్పందిస్తూ షాపును క్లోజ్ చేయించాలని, ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ధరల పట్టీ లేకపోయినా, నాణ్యత ప్రమాణాలు పాటించకపోయినా, కాంట్రాక్టు/అనుమతి లేకుండా షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకోవాలని వారికి దిశానిర్దేశం చేశారు. ప్రయాణీకులకు సదుపాయాలు, సేవల విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని వారికి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సత్యనారాయణ, తహశిల్దార్ చిరంజీవి, ఇతర అధికారులు ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, జులై 19, ప్రభాతవార్త**

శనివారం సాయంత్రం దర్శిలోని గొట్టిపాటి లక్ష్మీ నివాసం వద్ద నియోజకవర్గంలోని దాదాపు 40 మందికి 24 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన దర్శి టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మారెళ్ల వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీను, మేడగం వెంకటేశ్వర్లు, టౌన్ పార్టీ అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ(చిన్న) నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**మార్కాపురం రూరల్, జూలై 19, ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను శనివారం జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా సందర్శించారు. ఈ సందర్భంగా బాలికలతో పలు విషయాలను చర్చించారు. హాస్టల్ ప్రాంగాణంలో సదుపాయాలు, ఆహార నాణ్యతపై ఆరాతీశారు. వంటగదిని ప్రత్యేకంగా పరిశీలించిన అన్సారియా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఏకాంతంగా విద్యార్థినీలతో మాట్లాడిన కలెక్టర్ అన్సారియా అనంతరం త్రాగునీటి నాణ్యతలో నిర్లక్ష్యం ఉండకూడదని వార్డెన్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ విద్యార్థినీలకు హాస్టల్‌లో ఏదైనా సమస్య ఉంటే కంప్లైంట్ బాక్సులో రాసి వేయాలని, బాగా చదువుకోవాలని విద్యార్థినీలకు తెలిపారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా మలేరియా నివారణ అధికారి మధుసూధన్ రావు, ఎన్టీఆర్ వైద్యసేవా జిల్లా సమన్వయకర్త హేమంత్, తహశీల్దార్ చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ ప్లస్ కళాశాలలో సరస్వతి మాత విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసిన కదిరి పార్థసారథి



**సీఎస్‌పురం, జులై 19, ప్రభాతవార్త**

కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ ప్లస్ కళాశాల ప్రాంగణంలో కదిరి బాబురావు విద్యాసంస్థలు,కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇరగని చలపతిరావు సహకారంతో నూతనంగా సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు.శనివారం విగ్రహ ఏర్పాటుకు కదిరిబాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి భూమి పూజ చేశారు. పార్థసారధి మాట్లాడుతూ త్వరలో సరికొత్త రూపు రేఖలు దిద్దుకున్న దివ్యమైన సరస్వతీ మాత విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇరగని చలపతిరావు, స్కూల్ చైర్మన్ మూరం మస్తాన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మూరం కాశిరెడ్డి, ఉప సర్పంచ్ టి.బాబురావు, పట్నం తిరుపతయ్య, నిమ్మల శ్రీనివాసులు, నున్నా నారాయణ, ఇరగని మాధవరావు, వెంకటాద్రి, అంజనాద్రి, టి.లక్ష్మీ నారాయణ, ప్రధానోపాధ్యాయులు బోడే ప్రసాద్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టులపై ప్రైవేటు పెత్తనం సహించం

- అలా చేస్తే రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసినట్టే
- పెండింగ్ ప్రాజెక్టులు గాలికి వదిలిన ప్రభుత్వం
- బనకచర్ల పేరుతో కొత్తరాగం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ ధ్వజం

**ఒంగోలు, ప్రభాతవార్త**

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అలా చేస్తే రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసినట్టేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ ధ్వజమెత్తారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యం ఎక్కడా లేదన్నారు. కొత్తగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలవరం, బనకచర్ల ప్రాజెక్టుల నిర్మాణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో ప్రాజెక్టును నిర్మిస్తామని ఇరిగేషన్‌శాఖ మంత్రి చెప్పటాన్ని సీపీఐ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించాలని కేంద్రం సూచించిందని అన్నారు. ప్రస్తుతం డబల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరో సారి పోలవరం ఎత్తుపై రాజకీయం చేస్తుందన్నారు. 45.75 అడుగుల ఎత్తున నీటి నిల్వ చేసుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. అలా కాకుండా 41.5 అడుగులు మాత్రమే నీటి నిల్వకు కేంద్రం అనుమతిస్తే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రూ.82 వేల కోట్లతో పోలవరం బనకచర్ల ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్తున్న ప్రభుత్వం, ప్రాజెక్టు పూర్తయ్యే నీటికి అంచనా వ్యయం రెండు లక్షల కోట్లకు తీసుకెళ్తారని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మాణంలో ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యాన్ని ఏ రాజకీయ పార్టీ, రైతు సంఘాలు, ప్రజలు ఎవరు అంగీకరించరని తెలిపారు. దీనిపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా ప్రజలను పక్కదారి మళ్లించేందుకే పోలవరం, బనకచర్ల ప్రాజెక్టులను తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో వెలుగొండ; హంద్రినీవా, గాలేరు, నగరి, వంశధార, నాగవల్లి ప్రాజెక్టతో పాటు అనేక చిన్న, మధ్య ఇరిగేషన్ ప్రాజెక్టులు, కాలువలు నిర్మాణానికి నోచుకోక పెండింగ్లో ఉన్నాయన్నారు. వాటిని గాలికి వదిలి కొత్త ప్రాజెక్టు పేరుతో ప్రజలను పక్కదారి మళ్లించేందుకే తెరపైకి బనకచర్ల ప్రాజెక్టును ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలనలో రూ.లక్ష 70 వేల కోట్లు అప్పులు చేస్తే తప్ప అభివృద్ధి ఎక్కడ కనిపించడం లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడైనా అభివృద్ధి జరిగిందంటే అది కేవలం సంపన్నుల కొరకు ఉపయోగపడే అభివృద్ధేనని విమర్శించారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం రూ.31 వేల కోట్లు ఇప్పటి వరకు అప్పు తెచ్చారని పేర్కొన్నారు. తెచ్చిన అప్పులు వడ్డీ కట్టడానికే సంవత్సరానికి రూ.70వేల కోట్లు అవసరం అవుతాయని తెలిపారు. అమరావతిలో మరో 30 వేల ఎకరాలు సేకరణకు, అదే విధంగా నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు వద్ద ఇండోసోల్ కంపెనీకి 8500 ఎకరాలు భూసేకరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం బట్టి చూస్తే చంద్రబాబునాయుడుకు భూ దాహం పట్టిందని పేర్కొన్నారు. కరేడు వద్ద మూడు పంటలు పండే భూములను ఇండోసోల్ కంపెనీకి కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, అయితే సముద్ర తీరంలో వేల ఎకరాలు పంటలు పండని భూములు ఉన్నాయని, వాటిని పరిశ్రమలకు కేటాయించాలని సూచించారు. ఎన్నికల ముందు అవినీతిని ప్రశ్నించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. రాష్ట్రంలో బియ్యం అక్రమ రవాణా జోరుగా జరుగుతుందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అవినీతి భాగా పెరిగిపోయిందని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై పవన్ కళ్యాణ్ నోరు మెదపడం లేదన్నారు. పవన్ కళ్యాణన బీజేపీ- ఆర్ఎస్ఎస్ భజన చేస్తూ గుడి గోపురాలు చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవ చేశారు. దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లు పవన్ కళ్యాణ్, చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప మరొకటి చేయటం లేదని విమర్శించారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడం సహజమే అయితే ఆ విమర్శలు అవతలి వ్యక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉండకూడదని రామకృష్ణ సూచించారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో మహిళపై వైసీపీ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు శృతి మించి విమర్శించుకోవడం మంచి పద్దతి కాదన్నారు. మహిళలపై చేస్తున్న విమర్శలను సీపీఐ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అలాంటి విమర్శలపై టీడీపీ అధినే చంద్రబాబునాయుడు, వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి వారి పార్టీ నాయకులను కంట్రోల్ చేసుకోవాలని, లేకుంటే ప్రజలే తిరగబడతారని హెచ్చరించారు. ఆగష్టు 23,24,25వ తేదీల్లో ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభల్లో జరుగుతున్న రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అవసరమైన సంక్షేమంపై చర్చించి తీర్మానించి ప్రజల ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.వెంకటరావు, నగర పార్టీ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు యుగంధర్‌లు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాలి

## - డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి



**కొనకనమిట్ల, జులై 19, ప్రభాతవార్త**

ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాలని కనిగిరి డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి కోరారు. శనివారం చిన్నారికట్లలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కలిగించారు. ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులను వాడాలని దుకాణ దారులకు సూచించారు. కరపత్రాలను పంపిణీ చేసి వివిధ సూచనలు చేశారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పెనుముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోసుల అనురాధ, వెలుగొండయ్య, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మీ, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. తొలుత ర్యాలీ నిర్వహించారు.

## మాజీ ఎమ్మెల్యే ఉడుములను సన్మానించిన వైసీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు



**కొనకనమిట్ల, జులై 19, ప్రభాతవార్త**

మండలంలోని వైసీపీ అనుబంధ విభాగాల పదవులు ఇటీవల చేపట్టిన సోషల్ మీడియా అధ్యక్షుడు కోటపాటి బ్రహ్మారెడ్డి, వాలంటీర్‌వింగ్ అధ్యక్షుడు మరవతు వెంకటేశ్వర్లు మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పూలమాలలు వేసి,శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కొనకనమిట్ల ఎంపీపీ మురళీకృష్ణ, వేమన వెంకటేశ్వరరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 7వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె





**అద్దంకి, జులై 19, ప్రభాతవార్త**

మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ కార్మికులు సమ్మెకు మద్దతు తెలియజేసిన ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర నాయకులు కావూరి రఘు చంద్ మరియు పారిశుద్ధ్య కార్మికులు. మున్సిపల్ ఇంజనీర్ విభాగం కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం ఏడవ రోజుకి చేరుకోవడంతో రోజువారి నిరసన కార్యక్రమాల్లో భాగంగా అద్దంకి మున్సిపాల్ ఆఫీస్ వద్ద మెయిన్ రోడ్డు నందు కార్మికులు మానవహారం నిర్వహించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కె రఘుచంద్ మాట్లాడుతూ నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగిపోయి కుటుంబాలు పైన ఆర్థిక భారాలు పడుతున్నాయని విద్యా వైద్యానికి కార్మికులు అప్పులు చేసి ఖర్చు చేయాల్సి వస్తుందని కార్మికులు నెలకి 15 వేల వేతనంతో కుటుంబ ఖర్చులను ఎలా భరాయించాల్సి వస్తుందో ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కార్మికులు న్యాయమైన డిమాండ్స్ కనీస వేతనం 26 వేల రూ ఇవ్వాలని జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు చెల్లించాలని కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేసిన ఆన్లైన్లో కార్మికుల పేర్లు తొలగించాలని కార్మికులకు పిఆర్సి అమలు చేయాలని కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే చిత్తశుద్ధితో చొరవ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు. ఆల్ ఇండియా లాయర్ అసోసియేషన్ యూనియన్ నాయకులు డి గంగాధర్. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి ఆదాం. అద్దంకి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గాలి భీష్మ. ఇంజనీర్ విభాగం నాయకులు వి జాన్, ఉసిరిపాటి శామ్యూల్. కె మారుతి. జి మార్కు. అలివేలమ్మ. జ్యోతి వెంకటరావు. తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర భాగంలోథీమ్ బన్ సింగల్ యూజ్ ప్లాస్టిక్



**జె. పంగులూరు , జులై 19 ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ కమిషనర్ కె కన్నబాబు, జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ మెజిస్ట్రేట్ వెంకట మురళి, జిల్లా పంచాయతీ అధికారి సూచనలతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిని కె స్వరూప రాణి అధ్యక్షతన మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా థీమ్ బన్ సింగల్ యూజ్ ప్లాస్టిక్ గురించి విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత విద్యార్థిని, విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రమాదాలకు మూలమైన ప్లాస్టిక్ సంచులు వాడుక నివారిద్దాం, నివారిద్దాం అంటూ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. సందర్భంగా తాసిల్దార్ పి .సింగారావు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం యొక్క స్ఫూర్తితో అనుసరించిన ప్లాస్టిక్ ఉపయోగాలని నివారించడం, సంబంధిత కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా గ్రామపంచాయతీలలో ప్రజలకు అవగాహన కల్పించే విధంగా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్లాస్టిక్ బదులుగా ఉపయోగించడానికి అందుబాటులో ఉన్న పర్యావరణహిత ప్రత్యా మ్నాయ వస్తువులపై అవగాహనా పెంచాలన్నారు. విద్యార్థి దశ నుండి పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. డిప్యూటీ సీఈవో పి బాలుప్పు మాట్లాడుతూ పంగులూరు గ్రామపంచాయతీ డంపింగ్ యార్డులో గల చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో తడి చెత్త పొడి చెత్త వేరు చేయు విధానము వివరించి సింగల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం గురించి అవగాహన విద్యార్థిని విద్యార్థులకు కలిగించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అనంతరాం, డిప్యూటీ ఎం.పీ.డీ.ఓ కె సుమంత్, జడ్పీటీసీ సభ్యురాలు రాయిని ప్రమీల, మండల టీడీపీ అధ్యక్షులు రావూరి. రమేష్ బాబు, ఏ.ఈ అగ్రికల్చర్ ఎస్ శివయ్య ఏ.పి.ఎం. కోటేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి బి. రాంబాబు మండల్ లెవెల్ ఆఫీసర్ సచివాలయ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మచ్చ వెంకటేశ్వర్లు



**జె. పంగులూరు , జులై 19, ప్రభాతవార్త**

మండలంలోని కొప్పూరం గ్రామస్తులు కోటిపాటి లక్ష్మి తల్లి మేరుమూరి గోవిందమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారిని పంగులూరు విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అండగా నిలిచింది. జిల్లా సంఘం, దాతల సహకారం తో మండల విశ్వబ్రాహ్మణ అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గోవిందమ్మ మట్టి ఖర్చుల నిమిత్తం పదివేల రూపాయల నగదును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మునగంటి నరసింహా చారి, సంఘం గౌరవ అధ్యక్షులు టి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి తెక్కెళ్ళపాటి నాగేంద్రప్రసాద్, కోశాధికారి ఆర్ శ్రీనివాసరావు, బి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశిత సమయంలో పాఠ్యాంశాల బోధన పూర్తి చేయాలి



**బల్లికురవ, జులై 19, ప్రభాతవార్త**

నూతన విద్యా విధానంలో భాగంగా నిర్దేశిత సమయాలలో పాఠ్యాంశాల బోధన పూర్తి చేయాలని ఎంఈఓలు వల్లం నాయక్, రమేష్‌బాబులు సూచించారు. మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో భాగంగా ఉపాధ్యాయులకు జరిగిన సమావేశాల్లో వీరు పలు సూచనలు చేశారు. నాలుగు క్లస్టర్‌లలో శనివారం సమావేశాలు నిర్వహించారు. కొప్పెరపాడు, వైదన, బల్లికురవ, కొనిదెన ఉన్నత పాఠశాలల్లో ఈ సమావేశాలు కొనసాగాయి. డ్రాపౌట్ విద్యార్థులను పాఠశాలలో చేర్పించే విధంగా పలు సూచనలు చేశారు. ఈ సమావేశాల్లో ప్రతి ఉపాధ్యాయునికు సబ్జెక్టు వారిగా చేతి పుస్తకాలు అందజేశారు.

## పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహశీల్దార్ జి వి సుబ్బారెడ్డి



**కొరిశపాడు , జులై 19, ప్రభాతవార్త**

దేశంలోనే ప్ర ప్రథమంగా నల్ల బర్లి పొగాకు రైతులు నష్టపోకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్కెఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయటం పాఠకులకు విధితమే అందులో భాగంగా మండలంలోని తమ్మవరం గ్రామంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈనెల ఎనిమిదో తారీకు నల్లబల్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు శనివారం నాడు బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటకృష్ణ ఆదేశాలతో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దార్ జి.వి.సుబ్బారెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా పొగాకు రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు నష్టపోకుండా వారు పండించిన బర్లీ పొగాకును చివరి ఆకుదాకా కొనుగోలు చేయాలని నిర్ణయించుకొని మార్కెఫెడ్ రంగంలోకి దించిందన్నారు కావున మండలంలోని రైతులందరూ వారికి కేటాయించిన తేదీలలో తమ పొగాకును కొనుగోలు కేంద్రానికి తీసుకుని వచ్చి విక్రయించుకోవాలన్నారు అలాగే విక్రయాలలో రైతులు సిబ్బందికి కొనుగోలుదారులకు సహకరిస్తూ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు ఈ కార్యక్రమంలో డిటి రవికాంత్ మార్కెఫెడ్ సిబ్బంది, బర్లి పొగాకు రైతులు, రైతులు పాల్గొన్నారు.

## మహిళ మెడలోని గొలుసును తెంచుకొని వెళ్లిన దుండగులు

### - మూడు లక్షల విలువైన బంగారం దొంగల పాలు





**కొరిశపాడు ,జులై 19, ప్రభాతవార్త**

భర్త చనిపోగా చిన్న హోటల్ నిర్వహించుకుంటూ జీవనం గడుపుతున్న మహిళ మెడలోని గొలుసును బలవంతంగా తెంచుకొని దుండగులుపారిపోయిన సంఘటన కొరిసపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొరిశపాడు గ్రామంలో శనివారం ఉదయం జరిగింది వివరాల్లోకి వెళ్తేకొరిసపాడు ఫ్లైఓవర్ నుంచి గ్రామంలోకి వెళ్లే సెంటర్ వద్ద గోలి సత్యవతి అనే మహిళ భర్త చనిపోగా కుటుంబ పోషణ కోసం చిన్న హోటల్ నిర్వహించుకుంటుంది శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇరువురు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె వద్దకు వచ్చి టిఫిన్ కావాలి అని అడిగారు, ఆమె వారికి టిఫిన్ ఇవ్వగా ఆమెకు కొంత డబ్బు ఇచ్చారు, ఆమె నగదు లెక్కించుకునే సమయంలో వారిలోని ఒక వ్యక్తి ఆమె నోరు గట్టిగా మూసి మెడలోను గొలుసు దొంగిలించే ప్రయత్నం చేశాడు అతని దుశ్చర్యను గమనించి ఆమె గట్టిగా ప్రతిఘటించింది ఆ పెనుగులాటలో ఆమె తూలిప్రక్కన ఉన్న బండపై పడి తలకు గాయాలయ్యాయి ఈ పెనుగులాటను గమనించి పక్కన ఉన్న బంధువులు హోటల్ వద్దకు వచ్చేలోపే దుండగుడు ఆమె మెడలోని మూడున్నర సవర్ల బంగారు గొలుసు ను సత్యవతి మెడ నుంచి సంగ్రహించి తోడుగా వచ్చిన వ్యక్తితో కలిసి మోటార్ సైకిల్ పై ఫ్లై ఓవర్ అండర్ పాస్ గుండా చిలకలూరిపేట వైపుకు పారిపోయాడు బంధువులు గాయాల పాలైన సత్యవతి నీ మేదర మెట్లలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దొంగతనం విషయం తెలుసుకున్న ఎస్ఐ సురేష్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. బాపట్ల ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు సిసిఎస్ డిఎస్పి జగదీష్ నాయక్ అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు లతో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని ఘటనా స్థలాన్ని పరిశీలించారు డి.ఎస్.పి జగదీష్ నాయక్ రూరల్ సీఐ మల్లికార్జున రావు ఈ దొంగతనాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో అతి త్వరలోనే చేదించి దొంగలను పట్టుకుంటామని తెలియజేశారు

# స్త్రీ నిధిలో రికవరీ చేయాలి

## - బదిలీపై వెళ్లిన ప్రసాద్‌కి ఘన సన్మానం



**జె. పంగులూరు , జులై 19 ప్రభాతవార్త**

స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమైక్య అధ్యక్షురాలు మాధవి అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏ.పీ.ఎం. కోటేశ్వరరావు మాట్లాడుతూ స్త్రీ నిధి రికవరీ చేయాలని, కొత్త రుణాలు పంపిణీ చేయాలని గ్రామాలలో మహిళా కుటుంబాల జీవనోపాదులు పెంపొందింప చేయాలన్నారు. ఈ సమావేశం అనంతరం గతంలో ఏపీఎం గా విధులు నిర్వహించిన బదిలీ పై అద్దంకి వెళ్లిన ఏ.పీ.ఎం. జ్యోతి ప్రసాద్ బాబుకి మండల తెలుగుదేశం అధ్యక్షుడు రావూరి రమేష్ బాబు, గుర్రం శేఖర్, నాయకుడు ఓ.ఓబుల్ రెడ్డి, జి.ఆదిరెడ్డి, రవి, ప్రసాద్ బాబు, మండల సమాఖ్య, గ్రామ సంఘ అధ్యక్షులు, వివో ఏలు దుస్సాలుగా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్లు, సీసీలు, వివోఏలు పాల్గొన్నారు.

## పేదలను ఆదుకుందాం.. సామాజిక సేవలో పాలుపంచుకుందాం

### - యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు పిలుపు

**పెద్దదోర్నాల, జులై 19, ప్రభాతవార్త**

పేదలను దత్తత తీసుకొని అభివృద్ధి చేద్దాం అని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు పిలుపునిచ్చారు. దత్తత అంటే కేవలం ఆర్థిక సహాయమే కాదు, వారు ఎదగడానికి నూతన జీవితం ప్రారంభించేందుకు మానసికంగా సామాజికంగా మద్దతిచ్చి ఆదుకోవడం అని ఆయన వివరించారు. పెద్దదోర్నాల గ్రామ పంచాయతీ ఆవరణంలో శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శి నలగాటి శివ కోటేశ్వరరావు అధ్యక్షతన జీరో పీ 4 ప్రాపర్టీ గ్రామసభ జరిగింది. ఈ సభలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలు సక్రమ వసతులు లేక, పిల్లల విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాల్లో వెనుకబడి ఉన్నాయని, జీరో పీ 4 ప్రావర్టీ సర్వేలో గుర్తించిన పేదలను ఆదుకునేందుకు ఉత్సాహవంతులు ముందుకు రావాలన్నారు. అదే క్రమంలో ప్లాస్టిక్ వాడకంను కూడా తగ్గించి లేదా నిర్మూలించి కాటన్ లేదా పేపర్ వస్తువులు ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్ వాడడం, చెట్లు నరకడం వంటి చర్యల ద్వారా పర్యావరణ సమతుల్యతకు విఘాతం ఏర్పడిందని, నాడు సూర్యుని చూసి టైం చెప్పే వాళ్ళమని, వాతావరణంలో మార్పులు ఏర్పడి నేడు మబ్బుల వైపు చూసి టైం చెప్పలేకపోతున్నామని, వాతావరణ పరిస్థితులు కూడా మనుగడలోకి తీసుకొని మొక్కలు నాటి చెట్లను పెంచి, ప్లాస్టిక్ వాడకం తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. అనంతరం గ్రామ సభలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజలు ఇచ్చిన అర్జీలు వినతులపై స్పందించిన యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీఇన్‌చార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు అప్పటికప్పుడు సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడి అర్జీలు పరిష్కారం చూపడంతో లబ్దిదారులు ఆనందం హర్షం వ్యక్తపరిచారు. గ్రామ సభలో ఎంపీడీఓ నాసర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చిత్తూరి హారిక, గ్రామ కార్యదర్శి నలగాటి శివ కోటేశ్వరరావు, టీడీపీ మండల కన్వీనర్ ఏరువ మల్లిఖార్జునరెడ్డి, టీఎన్‌టీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోర్నాల సొసైటీ బ్యాంకు చైర్మన్ బట్టు సుధాకర్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షేక్ మాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడి లక్ష్మయ్య, టీడీపీ లీగల్ సెల్ న్యాయవాది వల్లభనేని కాశయ్య, మాజీ సర్పంచ్ వెచ్చ హరగోపాల్, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, చంటి, షేక్ మౌలాలి, షేక్ రఫీ, పఠాన్ ల్యాబ్ ఖాన్, జనసేన అధ్యక్షుడు కేతి వెంకట మురళి, ఆర్ కృష్ణ, బీజేపీ మాజీ అధ్యక్షుడు సువరం గండి వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలల సముదాయ సమావేశాలను సందర్శించిన మండల విద్యాశాఖ అధికారులు



**మార్టూరు, జులై 19, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్టూరు మండలం లోని నాలుగు పాఠశాల సముదాయాల సమావేశాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మార్టూరు, ద్రోణాదుల కొలలపూడి పాఠశాల సముదాయాలలో మండల విద్యాశాఖ అధికారి ఎంఈహెచ్ వస్త్రామ్ నాయక్ పాల్గొనగా, వలపర్ల పాఠశాల సముదాయంలో కే.ప్రేమలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి అనేక సంస్కరణలు మార్పులు చేస్తున్న సందర్భంగా ఉపాధ్యాయులు కూడా ఆ దిశగా విద్యాబోధన చేయడానికి ప్రణాళిక ఏర్పాటు చేసుకొని, ప్రభుత్వం అందించిన అకాడమిక్ క్యాలెండర్, టీచర్స్ హ్యాండ్ బుక్స్‌ను అనుసరించి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు విద్యా ప్రమాణాలు పెంచడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిందిగా ఆదేశించారు. రానున్న రోజులలో ప్రభుత్వం ఉపాధ్యాయులకు కూడా గ్రేడింగ్ పాయింట్లు ఇవ్వనున్నందున ప్రతి ఉపాధ్యాయుడు కూడా రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనల మేరకు విద్యాబోధన చేయాల్సిందిగాఆదేశించారు.ఈకార్యక్రమంలో నాలుగుపాఠశాలల సముదాయాల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు జి.రమేష్, ఎస్.రామారావు, పి.శ్రీనివాసరావు, టి.తిరుపతమ్మ పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టండి

## - సీడీపీఓ సుధా



**బల్లికురవ, జులై 19, ప్రభాతవార్త**

మనిషి మనుగడకు అత్యంత ప్రమాదకరంగా మారుతున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని సీడీపీఓ సుధా అన్నారు. మండలం ఎస్ఎల్‌గుడిపాడు గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ప్లాస్టిక్ వాడకం అనర్థాలను వివరించారు. మన ఇంటిని, పరిసరాలను ఎలా పరిశుభ్రంగా ఉంచుకోవడం, అందువల్ల కలిగే ప్రయోజనాలు, ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే నష్టాలు వివరించడం జరిగింది. సింగల్ యూజ్ ప్లాస్టిక్ వీలైనంత వరకు తగ్గించాలని, ప్లాస్టిక్ కవర్ స్థానంలో గుడ్డ సంచిని వాడాలి, మంచినీళ్లను ప్లాస్టిక్ బాటిల్స్ కాకుండా స్టీల్ లేదా రాగి బాటిల్స్ వాడాలని, పిల్లలకి ఇచ్చే ఆహారాన్ని కూడా స్టీల్ బాక్స్‌లో పెట్టడం అలవాటు చేసుకోవాలని తల్లులకు సూచించారు. కాఫీ, టీ లాంటి వేడి పదార్థాలు ప్లాస్టిక్ గ్లాసుల్లో తాగటం వల్ల క్యాన్సర్ లాంటి ప్రమాదకర జబ్బుల భారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. సమాధానం గుర్తించి ప్రజలంతా ప్లాస్టిక్ వినియోగం తగ్గించి అమ్మలాంటి పర్యావరణాన్ని పరిరక్షించాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయనిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## పోలీసుస్టేషన్ ఆవరణలో స్వర్ణఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర




**హనుమంతునిపాడు, జులై 19, ప్రభాతవార్త**

ప్రతి నెల మూడో శనివారం పర్యావరణ పరిరక్షణ కోసం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు హనుమంతునిపాడు పోలీసు స్టేషన్ ఆవరణలో ఎస్సై కే.మాధవరావు తమ సిబ్బందితో కలిసి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఆవరణలో ఉన్న చెత్తా చెదారం పిచ్చి మొక్కలు తొలగించారు. చెత్తను తొలగించిన అనంతరం చీపుర్లతో శుభ్రం చేసి చెట్లకు పాదులు తీసి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మనం పని చేసే ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచితే ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి, ఇలా చేయడం ద్వారా మనం ఇతరులకు ఆదర్శంగా నిలవవచ్చు అని తెలియజేశారు.

# పరిశుభ్రతకు ప్రాధాన్యత అభివృద్ధికి బాట

## - పెద్దదోర్నాల స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ర్యాలీలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు




**పెద్దదోర్నాల, జులై 19, ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరూ సామాజిక చైతన్యం కలిగి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి మన సమాజాన్ని అభివృద్ధి బాటలో నడిపించుకుందామని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన పెద్దదోర్నాలలో నాయకులు అధికారులు ప్రజలతో కలిసి యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు ప్లాస్టిక్ వాడకం వద్దని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్లకార్డులు పట్టుకొని అటవీ శాఖ కార్యాలయం వద్ద నుండి పోలీసు స్టేషన్ మీదుగా నటరాజ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాల వరకు సమగ్ర పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటూ ప్రజల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అంకితభావంతో నిర్వహిస్తుందని గూడూరి ఎరిక్షన్‌బాబు వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం శానిటేషన్ సదుపాయాలు విస్తరించడం వంటివి చేసి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రగా మార్చుకుందాం అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, పెద్ద దోర్నాల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిత్తూరి హారిక, గ్రామ పంచాయతీ కార్యదర్శి నలగాటి శివ కోటేశ్వరరావు, టీడీపీ, కూటమి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# నేడు ఉచిత గుండె చికిత్స వైద్య శిబిరం

**మార్టూరు, జులై 19, ప్రభాతవార్త**

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో హెల్ప్ హాస్పిటల్స్(మల్టీ సూపర్ స్పెషాలిటీ కేర్) విజయవాడ వారి సౌజన్యంతో ఈనెల 20న ఉచిత గుండె చికిత్స వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని కుర్రా వెంకటరామయ్య తెలిపారు.ఈ శిబిరం మార్టూరులోని సాయినగర్ ఎన్టీఆర్ స్ట్రీట్‌లో గల సాయి రెసిడెన్సీ అపార్టుమెంట్‌లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందన్నారు.వైద్యులు కార్తీక్‌నాయుడు, నాగకిరణ్‌లు పాల్గొని పరీక్షలు చేయడం జరుగుతుందని, ఈ శిబిరంలో గుండె పరీక్ష, ఈసీజీ, ఎకో(గుండె స్కానింగ్) పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా రూ.12,500ల విలువ గల యాంజియోగ్రామ్ టెస్ట్ అవసరమన వారికి ఉచితంగా హెల్ప్ హాస్పిటల్ నందు చేయబడునని అన్నారు. 20వ తేదీ ఉదయం 8.35 గంటలకు వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. మార్టూరు, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

## నాల్గవరోజు కొనసాగిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె



**గిద్దలూరు, జూలై 19,ప్రభాతవార్త**

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా నాల్గవరోజు స్థానిక మున్సిపల్ కార్మిక సిబ్బంది తమ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని నంద్యాల - ఒంగోలు రహదారిపైగల అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్ళపై కూర్చొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నగర పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

## సుపరిపాలన తొలి అడుగు ప్రజల అవసరాలను తీర్చే ముందడుగు

**- యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు**



**పెద్దదోర్నాల, జూలై 19, ప్రభాతవార్త**
సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ప్రజల అవసరాలను తీర్చే ముందడుగని యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండల కేంద్రమైన పెద్దదోర్నాల పాత పోస్టాఫీసు బజార్లో శనివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబుకు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా మహిళలు హారతులు పడుతూ గూడూరి ఎరిక్షన్‌బాబుకు పూలజల్లులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గూడూరి ఎరిక్షన్‌బాబు ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అంత మాత్రమేకాక మహిళలను యువతను ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ముందడుగు అని, ఇది నిజమైన ప్రజాపాలనకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. టీడీపీ ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రభుత్వం అందించిన పథకాలు ప్రజలకు అందాయా లేదా అని ఇంటింటికి వచ్చి అడగడం ప్రజలకు తెలుగుదేశం ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చే భరోసా అని అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణ ప్రభుత్వమే మన దగ్గరకే వచ్చిందన్న(ఫీల్ గుడ్) మంచి భావన ప్రజల్లో ఉందని, ఈ కార్యక్రమానికి గ్రామాలలో మంచి స్పందన ఉందని గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఇళ్ల వద్ద ప్రజలు మహిళలు తమ సమస్యలు గూడూరు ఎరిక్షన్‌బాబుకు విన్నవించగా సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఏరువా మల్లిఖార్జునరెడ్డి, టీఎన్‌టీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దోర్నాల సొసైటీ బ్యాంకు అధ్యక్షుడు బట్టు సుధాకర్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు షేక్ మాబు, తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ న్యాయవాది, వల్లభనేని కాశయ్య, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడి లక్ష్మయ్య, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డ శేషాద్రి, ఎస్సీ సెల్ నాయకుడు చంటి, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, ఈదర మల్లయ్య, బోళ్ల బాలకృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు జంగిలి పిచ్చయ్య, దేసు నాగేంద్రబాబు, షేక్ మౌలాలి, షేక్ రఫీ, పఠాన్ ల్యాబ్ ఖాన్, సింగ పోల్ రాజు, ఎలకపాటి మరియబాబు, ఎలకపాటి చెంచయ్య, నాయకులు పాల్గొన్నారు.

### స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలి



**వెలిగండ్ల, జూలై 19, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలలో మూడవ శనివారం చేపట్టే స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని వెలిగండ్ల మండలం పరిధిలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని మరపగుంట్ల పంచాయతీ బస్టాండ్ సెంటర్ ఆవరణలో శనివారం కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా, డిప్యూటీ ఎంపీడీఓ ఒంగోలు అన్నమ్మ, కనిగిరి నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై ప్రజల చేత ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి షాపు యజమాని ప్లాస్టిక్ అమ్మకాలను పూర్తిగా నిర్మించాలన్నారు. ప్లాస్టిక్ వలన ప్రాణాంతకమైన క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తాయని దశల వారీగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలన్నారు. అనంతరం పారిశుధ్యం కార్మికులని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా, డిప్యూటీ ఎంపీడీఓ ఒంగోలు అన్నమ్మ, కనిగిరి నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బిసి బాలికలకు హాస్టల్ వసతి కల్పించాలి

**- బిజేపి ఇన్చార్జి కృష్ణారావు**



**మార్కాపురం రూరల్, జూలై 19, ప్రభాతవార్త**
పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయ స్వామికి భారతీయ జనతాపార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పివి కృష్ణారావు బిసి బాలికలకు హాస్టల్ వసతి లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దయచేసి బాలికలకు హాస్టల్ వసతి ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సతీష్, రమేష్, మునెయ్య, రాజు తదితరులు ఉన్నారు.

### ప్లాస్టిక్ రహిత గ్రామంగా కొమ్మునూరును తీర్చిదిద్దుదాం

**- సర్పంచ్ రామసుబ్బారెడ్డి**




**గిద్దలూరు, జూలై 19, ప్రభాతవార్త**
ప్లాస్టిక్ రహిత గ్రామంగా కొమ్మునూరును తీర్చిదిద్దుదామని పంచాయితీ కార్యదర్శి భూతేశ్వరరెడ్డి, సర్పంచ్ రామసుబ్బారెడ్డిలు అన్నారు. కొమ్మునూరులో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ర్యాలీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగించడం వలనే కాలుష్యం పెరుగుతుందని అనారోగ్యసమస్యలు, అనర్థాలు తలెత్తుతున్నాయని ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని విజ్ఞప్తి చేశారు.

## గిరిజన పిల్లలకు పరీక్ష అట్టల పంపిణీ



**మార్కాపురం రూరల్, జూలై 19, ప్రభాతవార్త**
మార్కాపురం మండలంలో ఉన్న గిరిజన కాలనీ పేద గిరిజన పిల్లలకు మదర్ లవ్ ఫౌండేషన్ వారి ద్వారా పరీక్ష అట్టలు మరియు గిఫ్ట్ ప్యాక్స్‌లను శనివారం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ కెకె రజిని మాట్లాడుతూ చదువు మాత్రమే నిరుపేద కుటుంబాలు అభివృద్ధి చెందటానికి దోహద పడుతుందని అందరూ చదువుకోవాలని తెలిపారు. ఇంకా ఇలాంటి వారికి మేము చేయూతగా ఉంటామని తెలిపారు.

## ఎంపిడిఓ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర

**- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం**

**- ప్లాస్టిక్ నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం**





**త్రిపురాంతకం, జూలై 19 ,ప్రభాతవార్త**
మండలంలోని త్రిపురాంతకం గ్రామ పంచాయితీ నందు ఎంపిడిఓ మరియు తహశీల్దార్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ రాజ్ కుమార్ సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం గురించి ప్రజలకు, దుకాణాల యజమానులకు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి రామిరెడ్డి, డిప్యూటీ ఎంపిడిఓ మురళి, మేజర్ పంచాయతీ సెక్రటరీ రామ సుబ్బయ్య, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత ప్రపంచం అనే కార్యక్రమంపై

### పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన





**సంతనూతలపాడు, జూలై 20, ప్రభాతవార్త**
ప్లాస్టిక్ నిర్మూలన, ప్లాస్టిక్ రహిత సమాజం పట్ల శనివారం నాడు సంతనూతలపాడులో ఒంగోలురూరల్‌సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికిసంతనూతలపాడుసబ్ ఇన్‌స్పెక్టర్ వేజెండ్లఅజయ్‌బాబు అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలని సీఐ శ్రీకాంత్‌బాబు తన ప్రసంగంలో కోరారు. రహదారులపై ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగించరాదని ఈ సందర్భంగా ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్ బాబు ఆధ్వర్యంలో ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు రూరల్ సర్కిల్ కార్యాలయం, సంతనూతలపాడు పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మెప్మా సిబ్బందికి ట్యాబులు పంపిణీ

**- ప్రజల అభివృద్ధి కోసం ముందడుగు**

**- శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి**





**గిద్దలూరు, జూలై 19 ప్రభాతవార్త**
గిద్దలూరు పట్టణంలో మున్సిపల్ పరిపాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చే దిశగా మున్సిపల్ పరిపాలన మరియు పట్టణ పేదల అభివృద్ధి సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ట్యాబుల పంపిణీ కార్యక్రమంను స్థానిక నగర పంచాయితీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికిగిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ ప్రమేయాలలో భాగంగా మున్సిపల్ పరిపాలనలో పారదర్శకత, వేగం, సమర్థత పెంపొందించడానికి మెప్మా ఉద్యోగులకు ట్యాబులు పంపిణీ చేయడం ఎంతో హర్షణీయమైన విషయం అని అన్నారు. ఈ ట్యాబుల ద్వారా పేదప్రజలకు అందించాల్సిన సేవలు మరింత సమర్థవంతంగా,వేగంగా అందించబడతాయని అన్నారు. ఫీల్డ్ లెవెల్ మిషన్ ఫంక్షనరీస్ ద్వారా లైవ్ డేటా ఎంట్రీ, సేవల పరిపాలన, హక్కుల సదుపాయాలపై పర్యవేక్షణ మరింత మెరుగుపడుతుందని అన్నారు. పిడి మెప్మా మాట్లాడుతూ ఈ ట్యాబుల వినియోగం ద్వారా మెప్మా కార్యకలాపాల్లో వేగం పెరిగి డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం సులభతరమవుతుందన్నారు. మహిళల సంఘాల మద్దతుతో పట్టణ పేదల బలోపేతానికి ఈ పథకం కీలకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఫీల్డ్ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### జమ్ములపాలెం ఆదర్శ పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ బహుకరణ



**టంగుటూరు టౌన్, జూలై 19, ప్రభాతవార్త**
దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతంఅవుతాయని మండల విద్యా శాఖాధికారి-2 తన్నీరు బాలాజీ అన్నారు. జమ్ములపాలెం ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మక్కెన వెంకటరావు పాఠశాలకు రూ.35వేలు రూపాయలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్ బహుకరించారు.ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వ పాటవాలలో గుణాత్మక విద్యానందించి దాతల సహకారంతో పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ బహుకరించిన మక్కెన వెంకటరావుని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు కొమ్మినేని శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి, జ్యోతి, రమాదేవి, ఎస్ఎంసీ చైర్మన్ యమున పాల్గొన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ యమున, రామారావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

### వెంకటరావు మృతికి నివాళులర్పించిన ఆదిమూలపు, మాదాసి



**టంగుటూరు టౌన్, జూలై 19, ప్రభాతవార్త**
టంగుటూరు మండలం అనంతవరం గ్రామ పంచాయతీ పరిధిలోని తాళ్లపాలెం గ్రామం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నా వెంకటరావు మృతిచెందారు.మరణ వార్త తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి, రాష్ట్ర పీఏసీ సభ్యులు కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ డాక్టర్ ఆదిమూలపు సురేష్, జిల్లా పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్యలు పాల్గొని వెంకటరావు మృతికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డిప్యూటీ ఎంపీడీఓ



**టంగుటూరు టౌన్, జూలై 19, ప్రభాతవార్త**
డిప్యూటీ ఎంపీడీఓ కేవీ రామ సుబ్బారావు టంగుటూరు పంచాయతీ కార్యాలయంను శనివారం పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. పంచాయతీకి సంబంధించిన పంచాయతీకి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### రంగారావు పెద్దకర్మలో పాల్గొన్న ఎమ్మెల్యేలు బీఎన్, దామచర్ల



**నాగులుప్పలపాడు, జూలై 19, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామంలో కొండ్రగుంట రంగారావు పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్న సంతనూతలపాడు నియోజకవర్గశాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జీ గుమ్మడి సాయిబాబా, గ్రామ పార్టీ అధ్యక్షులు కుర్ర వీరాంజనేయులు ఉన్నారు.

## ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సత్కరించిన

### గుమ్మళంపాడు సొసైటీ చైర్మన్ రంగనాయకులు, డైరక్టర్లు



**సంతనూతలపాడు, జూలై 19 ,ప్రభాతవార్త**
ఒంగోలులోని సంతనూతపలాడు శాసన సభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ కార్యాలయంలో శనివారం నాడు సంతనూతలపాడు మండలం గుమ్మలంపాడు సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్ బోయల్ల రంగనాయకులు, కమిటీ డైరక్టర్లు టి.నరసింహారావు, బొడ్డపాటి వెంకట రమణారావు, తదితరులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నువ్వుల మీరయ్య, బొడ్డపాటి చంద్రశేఖర్, నలుమోతు శ్రీనివాసరావు, మారెళ్ళ రామారావు, మద్దినేని శ్రీనివాసరావు, మొలకలపల్లి శ్రీనివాసరావు, మొలకలపల్లి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

### కటికె యోగానంద్ మాతృమూర్తిని పరామర్శించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

**గిద్దలూరు, జూలై 19, ప్రభాతవార్త**
రాచర్ల మండల టిడిపి అధ్యక్షులు కటికె యోగానంద్ మాతృమూర్తి అనారోగ్యంతో బాధపడుతూ గిద్దలూరు పట్టణంలోని డిజిఆర్ వైద్యశాలలో చికిత్సలు పొందుతుండగా విషయం తెలుసుకున్న గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి వైద్యశాలకు వెళ్ళి ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా యోగానంద్ మాతృమూర్తి యొక్క ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

## చంద్రబాబు ఏడాది పాలనంతా మోసాల పుట్ట

**- క్యూఆర్ కోడ్ ప్రతి ఇంటివద్దకు వెళ్లి వివరించాలి**

**- వైఎస్ జగన్ అధికారంలో ఉంటే అన్ని సంక్షేమ పథకాలు**

**- మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు**







**యర్రగొండపాలెం,జులై19,ప్రభాతవార్త**
రాష్ట్రంలోచంద్రబాబు ఏడాది పాలనంతా మోసపూరితమేనని, అన్ని వర్గాలను నయవంచన చేశాడని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. సూపర్‌సిక్స్ పేరుతో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామిలను అమలు చేయకుండా ఎలా మోసం చేసాడో ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరిద్దామని అయన పేర్కొన్నారు.యర్రగొండపాలెం నియోజక వర్గ కేంద్రంలో శనివారం బాబుష్యూరిటీ-మోసం గ్యారంటి కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు.యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా హజరైన కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడతూ ఎన్నికలకు ముందు ప్రతి కుటుంబానికి అమలు చేసే పథకాలను తెలియజేస్తు బాండ్లు ఇచ్చారని,కానీ వాటిలో ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు.దీంతో ప్రజలు మళ్లీ వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని గుర్తు చేసుకుంటున్నారన్నారు.వైఎస్ జగన్ అధికారంలో ఉంటే అన్ని సంక్షేమ పథకాలు అందేవని ప్రజలు అంటున్నారన్నారు. ఏడాదిలో ఇంత వ్యతిరేకత వచ్చిన ప్రభుత్వాన్ని ఇప్పటి వరకూ చూడలేదన్నారు. మోసపూరిత హామిలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం మోసాలను వైఎస్సార్ సీపీ కార్యాకర్తలు ప్రతి గడపకు వివరించాలని అన్నారు.బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు ఎప్పుడు ఎన్నికలు వచ్చిన వైఎస్సార్ సీపీ గెలుపునకు సిద్దంగా ఉండాలన్నారు.చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వపాలనలో చోటుచేసుకుంటున్న అవినీతి,ప్రజావ్యతిరేక విధానాలను స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా తీసుకున్నారన్నారు.అనంతరం పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ,ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల,నాగార్జునయాదవ్,వైసిపి ఎంపిపిలు,జడ్పీటిసీలు,సర్పంచ్‌లు,మండల కన్వీనర్లు, వైఎస్ఆర్ కార్యకర్తలు అభిమానునలు తదితరులు పాల్గొన్నారు.

## 21న గిద్దలూరులో వైసిపి విస్తృత స్థాయి సమావేశం



**గిద్దలూరు, జూలై 19, ప్రభాతవార్త**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గిద్దలూరు పట్టణంలోని స్థానిక విట్టా సుబ్బరత్నం కళ్యాణమండపంలో ఈ నెల 21వ తేదీ సోమవారం ఉదయం 10గంటలకు నియోజకవర్గ స్థాయివిస్తృత సమావేశం నిర్వహించడం జరుగుతుందని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెపి నాగార్జున రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. కావునా నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమావేశానికి తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.

## పీర్లమాన్యం సుపరిపాలనలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు

### జేసీబీ ద్వారా గజమాలతో ఘన సత్కారం



**సంతనూతలపాడు, జులై 19, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యం 39వ డివిజన్ నందు శనివారం సాయంత్రం జరిగిన సుపరిపాలన తొలి అడుగు ఇంటింటా టీడీపీ కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిధిగా విచ్చేసిన సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ వజియ్‌కుమార్‌కు స్థానిక టీడీపీ నేతలు జేసీబీ ద్వారా గజమాలతో ఘనస్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలనలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతున్నట్లు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ముందంజలో ఉన్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఎన్నికల ముందు ప్రకటించిన హామీల్లో భాగంగా 4వేలు ఎన్టీఆర్ భరోసా పెన్షన్, అమ్మకు వందనం, గ్యాస్ రాయితీ, ఐదు రూపాయలకి అన్న క్యాంటీన్ ద్వారా భోజనం తదితర ఎన్నోపథకాలు కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి సంక్షేమానికి సంబంధించి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, రాష్ట్ర టీడీపీ మహిళా నాయకులు ఆరికట్ల సుమతి,సంతనూతలపాడు మండల టీడీపీఅధ్యక్షులు మద్దినేని హరిబాబు, పీర్లమాన్యం టీడీపీనాయకులు కొల్లా మహేష్, అమానుల్లా, మాజీ వైస్ ఎంపీపీ వాసేపల్లి వెంకటేష్‌రెడ్డి, కార్పొరేటర్లు తేళ్ళ చంద్రశేఖర్, నూకతోటి మస్తానమ్మ, ఈశ్వరరావు, మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మద్దిపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు చిన్నారావు, పత్తిపాటివెంకటేశ్వరరావు,ఎం.వెంకటరావు,బొడ్డపాటి చంద్రశేఖర్, పి.మోహన్, సందీప్, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర మహిళా నాయకురాలు ఆరికట్ల సుమతి, టీడీపీ నాయకులు కొల్లి మహేష్ తదితరులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు ఘనస్వాగతం పలికారు.

## కులనిర్మూలన పోరాటసమితి

## రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్‌ను విడుదల చేయాలి

**- జస్టిస్ బి.చంద్రకుమార్ రిటైర్ట్ హైకోర్టు న్యాయమూర్తి**




**ఒంగోలు - ప్రభాతవార్త**
భారతదేశంలో పీడితకులాల ప్రజల కోసం గొంతు విప్పుతున్న ఉద్యమకారులను ,ప్రజాస్వామికవాదులను అక్రమంగా అరెస్టలు చేయటం రాజ్యాంగం ప్రసాదించిన హక్కలను భంగం కలిగించడమేనని జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. కెఎన్‌పిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకర్‌ను విడుదల చేయాలని ఒంగోలు అంబేద్కర్ భవన్‌లో రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంత ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రశ్నించే హక్కు,మాట్లాడే హక్కు ,జీవించే హక్కు రాజ్యాంగం పొందుపరిస్తే వాటిని కాలరాసే హక్కు ఎవరికీ లేదన్నారు. ప్రభుత్వాల మీద తమ అసంతృప్తిని వ్యక్తపరిచే హక్కు ప్రజలకుందని అన్నారు. ప్రజల ఆకాంక్షల కోసం పనిచేసే నాయకులు ,కార్యకర్తలను అరెస్ట్ చేయడం రాజ్యాంగ వ్యతిరేక చర్య అన్నారు. ఉమ్మడి హైకోర్టు మాజీ అడిషినల్ అడ్వకేట్ భరత్ ఎ.సత్యప్రసాద్ మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో ఉన్న నల్ల చట్టాలను ఈ దేశంలో ఉన్న పౌరులపై ప్రజాస్వామిక వాదులపై ప్రయోగించడం దుర్మార్గమన్నారు. వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ దేశంలో ఉన్న సహజ వనరులను ,సంపదను కార్పోరేట్‌లకు అప్పజెప్పడానికి ఛత్తీస్‌ఘడ్‌లో ఉన్న ఆదీవాసీలపై అత్యాచార హత్యలు చేసి అడవి నుండి ఖాళీ చేయించి అడవిని కార్పోరేట్‌లకు అప్పజెప్పే కుట్రలో భాగంగానే ఆపరేషన్ పేరుతో హింసను మొదలుపెట్టి ఈ దేశంలో ఉన్న పౌరులపై యుద్ధం చేస్తున్నారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామక్రిష్ణ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత వివిధ ప్రతిపక్ష పార్టీలకు అర్బన్ నక్సలైట్స్‌గా వ్యాఖ్యానిస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకట్రావు,రాష్ట్ర ఉపాధ్యక్షుఉల క్రిష్ణయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో విరసం రాష్ట్ర నాయకులు జి.కళ్యాణరావు,నాయకులు,చిట్టిపాటి వెంకటేశ్వర్లు ,చేనేత కార్మిక సమాఖ్య రాష్ట్రనాయకులు మోహన్‌రావు,ప్రజాకళామండలి రాష్ట్ర కార్యదర్శి వై.కోటి పాల్గొన్నారు.

8_8.qxd 7/20/2025 12:56 AM Page 1



## శ్రీరంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**రాచర్ల, జూలై 19 (ప్రభాతవార్త)**
మండలంలోని జేపీచెరువు అటవీ ప్రాంతంలో వెలసియున్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించేందుకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎం నాగయ్య ప్రత్యేక ఏర్పాటు చేశారు. శనివారం ప్రత్యేక పూజలు సందర్భంగా దేవస్థానంలోని పలు అన్నదాన సత్రాలలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## పాఠశాల అభివృద్ధికి గ్రామస్తుల సహకారం అభినందనీయం



**సింగరాయకొండ, జూలై 20, ప్రభాతవార్త**
గ్రామీణ ప్రాంతాల్లో విద్యా అభివృద్ధికి గ్రామస్తుల సహకారం అత్యంత కీలకమని, పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్లిబోయిన రాంబాబు పేర్కొన్నారు. శనివారం గవదగట్ల వారి పాలెం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు గ్రామస్తులు చొరవ చూపాలి. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో పాటు స్థానికుల భాగస్వామ్యం వలన పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన మరింత వేగవంతం అవుతుంది," అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధి నవిదిబోయిన మురళి, ప్రధానోపాధ్యాయుడు పిలుపు మేరకు స్వచ్ఛందంగా రంగంలోకి దిగి, పాఠశాల ఆటస్థలాన్ని శుభ్రపరిచినట్లు తెలిపారు. ఇది విద్యార్థుల శారీరక మరియు మానసిక అభివృద్ధికి తోడ్పడే చర్యగా అభివర్ణించారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి పిలుపుతో ప్రేరణ పొందిన మురళి, స్థానిక అంగన్వాడీ కేంద్రానికి మౌలిక వసతుల కల్పనకు కూడా చర్యలు ప్రారంభించారు. దామచర్ల సత్య నేతృత్వంలో గ్రామంలో విద్యాభివృద్ధికి పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా మంచినీటి సౌకర్యం, శౌచాలయాల మరమ్మత్తులు, మొక్కల పెంపకం వంటి అంశాలపై దృష్టి పెట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఆజయ్ చౌదరి, అంగన్వాడీ కార్యకర్త రజిని, యువ నాయకులు పిగిలి శివ, భాస్కర్, రాజు, రామారావు, దాసరి వేణు, చిమటా సాయి, గవదగట్ల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలి

### - స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ, ర్యాలీ




**సింగరాయకొండ, జూలై 20, ప్రభాతవార్త**
గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు ఎంపీడీవో డి. జయమణి. శనివారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు, అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, ఈనెల మూడవ శనివారాన్ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు థీమ్‌గా చేపట్టినట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలని, గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఉప ఎంపీడీవో ఆర్. రమేష్‌బాబు మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త వేరు వేరు చేసి ప్లాస్టిక్ పదార్థాలను రీసైక్లింగ్‌కు పంపేలా ప్రజలు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏ.ఈ. పి. రమేష్‌బాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ భూమిలో కలిసిపోకపోవడంతో పర్యావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోందన్నారు. ప్రజలంతా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ చిమట సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో మొక్కలు పంపిణీ



**ముండ్లమూరు, జూలై 19, ప్రభాతవార్త**
ఔషధ మొక్కలతో ఆరోగ్య భద్రత- ఐతతఆర్డీ ఆధ్వర్యంలో 2025-26 మొక్కల పంపిణీ కార్యక్రమం ప్రారంభం కేజీబీవీ జూనియర్ కాలేజీ ముండ్లమూరు, ఐతతఆర్డీ స్వచ్ఛంద సేవా సంస్థ నేషనల్ మెడిసినల్ ప్లాంట్ బోర్డ్ వారి సహకారంతో 2025-26 సంవత్సరానికి గాను ఔషధ మొక్కల పంపిణీ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ ఏ.సునిత, లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన పూర్వీకులు ఆరోగ్యాన్ని భద్రంగా ఉంచేందుకు ప్రకృతి సిద్ధమైన ఔషధ మొక్కలను నిత్య జీవితంలో భాగంగా చేసుకున్నారు. ఈ రోజు మనం నాటుతున్న మొక్కలు రేపటి తరానికి ఆయురారోగ్యాన్ని అందించనున్నాయి. విద్యార్థుల్లో పర్యావరణం పట్ల ప్రేమను పెంపొందించడమే కాదు, ఆయుర్వేదంపై ఆసక్తి కలిగించేలా ఇది మార్గదర్శకంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో 70 వేర్వేరు రకాల ఔషధ మొక్కలు నాటారు. ఇందులో తులసి, అశ్వగంధ, బ్రాహ్మి, అలోవెరా, శతావరి, కాలమేఘ, మందార, ఎర్రచందనం, శ్రీగంధం, విటమిన్స్ వామ్మకు, అల్లం, తిప్పతీగ, పిప్పలి రకాలు మొదలైన మొక్కలను నాటారు. ఈ జాబితాలో ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే మొక్కలు ఉన్నాయి. ప్రతి మొక్క ప్రయోజనాన్ని విద్యార్థులకు వివరించడంతో పాటు, వాటి సంరక్షణ కోసం ప్రత్యేక బాధ్యతలు కేటాయించారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక ప్రజల్లో విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, ఆయుర్వేద ఔషధాలపై అవగాహన పెంచే లక్ష్యంతో ఐతతఆర్డీ చేస్తున్న సేవను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఏ.సునిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఐతతఆర్డీ సంస్థ అధ్యక్షులు బత్తులశిరిణ్ చంద్ పాల్గొన్నారు.

## ఖరీఫ్ పంటల సాగులో సాంకేతిక పద్ధతులు పాటించాలి

### - వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి




**దర్శి, జులై 19, ప్రభాతవార్త**
ప్రస్తుతం ఖరీఫ్ కాలానికి రైతులు సన్నద్ధవుతున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో రైతులు సాగు చేస్తున్న పంటల్లో సరైన సాంకేతిక పద్ధతులు పాటించినట్లయితే నాణ్యమైన దిగుబడిని సాధించవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ సంధ్యారాణి అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ, సందర్శన కార్యక్రమానికి శ్రీనివాసరావు విచ్చేసి రైతులు శాస్త్ర సాంకేతిక పద్ధతులు పాటించినట్లయితే ఖరీఫ్ కాలంలో మంచి దిగుబడులు సాధించవచ్చు అని సూచించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ పి.సంధ్యారాణి మాట్లాడుతూ రైతులందరూ ప్రస్తుతం ఖరీఫ్ కాలంలో పంటల రకాలు వాటి లక్షణాలు తెలుసుకొని వారి పొలాల్లో సాగు చేసుకోవాలని సూచించారు. కంది, వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ, మిరప పంటల గురించి రకాలు, సాగు పద్ధతులు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శాస్త్రవేత్తల సలహాలు మేరకు యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే నాణ్యమైన ఉత్పత్తులను తీసుకోవచ్చని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం ఫోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ రకాల ఎంపికతో పాటు ఎరువులు, కలుపు నివారణ వంటి పద్ధతులు కూడా ఖరీఫ్ లో సాగు చేసే పంటలలో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరక్టర్ విజయ నిర్మల మాట్లాడుతూ వ్యవసాయశాఖ, ఆత్మ, రైతులకు అవసరమైన ప్రదర్శన పద్ధతులు శిక్షణ కార్యక్రమాలు అందజేస్తున్నామని తెలిపారు. వ్యవసాయపరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాద్ మాట్లాడుతూ ఖరీఫ్ పంటలను సాగు చేసే రైతులు ప్రతి ఒక్కరూ పురుగు మందు, జీవన యంత్రణ పదార్థాల తోటి విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. ఉద్యాన పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డాక్టర్ రవీంద్రబాబు ఖరీఫ్‌లో వేసుకోదగ్గ ఉద్యాన పంటలైన మిరప, కూరగాయాల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. మిరప నారు మళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు చీడపీడల నివారణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం రీసెర్చ్ అసోసియేట్స్ డాక్టర్ సుమన్, హరిత కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులతో ముఖాముఖి




**దర్శి, జులై 19, ప్రభాతవార్త**
దర్శి మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో డివిజనల్ దవలప్‌మెంట్ అధికారి, డివిజన్ పంచాయతీ అధికారి శ్రీనివాసరెడ్డి పంచాయతీ కార్యదర్శులతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిరోజు డోర్ టు డోర్ గార్బేజ్‌కలెక్షన్,గవర్నమెంట్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఐవీఆర్ఎస్ కాల్స్ పైన, చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలపై పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ జరిపి వారికి తగు సూచనలు జారీ చేసి ఉన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి మండల డిప్యూటీ ఎంపీడీఓ ఆవుల సుధాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

### - గ్రామాల్లో ప్రతి ఎకరాకు ఈ క్రాప్ చేయాలి

### - జేడీఏ శ్రీనివాసరావు




**దర్శి, జులై 19, ప్రభాతవార్త**
ప్రకృతి వ్యవసాయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రోత్సహిస్తున్నారని ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు చేసే విధంగా ఆ శాఖ సిబ్బందికి సహకరించాలని, గ్రామాల్లోని ప్రతి ఎకరానికి ఈ క్రాప్ తప్పనిసరిగా చేయాలని వ్యవసాయశాఖ జేడీఏ ఎస్.శ్రీనివాసరావు వీఏఏలు, వీహెచ్ఏలకు సూచించారు. మండల కేంద్రమైన దర్శి ఎంపీడీఓ సమావేశం హాల్‌లో జరిగిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమానికి జేడీఏ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జేడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్ఎస్‌కేలలో ఎక్కువ మంది ఉద్యోగులకు తిగినంత పని చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కువ భూమి ఉంటే తక్కువ భూమికి ఈ క్రాప్ చేస్తున్నారని రోజులు మారాయని పాత పద్ధతి మానుకొని ప్రతి ఒక్కరూ ఉద్యోగం బాధ్యతలు నిర్వహించి గ్రామాల్లో మంచి పేరు తీసుకురావాలని, రైతులు పండించిన పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయాలని, ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జేడీఏ వీఏఏలను హెచ్చరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని, అదే విధంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో జరిగే పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో హాజరు కావాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజులలో జరిగిన కార్యక్రమాలలో ఏమి నేర్చుకున్నారు వీఏఏలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం సుభాషిణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం మనం వ్యవసాయంలో భాగమే ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయానికి సహకరించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేసే విధానం గురించి, ఘన, ద్రవ జీవామృతాలు, పీఎండీఎస్, కషాయాలు, రైతులు పండించిన ఉత్పత్తుల మార్కెటింగ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కే.బాలాజీ నాయక్, ఒంగోలు ఆత్మ ఏడీఏ విజయ కుమారి, ఏడీఏ నిర్మల, వ్యవసాయాధికారి కే.రాధ, మాస్టర్ ట్రైనర్లు వై.మేరిడేటి ల్లా, జే.ప్రభాకర్, వీఏఏలు, వీహెచ్ఏలు, ప్రకృతి వ్యవసాయశాఖ యూనిట్ ఇన్‌ఛార్జీలు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



**దర్శి, జులై 19, ప్రభాతవార్త**
జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దర్శి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ నందు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్టేషన్ రికార్డులను అన్ని శుభ్రంగా ఉంచుకోవడం జరిగింది. అదే విధంగా స్టేషన్ పరిసరాల్లో ఉన్న పనికిరాని ప్లాస్టిక్ వస్తువులను ఇతర పనికిరాని వస్తువులు అన్నింటిని ఒక చోట చేర్చి పూర్తిగా తగలబెట్టడం జరిగింది. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛందంగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. తదుపరి స్టేషన్ సిబ్బందితో స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలన పై, ప్రత్యామ్నాయాల వినియోగంపైన ప్లాస్టిక్ వ్యర్థాల వలన జరిగే అనర్థాలను గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దర్శి స్టేషన్ ఎక్సైజ్ ఎస్సై రఘు సత్యనారాయణ, స్టేషన్ సిబ్బంది ఎస్.శ్రీనివాసులు, ఎన్.శ్రీనివాసరావు, పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబుకి ఘన సన్మానం

**పామూరు, జులై 19, ప్రభాతవార్త**
పామూరు మండలం సింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబుకి కెనరా బ్యాంకు సిబ్బంది శాలువాతో పూలమాలతో ఘనంగా సన్మానించారు. కెనరా బ్యాంకు మేనేజర్ తిరుమల, గద్దె వేణుగోపాల్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్




**చీరాల, జులై 19, ప్రభాతవార్త**
ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా తోటవారిపాలెం గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదేశాలతో ఒకటి, రెండవ సచివాలయ కార్యదర్శుల తోటి ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామంలో పరిశుభ్రత గురించి తడి చెత్త, పొడి చెత్త విడివిడిగా వేయాలని, ఒక సారి వినియోగించే ప్లాస్టిక్‌ను ఉపయోగించరాదని, ప్లాస్టిక్ కవర్లు ప్లాస్టిక్ గ్లాసులు నిషేధించడంజ జరిగిందని గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఒకటి, రెండు సచివాలయ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు నాదెండ్ల కోటేశ్వరరావు, సలగల యోహోషువ, నాగరాజు, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి గూడూరు శివరాం ప్రసాద్, హనుమశెట్టి బ్రహ్మయ్య, రంగినేని అనిల్, తోట కోటేశ్వరి, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసాపురం గ్రామ పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు



**పామూరు, జులై 19, ప్రభాతవార్త**
మండలంలోని లక్ష్మీనరసాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 283 బూత్ పరిధిలో కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం టీడీపీ శ్రేణులు శనివారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, స్థాని ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహా చౌదరి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, జిల్లా టీడీపీ నాయకులు యారవ ప్రసాద్‌రెడ్డి, బూత్ కమిటీ ఇన్‌ఛార్జ్ ఇల్లూరి శ్రీనివాసులురెడ్డి, గవిరెడ్డి కొండారెడ్డి, ఏలికాపాటి యోసోబు, కేఎస్ఎస్ మెంబర్స్ వేల్పుల మురళి, ఎలికా పాటి నరేష్, స్థానిక టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కాలుష్యం నిర్మూలనకు ప్రజలు చైతన్యవంతులు కావాలి

### - తహశీల్దార్ ఆంజనేయరెడ్డి



**గిద్దలూరు, జూలై 19, ప్రభాతవార్త**
ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించేందుకు ప్రజలు చైతన్యవంతులు కావాలని గిద్దలూరు తహశిల్దార్ ఆంజనేయరెడ్డి అన్నారు. గిద్దలూరు నగర పంచాయితీ పరిధిలోలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నగర పంచాయితీ కార్యాలయం నుండి గాంధీబొమ్మ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశిల్దార్ ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతిఒక్కరు ప్లాస్టిక్ వాడడం వలన పర్యావరణానికి హాని కలుగుతుందని ప్రతిఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని అన్నారు. ప్లాస్టిక్ అనేది వేల సంవత్సరాలు భూమిలో కరిగి పోదు దీని వలన మానవులకు, మూగజీవాలకు కూడా హాని కలుగుతుందని, ప్లాస్టిక్ వాడడం వలన క్యాన్సర్ వంటి రోగాలకు కూడా దారి తీస్తుందని తెలిపారు. కావున ప్రతిఒక్కరు ప్లాస్టిక్ వినియోగించడం నిషేధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయితీ ఛైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, అసిస్టెంట్ ఇంజనీర్ ఫోర్షియా, వార్డు కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ట్రంక్‌రోడ్డు విస్తరిస్తే మేము రోడ్డునపడతాం..

### - 100 అడుగులు వద్దు..60 అడుగులు చాలు

### - ట్రంక్‌రోడ్ షాప్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



**ఒంగోలు, ప్రభాతవార్త**
ఒంగోలు నగరాన్ని అభివృద్ధి చేసే క్రమంలో భాగంగా నగరంలోని ప్రధాన రహదారిగా పేరొందిన ట్రంక్ రోడ్డును 100 అడుగుల రోడ్డుగా విస్తరించినందుకు నగరపాలక సంస్థ అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో ట్రంక్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలకు ఇప్పటికే మార్కింగ్ చేయగా తాజాగా యజమానులకు నోటీసులు అందించడంతో వస్త్ర వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రంక్‌రోడ్ దుకాణాల యజమానులు సమావేశం ఏర్పాటు చేసి ట్రంక్ రోడ్డును 100 అడుగులకు విస్తరించేందుకు తాము సిద్ధంగా లేమని నేడు జరిగిన విలేకరుల సమావేశంలో దుకాణాల యజమానులు తేల్చి చెప్పారు. గతంలో 2003లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏమి ఆశించకుండా ట్రంక్ రోడ్ విస్తరణకు తాము అంగీకరించామని ట్రంక్ రోడ్ షాప్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కూరపాటి సత్యనారాయణ అన్నారు. ఇప్పుడు 100 అడుగులు చేస్తామంటే తమ బ్రతుకులు రోడ్డున పడతాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 240 షాపులు ఉన్న ట్రంక్ రోడ్ నందు విస్తరణ పనులు జరిగితే 140 దుకాణాలు పూర్తిగా కనుమరుగవుతాయని వాటిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఆ కుటుంబాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే నగరానికి అనేక మాల్స్ రావడం పట్ల తమ వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయని పలు దుకాణాల యజమానులు ఆవేదన చెందారు. అధికారులు నష్ట పరిహారం కింద ఇస్తామని చెప్తున్న టిడిఆర్ బాండ్లు తమకు వద్దని వాటి వల్ల తనకు ప్రయోజనం ఉండదని వారు వాపోయారు. 100 అడుగులు కాకుండా 60 అడుగులకు తాము సుముఖంగా సమర్థిస్తామని సభ్యులు సముచిత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ దేవత వినోద్,వైస్ ప్రెసిడెంట్ చీమకుర్తి రఘురాం,ట్రెజరర్ శ్రీనవాస కుమార్‌తోపాటు పలు దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

## బాలుడి చదువుకు మండవ మురళి ఆర్థికసాయం



**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**
సంతనూతలపాడుకి చెందిన షేక్ అబ్దుల్ గఫూర్ అనే బాలుడికి కొన్ని సంవత్సరాల క్రితం నాన్న క్యాన్సర్‌తో చనిపోయాడు, అమ్మ కూడా ఈమధ్య అనారోగ్యంతో చనిపోయింది. ఈ బాబు కుటుంబ పోషణ భారం స్కూల్ ఫీజు వృద్ధురాలు అయినటువంటి షేక్ మహబూబ్‌కి కష్టంగా మారింది. వారి ఒక కష్టం తెలుసుకున్న సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ షహనాజ్ ప్రవాస భారతీయుడు రాజు గోపాల్ సహకారంతో ఆ విద్యార్థి ఫీజు 16,000 రూపాయలు నేరుగా స్కూల్‌కి వెళ్లి మండవ మురళి కృష్ణ చెల్లించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ ఎస్కే సర్దార్ పాషా తదితరులు పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరు పరిశుభ్రతను పాటించాలి



**కొండపి, ప్రభాతవార్త**
గ్రామాలలో ప్రతి ఒక్కరు వారి ఇంటిలో, ఇంటి పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉందని యంపిడివో రామాంజనేయులు తెలిపారు. శనివారం నాడు మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామంలో స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛదివస్ కార్యక్రమం నిర్వహించారు. కె ఉప్పలపాడు హై స్కూల్ విద్యార్థులతో గ్రామంలో ర్యాలి నిర్వహించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ సంబంధించిన కరపత్రాను ఇంటింటికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, రాఘవశర్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్రకై ప్లాస్టిక్ నిర్మూలనకై ప్రతిజ్ఞ ర్యాలీ



**వేటపాలెం, జులై 19, ప్రభాతవార్త**
ప్రతి నెల మూడవ శనివారం పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా జులై మూడవ శనివారంను నో ప్లాస్టిక్ యూస్ డేగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో వేటపాలెం మండలం దేశాయిపేట గ్రామం ఆమోదగిరి పట్నం హైస్కూల్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెడబలిమి శేఖరరావు, బట్ట శివప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మొదటిగా విద్యార్థులచే స్వచ్ఛ ఆంధ్ర ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించి స్వచ్ఛ ఆంధ్రకు కృషి చేస్తామని, ప్లాస్టిక్‌ను నిర్మూలిస్తామని నినాదాలతో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం శేఖరరావు మాట్లాడుతూ విద్యార్థులందరూ తామే కాకుండా తమతోటి వారికి కూడా సింగిల్ ప్లాస్టిక్ యూజ్ విడనాడాలని, స్వచ్ఛ ఆంధ్రకై కృషి చేయాలని, పరిసరాలు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని నాలుగు సచివాలయాల సెక్రటరీలు, దేశాయిపేట పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు కే.సుధాకర్, వై.రత్నం, రాజ్యలక్ష్మి, పద్మావతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



**పామూరు, జులై 19, ప్రభాతవార్త**
సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల నిషేధించాలని దీనిపై పంచాయతీ కార్యదర్శి అరవిందరెడ్డి, స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సదర్భంగా సింగిల్‌విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, తహశీల్దార్ వాసుదేవరావు, ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, ఎంఈఓ కోటిరెడ్డిలు మాట్లాడుతూ రీ సైక్లింగ్ చేసే పద్ధతి లేకపోవడంతో 100 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులన్నింటిపైన కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ప్లాస్టిక్ స్టిక్స్ ఉన్న ఇయర్ బర్డ్స్, బెలూన్లు, ప్లాస్టిక్ జెండాలు, ప్లాస్టిక్ పుల్ల, కవర్లు తదితర 16 రకాల వివిధ వస్తువుల్ని నిబంధనలని ఉల్లంఘించి ఈ వస్తువులు ఎవరు తయారు చేసినా వినియోగించాన ఐదేళ్ల జైలు శిక్ష, ఒక లక్ష రూపాయలు జరిమాన విధించే అవకాశం ఉందని అన్నారు. స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ ప్రతి నిమిషానికి ఒక లారీ ప్లాస్టిక్‌తో నిండుతుంది కావున ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు పెరుగుతుందని రోజు రోజుకు కొండలా పెరిగిపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయని అన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించకపోతే ముందు తరాల వారికి ప్లాస్టిక్ వ్యర్థాల వల్లనే పెనుముప్పు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని క్యాన్సర్‌కు కారణం కేవలం ప్లాస్టిక్ మాత్రమేనని కొన్ని పరిశోధనల్లో తేలిందన్నారు. కావున ప్లాస్టిక్ పాలిథిన్ కవర్లను పూర్తి స్థాయిలో నిషేధిద్దామని అన్నారు. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు అవుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, ఏపీఎం విద్యా సాగర్, ఏఎస్సై జిలాని భాష, హౌసింగ్ ఏఈ రాజగోపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు కొండిశెట్టి వెంకట రమణయ్య, సింగిల్ విండో డైరెక్టర్ వై.రహిముల్లా, ప్రభుత్వ వైద్యశాల డైరక్టర్లు ఎన్.సాంబయ్య, మోబీన మౌలాలి, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ గుత్తి కొండలరావు, వార్డు సభ్యులు పిడుగు శ్రీనివాసులు, పాలపర్తి రమణయ్య, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి నొస్సం నాగేంద్ర చారి, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్యశాలలను తనిఖీ చేసిన జాయింట్ డైరెక్టర్ రవి





**రాచర్ల, జూలై 19, ప్రభాతవార్త**
మండలంలోని రాచర్ల, చోళ్ళవీడు, అనుములపల్లి పశువైద్యశాలలను పశు వైద్యశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ బి రవి శనివారం ఆకస్మికంగా తనికీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పశువైద్యశాలలోని సిబ్బంది వివరాల గురించి పశువైద్యాధికారి హరిబాబును అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ సరైన సేవలు అందిస్తున్నారా లేదా అని స్థానికుల నుండి ఆరాతీశారు. మండలానికి 600డోసులు మందులు మంజూరయ్యాయని వాటి గురించి రైతులకు అవగాహన కల్పించి అందజేయాలన్నారు. చోళ్ళవీడు, అనుములపల్లి కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బంది సుప్రియ, శివ బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆయన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని సిబ్బంది సమీప రైతులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

20-7Pg5.qxd:20-7Pg5.qxd 01/01/01 7:54 AM Page 1



# రష్యాపై ఇయు మరిన్ని ఆంక్షలు

## భారత్ చమురు కంపెనీలపై ప్రభావం



**న్యూఢిల్లీ,జూలై 19:** ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఉన్న రష్యా ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు యూరోపియన్ యూనియన్ (ఈయూ) సర్వశక్తులు ఒడ్డుతోంది. ఈక్రమంలోనే రష్యా చమురు ఎగుమతులపై తాజాగా మరిన్ని ఆంక్షలను ప్రకటించింది. వీటి ప్రభావం తొలిసారిగా భారత్‌పైనా పడింది. ఈయూ ఆంక్షలతో గుజరాత్‌లోని వాదినార్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న నయారా ఎనర్జీ కంపెనీ రిఫైనరీ (చమురు శుద్ధి కర్మాగారం) ప్రతికూలంగా ప్రభావితం కానుంది. రష్యాకు, నయారా ఎనర్జీకి సంబంధం ఏమిటంటే, ఈ రిఫైనరీలో రష్యా ప్రభుత్వానికి చెందిన రోస్‌నెఫ్ట్ కంపెనీకి 49.1 శాతం వాటా ఉంది. అందుకే నయారా ఎనర్జీపై ఆంక్షలను విధించామని ఈయూ విదేశాంగ విధానాల విభాగం అధిపతి కాజా కలస్ ఇటీవల వెల్లడించారు. దీనిపై భారత విదేశాంగ శాఖ ఘాటుగా స్పందించింది. యూరోపియన్ యూనియన్ ఏకపక్షంగా విధించిన ఆంక్షలను అంగీకరించేది లేదని తేల్చి చెప్పింది. చట్టపరమైన నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగానే విదేశాల నుంచి భారత్ బాధ్యతాయుతంగా చమురును దిగుమతి చేసుకుంటోందని స్పష్టం చేసింది. ఇంధన భద్రత విషయంలో ఈయూ దేశాల ద్వంద్వ ప్రమాణాలను భారత్ అంగీకరించదు. భారత ప్రజల కనీస అవసరాలను తీర్చేందుకు ఇంధన భద్రతకు భారత ప్రభుత్వం అత్యుత్తమ ప్రాధాన్యం ఇచ్చి తీరుతుంది. ఇంధన వాణిజ్యం విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు అస్సలు తావు ఉండకూడదని మేం పునరుద్ఘాటిస్తున్నామని పేర్కొంటూ భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. సంపన్న దేశాల కూటమి జీ7లో లేని దేశాలు రష్యా నుంచి దిగుమతి చేసుకునే ముడి చమురుకు చెల్లించాల్సిన రేటును యూరోపియన్ యూనియన్ (ఈయూ) మరింతగా తగ్గించింది. ఒక బ్యారెల్ రష్యన్ ముడి చమురుకు ప్రస్తుతం 60 డాలర్ల రేటు మాత్రమే ఉంది. దీని కంటే తక్కువ రేటును ఈయూ తాజా ఆంక్షల్లో భాగంగా నిర్దేశించింది. ప్రస్తుతం ఇతర దేశాలు ఒక బ్యారెల్ ముడి చమురును సగటున 69.35 డాలర్లకు విక్రయిస్తున్నాయి. చమురు ఎగుమతులతో రష్యాకు లభించే ఆదాయాన్ని వీలైనంత మేరకు తగ్గించేందుకు ఈవిధమైన ఆంక్షలను ఈయూ అమలు చేస్తోంది. తాము నిర్దేశించిన తక్కువ రేటుకు రష్యా నుంచి ముడి చమురును కొనే దేశాలకే ఐరోపా దేశాల చమురు రవాణా నౌకలు, బీమా సేవలను వినియోగించుకునే అవకాశం ఉంటుందని ఈయూ ఇటీవలే స్పష్టం చేసింది. రాడార్‌కు చిక్కకుండా రష్యా ముడి చమురును రవాణా చేస్తున్న మరో 105 ఆయిల్ ట్యాంకర్ నౌకలను తమ ఆంక్షల జాబితాలో చేర్చామని యూరోపియన్ యూనియన్ వెల్లడించింది. ఇప్పటివరకు ఈవిధమైన మొత్తం 223 రాడార్‌కు చిక్కని నౌకలపై ఆంక్షలను విధించామని తెలిపింది. దాదాపు 400కుపైగా ఆయిల్ ట్యాంకర్ నౌకలతో విదేశాలకు రష్యా క్రూడ్ ఆయిల్‌ను ఎగుమతి చేస్తుంటుంది. దాదాపు 223 నౌకలను ఆంక్షల పరిధిలోకి చేర్చడం ద్వారా రష్యా చమురు ఎగుమతులను అడ్డుకునేందుకు ఈయూ యత్నిస్తోంది.



# మాతో పెట్టుకుంటే కనుమరుగే..

## బ్రిక్స్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్, జూలై 19:** వాణిజ్య సుంకాల విషయంలో కఠిన వైఖరిని అవలంబిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బ్రిక్స్ కూటమిపై మరోసారి విరుచుకుపడ్డారు. అది 'చిన్న గ్రూప్' అంటూ విమర్శించిన ఆయన ఆ దేశాలు డాలర్ ఆధిపత్యాన్ని సవాల్ చేస్తే గనుక 10 శాతం అదనపు సుంకాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని పునరుద్ఘాటించారు. క్రిప్టో కరెన్సీ చట్టబద్ధతకు సంబంధించిన 'జీనియస్' బిల్లుపై సంతకం చేసిన ట్రంప్ తర్వాత వైట్‌హౌస్ వద్ద మీడియాతో మాట్లాడారు. 'బ్రిక్స్ అనే చిన్న గ్రూప్ ఉంది. అది చాలా వేగంగా తన ఉనికిని కోల్పోతోంది. వారిని మేం చాలా బలంగా కొట్టాం. డాలర్ ఆధిపత్యాన్ని నియంత్రించాలని వారు చూస్తున్నారు. మా కరెన్సీ ప్రమాణాన్ని అధిగమించాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే వారిపై టారిఫ్‌లు విధిస్తామని ప్రకటించాం' అని ట్రంప్ వెల్లడించారు. 'మాతో ఆటలు వద్దు. అమెరికా డాలర్‌కు గ్లోబల్ రిజర్వ్ హోదా ఉంది. దాన్ని ఎప్పటికీ కొనసాగించాల్సిన అవసరం ఉంది. డాలర్ విలువ తగ్గడాన్ని మేం ఎన్నటికీ అంగీకరించబోం. మా కరెన్సీ స్టేటస్ పడిపోతే దాన్ని మేం ఓటమిగానే భావిస్తాం' అని ట్రంప్ స్పష్టం చేశారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలతో కలిసి బ్రిక్స్ కూటమి ఏర్పడింది. ఆ తర్వాత అందులో ఇరాన్, ఇథియోపియా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండోనేసియా కూడా చేరాయి. ఈ పది దేశాలను కలిపి బ్రిక్స్ ప్లస్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవల బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ట్రంప్ ఏకపక్ష సుంకాల పెంపుపై ఈ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అమెరికా అధ్యక్షుడు బ్రిక్స్ అనుసరిస్తున్న అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతిచ్చే దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. బ్రిక్స్ దేశాల పైనా టారిఫ్‌లు ఉంటాయని ప్రకటించారు.

# నాలుగేళ్ల బాలికపై డిజిటల్ రేప్

**లక్నో,జూలై 19:** ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో నాలుగేళ్ల బాలికపై జరిగిన లైంగిక వేధింపు ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనను డిజిటల్ అత్యాచారంగా పరిగణిస్తున్నారు. జులై 14న జరిగిన ఈ దారుణ ఘటనలో స్కూల్ వ్యాన్ డ్రైవర్ మొహమ్మద్ ఆరిఫ్‌ను ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ ఘటన ఇందిరానగర్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఆరిఫ్‌పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), లైంగిక వేధింపుల నుంచి బాలల రక్షణ చట్టం (పోక్సో), మరియు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైంది. బాధిత బాలిక తల్లి తెలిపిన వివరాల ప్రకారం, బాలిక తన మర్మావయవాల వద్ద నొప్పి గురించి ఫిర్యాదు చేయడంతో తల్లి పరీక్షించగా, ఆ భాగంలో గాయాలు కనిపించాయి. ఈ ఘటన గురించి పోలీసులకు సమాచారం అందించినప్పుడు, నిందితుడు ఆరిఫ్ బాధిత కుటుంబాన్ని బెదిరించి, ఫిర్యాదు చేయవద్దని హెచ్చరించినట్లు ఆరోపణలు వచ్చాయి. స్కూల్ మేనేజర్ సందీప్ కుమార్‌ను కూడా సహనిందితుడిగా పేర్కొన్నారు. ఈ ఘటనపై లక్నో ఈస్ట్ డిసిపి శశాంక్ సింగ్ మాట్లాడుతూ, నిందితుడు మొహమ్మద్ ఆరిఫ్‌ను అరెస్ట్ చేసి, ఘటన జరిగిన వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బాధిత బాలిక వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించగా, మర్మావయవాల వద్ద గాయం ఉన్నట్టు నిర్ధారణ అయింది. ఈ ఘటన స్థానికంగా ఆగ్రహాన్ని రేకెత్తించింది, మరియు స్కూల్ యాజమాన్యం బాధ్యతారాహిత్యంపై ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. డిజిటల్ రేప్ అంటే ఒక వ్యక్తి యొక్క ప్రైవేట్ భాగాలలో బలవంతంగా, సమ్మతి లేకుండా చేతి వేళ్లు లేదా కాలి వేళ్లను చొప్పించడం. ఇక్కడ "డిజిటల్" అనే పదం (డిజిట్స్) చేతి లేదా కాలి వేళ్లను సూచిస్తుంది. ఈ చర్యను తీవ్రమైన లైంగిక వేధింపుగానే పరిగణిస్తారు. కేవలం బాహ్య సంపర్కంతో కూడిన వేధింపులకు భిన్నంగా, డిజిటల్ రేప్ అనేది సమ్మతి లేని లైంగిక చర్యగా భావిస్తారు. ప్రపంచవ్యాప్తంగా వైద్య నిపుణులు మరియు మానవ హక్కుల సంస్థలు డిజిటల్ రేప్‌ను శరీరస్వయం ప్రతిపత్తి మరియు మానవ గౌరవంపైతీవ్రమైన ఉల్లంఘనగా గుర్తిస్తున్నాయి.

# 42దేశాలు చుట్టివచ్చిన మోడీకి మణిపూర్ వెళ్లాలనిపించలేదా?

## మైసూరులో ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



**బెంగళూరు, జులై 19:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు గుప్పించారు. ఇప్పటి వరకు 42 దేశాల్లో ప్రధాని మోదీ పర్యటించారనీ, కానీ జాతుల మధ్య వైరంతో ఏడాదికిపైగా అల్లర్లతో అట్టుడుకుతున్న మణిపూర్ సందర్శనకు సమ యం లేదని చురకలు వేశారు. రాజ్యాంగాన్ని హత్య చేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చడానికి ఎంత యత్నించినా దేశ ప్రజలు అనుమతించరని చెప్పారు. రాజ్యాంగం వల్లే మోదీ ఒకప్పుడు ముఖ్యమంత్రి, ప్రస్తుతం ప్రధానమంత్రి అయ్యారని ఖర్గే గుర్తుచేశారు. కర్ణాటకలోని మైసూర్‌లో 2 వేల 500 కోట్లకుపైగా వ్యయం తో కూడిన అభివృద్ధి పనులకు ప్రారంభో త్సవాలు, శంకుస్థాపనలు చేసిన తర్వాత ఖర్గే మాట్లాడారు. మరోవైపు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రాపై ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంపైనా మల్లిఖార్జున ఖర్గే స్పందించారు. వాద్రాతో పాటు గాంధీ కు టుంబానికి అపఖ్యాతి తెచ్చేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కానీ వారు అనుకున్న పనులు జరగవని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగానే ఈడీ ఇలా వ్యవహరిస్తుందని విమర్శించారు. వాద్రాను వేధించడం సరైనది కాదని, ఆయన చేసిన మంచి పనులకు తమ మద్దతు ఉంటుందని ఖర్గే పేర్కొన్నారు. కాంగ్రెస్ ల్యాండ్ జిహాద్‌కు పాల్పడుతుందంటూ బిజెపి చేసిన ఆరోపణలపైన స్పందించిన ఖర్గే, అదేంటో తనకు తెలియదని చెప్పారు. ఒకవేళ తనకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలనుకుంటే స్వాగతిస్తానని తెలిపారు. వారు ఎప్పుడు చర్యలు తీసుకున్నా, తాను స్పందిస్తానని వివరించారు. అంతకుముందు తన బావ రాబర్ట్ వాద్రాను పదేళ్లుగా బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం వెంటాడుతూనే ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. రాజకీయ కక్ష, దురుద్దేశంతో పెట్టిన ఈ కేసును ఎదుర్కొనేందుకు రాబర్ట్, ప్రియాంకల కుటుంబానికి తాను అండగాఉంటానని హామీ ఇచ్చారు. వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాపై షికోపుర్ ల్యాండ్స్ వ్యవహారానికి సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసుకు సంబంధించి 2018 సెప్టెంబర్‌లో వాద్రా పేరు ఎఫ్ఐఆర్‌లో నమోదు కాగా, ఇప్పటికే ఆయన్ను పలుమార్లు దర్యాప్తు సంస్థ విచారణకు పిలిచి ప్రశ్నించింది. ఈడీ ప్రకారం వాద్రాకంపెనీ 2008 ఫిబ్రవరిలో గురుగ్రామ్‌లోని షికోపూర్‌లో 3.5ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి కొనుక్కుంది. అయితే, దీని విలువ రూ.7.5కోట్లు కాగా, ఆ తర్వాత వాద్రా కంపెనీ ఆభూమిని రియల్ ఎస్టేట్ కంపెనీ అయిన డీఎల్ఎఫ్‌కు రూ.58 కోట్లకు విక్రయించింది.

# ప్రధాని వచ్చేవారం యుకె, మాల్దీవుల్లో పర్యటన



**న్యూఢిల్లీ, జులై 19:** ప్రధాని నరేంద్రమోడీ వచ్చే వారంలో విదేశ పర్యటనకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. జులై 23 నుంచి 26 వరకు యుకె, మాల్దీవుల్లో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. గతేడాది మోడీపై, లక్షద్వీప్‌పై మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. విభేదాల అనంతరం ప్రధాని ఆ దేశానికి వెళ్లడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. మాల్దీవులతో బలమైన దౌత్య సంబంధాలు, పరస్పర ప్రయోజనాలు పునరుద్ధరించడానికి ఈ పర్యటన సహకరిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. జులై 23,24 తేదీలలో మొదట యుకెలో జరగనున్న భారత్, బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై జరిగే చర్చల్లో మోడీ పాల్గొని ఒప్పందంపై సంతకం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. యుకె ప్రభుత్వంతో దౌత్య, వాణిజ్య చర్చలు జరపనున్నారు. అనంతరం జులై 25,26 తేదీలలో ప్రధాని మాల్దీవులకు వెళ్లనున్నారు. మాల్దీవుల 60వ జాతీయ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరవుతారు.

## రాజస్థాన్‌లో భారీగా వరదలు: యాత్రికుడిని కాపాడిన స్థానికులు



**జైపూర్, జులై19:** రాజస్థాన్‌లోని అజ్మేర్‌ను భారీ వర్షాలు ముంచెత్తడంతో రోడ్లన్నీ నదులను తలపించాయి. ఖ్వాజా గరీబ్ నవాబ్ దర్గా ప్రాంతాన్ని వరద నీరు చుట్టుముట్టింది. ఇరుకు సందుల్లోకి ఆకస్మికంగా వరదనీరు రావడంతో ఓ వ్యక్తి కొట్టుకుపోతున్న దృశ్యాలు ప్రతిఒక్కరిని భయభ్రాంతులకు గురిచేశాయి. అది చూసిన వారంతా అతడికి సహాయం చేసేందుకు తమ వంతు ప్రయత్నాలు చేయడం మొదలెట్టారు. వెంటనే అక్కడ హోటల్‌లోని ఒక వ్యక్తి ధైర్యంగా ముందుకువచ్చాడు. చేయి అందిపుచ్చుకుని, ఇతరుల సహాయంతో పైకి లాగాడు. దాంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గత 24గంటలుగా రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. కోటాలోని సంగాడ్‌లో రికార్డుస్థాయిలో వర్షపాతంనమోదైంది.కాగా అల్పపీడన ప్రభావంతో రానున్న 24గంటల్లో వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం వెల్లడించింది.

# భారీ రుణాలిస్తానని ఫీజులురూపంలో రూ.32కోట్లు స్వాహా

## రహస్య గదిలో దాక్కున్న నిందితుడిని అరెస్టుచేసిన పోలీసులు

**బెంగళూరు,జూలై 19:** పెద్ద మొత్తంలో రుణాలు ఇస్తానని అనేక మంది వ్యాపారవేత్తలను కర్ణాటకలో ఒక వ్యక్తి రూ.32 కోట్లు మోసం చేశాడు. పోలీసులు కేసునమోదు చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా అతడిని తన విలాసవంతమైన ఇంటిలోని ఒకరహస్య బేస్‌మెంట్ గదిలో ఉన్నట్లు గుర్తించి వెంటనే అరెస్ట్ చేశారు. మంగళూరు జెప్పినమొగరు ప్రాంతంలోని బొల్లాగుడ్డకు చెందిన నిందితుడు రోషన్ సల్దాన్హాపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని వివిధ విభాగాల కింద కేసులు నమోదయ్యాయి. తన విలాసవంతమైన ఇంటిలోని ఒక రహస్య బేస్‌మెంట్ గదిలో రోషన్ సల్దాన్హా అనే నిందితుడు దాక్కున్నట్లు పోలీసులకు సమాచారమిచ్చారు. వార్డ్‌రోబ్ వెనుక ఉన్న రహస్య ద్వారాన్ని గుర్తించిన పోలీసులు భూగర్భ గదిలోకి వెళ్లారు. సల్దాన్హానుగుర్తించి అరెస్టు చేసిన తర్వాత మరొక రహస్య గదిని కూడా కనుగొన్నారు. ఆ తర్వాత సీక్రెట్ బేస్‌మెంట్‌లో సోదాలు చేపట్టారు. ఆ సమయంలో అనుమతి లేకుండా నిల్వ చేసిన విదేశీ, దేశీయబ్రాండ్‌లతో సహా రూ.6.72 లక్షల విలువైన మద్యాన్ని కూడా పోలీసులు కనుగొని స్వాధీనం చేసుకున్నారు. అదనంగా అధికారులు ముఖ్యమైనపత్రాలు, ఖాళీ చెక్కులు, దాదాపు 667 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2.75 కోట్ల విలువైన వజ్రాల ఉంగరాలను స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోనే కాకుండా ముంబయి,గోవా,బెంగళూరు, పుణె, విజయపుర, తుమకూరు, కోల్‌కతా, సాంగ్లి, లక్నో, భాగల్‌కోట్ వంటినగరాలకు చెందిన వ్యాపారవేత్తలకు సల్దాన్హా మోసం చేశారని నగర పోలీసు కమిషనర్ సుధీర్‌కుమార్ రెడ్డి తెలిపారు. పెద్దమొత్తంలో వ్యాపార రుణాలు ఇస్తానని హామీ ఇచ్చి, ప్రాసెసింగ్ లేదా ఫెసిలిటేషన్ ఫీజులుగా భారీ మొత్తాలను వసూలు చేశారని చెప్పారు.ఆపై ఎటువంటి రుణాలు ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయని సిపి తెలిపారు. గత మూడు నెలల్లోనే బాధితుల నుంచి రూ.32 కోట్లకుపైగా వసూలుచేసినట్లు తెలిపారు. సల్దాన్హాను కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

## కేన్సర్ చికిత్సకోసం కొత్త టీకా..

**న్యూఢిల్లీ,జూలై 19:** ఫ్లోరిడా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ప్రయోగాత్మక ఎంఆర్ఎన్ఏ (మెసెంజర్ రిబోన్యూక్లియిక్ యాసిడ్) టీకాను అభివృద్ధి చేశారు. కేన్సర్‌నివారణకు ఇదొక కొత్త ఔషధంగా పేర్కొంటున్నారు. ఇది కణతులు (ట్యూమర్లు)పై శరీర రోగ నిరోధక వ్యవస్థ స్పందనను పెంచుతుంది. ఈ టీకాను ప్రామాణిక ఇమ్యునోథెరపీ ఔషధాలతో కలిపి ఎలుకలకు ఇచ్చినపుడు కణతులపై గట్టి ప్రభావం చూపింది. ఈ అధ్యయన నివేదికను 'నేచర్ బయోమెడికల్ ఇంజినీరింగ్' జర్నల్‌లో ప్రచురించారు. ఈ టీకా పట్ల భరోసా ఎందుకంటే, ఇది నిర్దిష్ట ట్యూమర్ ప్రొటీన్స్‌ను లక్ష్యంగా చేసుకోదు. ఇది ఓ వైరస్‌తో పోరాడుతున్నట్లుగా, రోగ నిరోధక వ్యవస్థను క్రియాశీలం చేస్తుంది. కణతులలోని పీడీఎల్1 అనే ప్రొటీన్ ఎక్స్‌ప్రెషన్‌ను బలోపేతం చేయడం ద్వారా ఈ ఫలితాన్ని సాధించారు. దీనివల్ల కణతులు చికిత్సకు మరింత ఎక్కువగా స్పందిస్తాయి.

# సంక్షిప్తంగా..

## బోల్సోనారోపై ఆంక్షలు.. బ్రెజిల్ 'జడ్జి' వీసా రద్దు చేసిన యుఎస్



**వాషింగ్టన్, జూలై 19:** బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో కాలి చీలమండకు ఎలక్ట్రానిక్ పర్యవేక్షక పరికరాన్ని అమర్చి ఆయన కదలికల్ని గమనించాలని ఆ దేశ సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ చర్యలపై అమెరికా దీటుగా స్పం దించింది. బోల్సోనారోపై ఆంక్షలు విధిం చిన బ్రెజిల్ న్యాయమూర్తి వీసా రద్దు చేసింది. అంతకు ముందు ట్రంప్ స్పందిస్తూ తన మిత్రుడైన బోల్సోనారో పట్ల బ్రెజిల్ న్యాయ వ్యవస్థ అన్యాయంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. మాజీ అధ్యక్షుడు బోల్సోనారోపై బ్రెజిల్ సుప్రీం ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని అమె రికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆరోపించారు. న్యాయస్థానం చర్యలు బ్రెజిలియన్ల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే కాకుండా అమెరికన్లను లక్ష్యంగా చేసుకునే ప్రయత్నమేనని మండిపడ్డారు.

## 12వ తరగతి విద్యార్థినికి నిప్పంటించిన దుండగులు

**భువనేశ్వర్,జూలై 19:** బిజెపి పాలిత ఒడిశాలో నేరాలు పెరుగుతున్నాయి. స్నేహితురాలి ఇంటికి వెళ్తున్న అమ్మాయిని ముగ్గురు వ్యక్తులు అడ్డుకున్నారు. ఆమెకు నిప్పంటించి పారిపోయారు. తీవ్రంగా కాలినగాయాలైన బాలిక ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నది. ఒడిశాలోని పూరీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బయాబర్ గ్రామానికి చెందిన 12వ తరగతి చదువుతున్న బాలిక బుక్స్ తిరిగి ఇచ్చేందుకు శనివారం ఉదయం 8.30 గంటలకు స్నేహితురాలి ఇంటికి వెళ్తున్నది.భార్గవి నదిసమీపంలోని నిర్జన ప్రదేశంలో ముగ్గురువ్యక్తులు ఆమెను అడ్డుకున్నారు. ఆ అమ్మాయిని కట్టేసి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు.ఆతర్వాత అక్కడి నుంచి పారిపోయారు. కాగా అరుస్తున్న బాలికను స్థా నికులు పిపిలీలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## 300కుపైగా డ్రోన్లతో ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా!



**కీవ్, జూలై 19:** కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు కొనసాగుతున్నప్పటికీ ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగిస్తోంది. తాజాగా మాస్కో కీవ్‌పై 300కి పైగా డ్రోన్లు, 30 క్షిపణులతో విరుచుకుపడినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. దాడిలో అనేక నివాస భవనాలు, ఆస్పత్రులు, వాహనాలు ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. భవనాల శిథిలాల కింద అనేక మంది ప్రజలు చిక్కుకున్నారని వారిని బయటకు తీసుకొచ్చేందుకు భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. రష్యన్ దళాలు ఉక్రెయిన్‌లోని ఒడెసా నగరంపై 20కి పైగా డ్రోన్లు, పదుల సంఖ్యలో క్షిపణులు ప్రయోగించడంతో ఒకరు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్ర గాయాలపాలైనట్లు ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. భారీ ఆస్తి నష్టం సంభవించిందని, ఈశాన్య సుమీ ప్రాంతంలో కీలకమైన మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని తెలిపారు. యుద్ధ సమయంలో తమకు అండగా ఉంటూ, ఆయుధాలను సరఫరా చేస్తున్న మిత్ర దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు. రష్యాతో జరుగుతున్న యుద్ధాన్ని ఎదుర్కోవడానికి ఉక్రెయిన్‌కు ఆస్ట్రేలియా ఆయుధ సహాయం చేస్తోంది. ఇందులో భాగంగా శనివారం కీవ్‌కు ఎం1ఎ1 అబ్రమ్స్ ట్యాంకులను అందజేసింది. ఇతర సామగ్రిని రాబోయే నెలల్లో పంపనున్నట్లు ఆస్ట్రేలియా రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్ పేర్కొన్నారు.మాస్కో, కీవ్‌పై చేస్తున్నచట్ట విరుద్ధమైన, అనైతిక దండయాత్రకు వ్యతిరేకంగా తాము ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

## బీవర్‌జిల్లాలో గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ బోగీల్లో మంటలు

**జైపూర్,జూలై 19:** రాజస్థాన్‌లో బీవర్ జిల్లాలోని ఓ రైలు అగ్ని ప్రమాదానికి గురైంది. పైలట్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. పైలట్ రైలును నిలిపివేసి కంట్రోల్ రూమ్‌కి సమాచారం ఇవ్వగా, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. కాగా ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం నేపథ్యంలో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బీవర్ జిల్లాలో శనివారం ఉదయం సెంద్రా రైల్వే స్టేషన్ సమీపంలో రైల్లో అగ్ని ప్రమాదం జరిగింది. ముంబయిఢిల్లీకి వెళ్లే 12216 గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైల్లో మంటలు చెలరేగాయి. మొదట చక్రాల నుంచి పొగలు రావడంతో గమనించిన పైలట్ రైలును నిలిపివేసి కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన రైల్వే సిబ్బంది అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్(ఏడీఆర్ఎం) వికాస్ బురా, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ ఆఫీసర్‌స్వాతి జైన్ తమ బృందంతో ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఇంజిన్ కింది నుంచి వస్తున్న పొగలను నియంత్రించారు.

## అజారుద్దీన్ మాజీ భార్య సంగీతా బిజ్లాని ఫామ్‌హౌస్ ధ్వంసం

**పూణె,జూలై 19:** క్రికెట్ దిగ్గజం మహ్మద్ అజారుద్దీన్ మాజీ భార్య, బాలీవుడ్ నటి సంగీతా బిజ్లానీకి చెందిన ఫాంహౌస్ ధ్వంసమైంది. మహారాష్ట్రలోని పుణే సమీపంలోని టికోనా గ్రామంలో సంగీతా బిజ్లానీకి ఫాంహౌస్ ఉంది. ఈ నెల 18న ఆమె తన ఇద్దరు సహాయకులతో కలిసి ఫాంహౌస్‌ను సందర్శించినప్పుడు ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మెయిన్ గేటు, కిటికీల గ్రిల్స్ విరిగిపోయిన స్థితిలో కనిపించాయి. రూ.7 వేల విలువైన ఒక టీవీ చోరీకి గురైంది. అంతేకాక, మరో టీవీ, బెడ్‌లు, రిఫ్రిజిరేటర్, సీసీటీవీ కెమెరాలు ధ్వంసం అయ్యాయి. ఫాంహౌస్‌లో ఉన్న ఇంటిలో ఎగువ అంతస్తు పూర్తిగా దెబ్బతింది. ఇంట్లోని గృహోపకరణాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. తన తండ్రి ఆరోగ్య సమస్యల కారణంగా నాలుగు నెలలుగా ఫాంహౌస్‌ను సందర్శించలేదని సంగీతా బిజ్లానీ తెలిపారు. ఇప్పుడు వచ్చి చూసేసరికి అంతా ధ్వంసమై ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

## కరుణానిధి పెద్దకుమారుడు ముత్తు మృతి

**చెన్నై,జూలై 19:**తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పెద్దకుమారుడు ముత్తువేల్ కరుణానిధి ముత్తు (ఎంకే ముత్తు) అనారోగ్యంతో మరణించారు.ముత్తు శనివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో చెన్నైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఈయన 1948 జనవరి 14న కరుణానిధిపద్మావతి దంపతులకు జన్మిం చారు. తన తండ్రి కళాభిరుచి లాగే ఎం.కె. ముత్తు కూడా తొలుత నాటకాల్లో, తరువాత సినిమాల్లో నటించడం ప్రారంభించారు. ఇదే సమయంలో 70వ దశకంలో డీఎంకే వేదికలపై పార్టీ విధానాలను వివరిస్తూ పాటలు పాడటం ద్వారా ప్రజల్లో ఎంతోఆదరణ పొందారు. ఆయ న నటించిన చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. ఆయన డీఎంకే వేదికలపైనే కాకుండా పలు సినిమాల్లో కూడా పాటలు పాడారు.


# ఒక వధువు ఇద్దరు భర్తలు..

## హిమాచల్‌లో కొనసాగుతున్న పురాతన ఆచారం

**సిమ్లా,జూలై 19:** పురాతనకాలం నాటి ఆచారానికి హిమాచల్ ప్రదేశ్‌లోని ఓ గ్రామం వేదికగా మారింది. హట్టి తెగకు చెందిన ఇద్దరు అన్నాదమ్ముళ్లు ఒకే అమ్మాయిని పెళ్లి చేసుకున్నారు. ఈ ఘటన ఆ రాష్ట్రంలోని సిర్‌మోర్ జిల్లాలో జరిగింది. షిల్లాయి గ్రామానికి చెందిన ప్రదీప్ నేగి, కపిల్ నేగి అనే అన్నదమ్ములు సమీపంలోని కున్హత్ గ్రామానికి చెందిన సునీతా చౌహాన్ అనే అమ్మాయిని మ్యారేజ్ చేసుకున్నారు. ఆ ముగ్గురూ హట్టి తెగకు చెందినవారే. ఆ తెగలో ఇన్నాళ్ల వరకు ఆ వివాహ సంప్రదాయం చాలా గోప్యంగా జరిగేది. కానీ నేగి సోదరులు మాత్రం తమ పెళ్లిని ఘనంగా చేసుకున్నారు. శతాబ్దాల క్రితం నాటి సంప్రదాయాన్ని నిలబెట్టినట్లు వాళ్లు చెప్పుకుంటున్నారు. వివాహ వేడుకను అందరి అనుమతితో శాస్త్రోక్తంగా నిర్వహించారు. బహుభార్యత్వానికి సంబంధించిన ఈ వేడుకను ఆ గ్రామంలో చాలా గ్రాండ్‌గా చేపట్టారు. హట్టి వర్గ ప్రజల్లో ఉండే ఈ సంప్రదాయాన్ని జోడిధారణ లేదా ద్రౌపది ప్రాథ అని పిలుస్తారు. ఈ సంప్రదాయంలో అన్నాదమ్ముళ్లు ఒకే భార్యను షేర్ చేసుకుంటారు. సిర్‌మోర్ జిల్లాల్లోని ఈ సంప్రదాయం ఇక్కడ ఆచారంగా మారింది. ప్రదీప్ నేగి ఆ రాష్ట్ర జలశక్తిశాఖలో పనిచేస్తున్నాడు. ఇక సోదరుడు కపిల్ విదేశాల్లో ఉద్యోగం చేస్తు న్నాడు. ఇద్దరూ దూరంగా పనిచేస్తున్నా సునీతా ను మనువాడే విషయంలో ఆ ఇద్దరూ శాస్త్రాలను అనుసరించారు. పరస్పర అంగీకారంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రదీప్ తెలిపాడు. పారదర్శకతను తానేప్పుడూ నమ్ముతానని, నేను విదేశాల్లో ఉన్నా, మ్యారేజీ వల్ల భార్యకు సపోర్టు, సెక్యూర్టీ, ప్రేమ లభిస్తుందని కపిల్ తెలిపాడు. ఈ పెళ్లి తన ఇష్టప్రకారమే జరిగిందని, నన్ను ఎవరూ వత్తిడి చేయలేదని, ఈ ఆచారం గురించి తనకు తెలుసు అని, అందరం కలిసి ప్రతిజ్ఞ చేశామని, మా బంధంపై నాకు నమ్మకం ఉందని వధువు సునీత తెలిపింది.మూడు రోజుల పాటు పెళ్లి వేడుకను వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు, బంధువులు ఆ పెళ్లికి హాజరయ్యారు. అతిథులకు స్థానిక ఆచారాల ప్రకారమే భోజనాలు పెట్టారు. పాహరి సంప్రదాయ పాటలు, నృత్యాలతో పెళ్లి వేడుకను ఎంజాయ్ చేశారు.

# వాల్‌స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌కు పైలట్ల సంఘం లీగల్ నోటీసులు

## తప్పుడు కథనాల ప్రచారానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్




**న్యూఢిల్లీ, జూలై 19:** జూన్ 12న జరిగిన అహ్మదాబాద్ విమానం ప్రమాదంపై విదేశీ మీడియా తప్పుడు వార్తలపై ఇండియన్ పైలట్ల సంఘం (ఎఫ్ఐపి) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు ది వాల్ స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌కు లీగల్ నోటీసులు పంపింది. తప్పుడు కథనాలు ప్రచారం చేసినందుకు రెండు సంస్థలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఇండియన్ పైలట్ల సంఘం (ఎఫ్ఐపి) అధ్యక్షుడు ఎసి రంధవా మాట్లాడుతూ తాము చట్టపరమైన చర్యలు ప్రారంభించామన్నారు. ఆయా వార్తా కథనాలపై ది వాల్ స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌కు నోటీసులు పంపినట్లు చెప్పారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశామన్నారు. ఆ సంస్థలకు పంపిన మెయిల్‌లో ధ్రువీకరించని సమాచారంతో ప్రమాదంపై పదే పదే తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారంటూ తమకు తెలిసిందని పైలట్ల సంఘం పేర్కొంది. ఈ ప్రమాదం ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపింది. అధికారికంగా నిర్ధారణ లేకుండా ప్రమాదానికి గల కారణాలపై ఊహాగానాలు చేస్తూ మరణించిన పైలట్లదే తప్పు అని ఏ వార్తనైనా మీడియా సంస్థలు ప్రచారం చేయకూడదని పైలట్ల సంఘం పేర్కొంది.

ఊహాజనిత సమాచారంతో వార్తలు ప్రచురించడం బాధ్యతారహితమైన చర్య అని, మరణించిన పైలట్ల ప్రతిష్టకు తీవ్రమైన, కోలుకోలేని నష్టాన్ని కలిగించిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. మృతి చెందిన పైలట్లతో పాటు ప్రయాణికుల కుటుంబాలు తీవ్రంగా ఆవేదనకు గురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 17న ప్రచురించిన వార్తపై వెంటనే సమీక్షించి సవరించాలని రాయిటర్స్‌కు సూచించింది. 'పైలట్లదే కారణం' అన్న ఏ విషయాన్ని అయినా తొలగిస్తూ వివరణ ఇవ్వాలని పైలట్ల సంఘం రాయిటర్స్‌కు సూచించింది. ఈ విషయంలో స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని నోటీసుల్లో హెచ్చరించింది. ఎన్‌టిఎస్‌బి బోర్డు ప్రకటనపై పైలట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంధవా హర్షం వ్యక్తంచేశారు. యుఎస్ ఫెడరల్ ఏజెన్సీ అయిన నేషనల్ ట్రాన్స్ పోర్టేషన్ సేఫ్టీ బోర్డు (ఎన్‌టిఎస్‌బి) ఇటీవలి విమాన ప్రమాదం మీడియా కవరేజీని తీవ్రంగా తప్పుపట్టింది. ఎయిర్ ఇండియా 171 కూలడంపై వచ్చిన వార్తలన్నీ ఊహాజనితమైనవని ఎన్ఎస్‌బిటి ఛైర్ జెన్నిఫర్ హోమెండి పేర్కొ న్నారు. భారత దేశ ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదికను విడుదల చేసింది.

20-7Pg6exHMNWJQE.qxd:20-7Pg6exHMNWJQE.qxd 01/01/01 9:16 AM Page 1



# అవినీతిలో మాజీ మంత్రి రోజా ఫ్యామిలీ రికార్డు

## - త్వరలో రోజా, తమ్ముడు, భర్త, వైసిపి నేతల అవినీతిని బయటపెడతాం

## - నగరి నియోజక వర్గ టిడిపి నేతల సంచలన వ్యాఖ్యలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పుత్తూరు జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, నేతలు భాస్కర్‌రెడ్డి, తదితరులు

**తిరుపతి హెల్త్, జూలై 19 ప్రభాతవార్త :** మచ్చలేని నాయకుడు మా నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అని, అలాంటి ఎమ్మెల్యేలో మాజీ మంత్రి ఆర్.కె రోజా అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని నగరి నియోజక వర్గ టీడీపీ నేతలు, వడమాలపేట జెడ్పీటీసీ మురళీరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఏలుమలై రోజాపై మండిప డారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అవినీ తిలో మాజీ మంత్రి ఆర్.కె. రోజా ఫ్యామిలీ ఫస్ట్ అన్నారు. దాదాపు రూ. 2వేల కోట్లుకు రోజా అవి నీతికి పాల్పడిం దన్నారు. ఒకప్పుడు కారుకు డీజల్ లేని పరిస్థితి అని ఆరోపించారు. ఇసుక మాఫి యా, ప్రభుత్వ భూముల కబ్జా, గ్రావెల్, టీటీడీ దర్శనాల్లో ఆర్.కె రోజా పెద్ద ఎత్తున అవినీతి చేసిందని వారు ఆరోపించారు. అలాంటి అవినీతి రోజాను గత ఎన్నికల్లో 45 వేల ఓట్ల పై చిలుకతో ఓడించి గాలి భాను ప్రకాష్‌ను గెలిపించుకున్నామన్నారు. ఒక పుత్తూరు మున్సిపాలిటీలోనే టీడీపీ 16 వేల ఓట్లు వచ్చిన విషయాన్ని రోజా గుర్తు చేసుకోవాలన్నారు. అసలు ఏ స్థాయిలో రోజా అవినీతికి పాల్పడినదో అర్థం చేసుకోవచ్చు నన్నారు. మచ్చలేని నాయకుడు గాలి భాను ప్రకాష్ అని, మా ఎమ్మెల్యేపై లేనిపోని ఆరోప ణలు చేస్తే ఊరుకోం అని వారు హెచ్చరించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఐదు మండలాలకు చెందిన నేతలను గుంటకు గుక్కెడు నీళ్ళు తాగించి మమ్మల్ని అనిచి వేయడం జరిగిం దన్నారు. రోజా హయంలో నగరి నియోజక అభివృద్ధిని గురించి నియోజక వర్గ ప్రజలకు చెప్పాలని, ప్రస్తుత మా ఎమ్మెల్యే భాను ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని గురించి మేము వివరిస్తామన్నారు. రోజా ఎమ్మెల్యే భానుపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని, లేనిచో ఫ్యామిలీ అవినీతిని త్వరలో బయటపెడతామన్నారు.

# సత్యదేవుని ఉపాలయం కనకదుర్గమ్మ ఆలయంలో నెయ్యి చోరీ ఉప ప్రధాన అర్చకుడు, పరిచారకుడు సస్పెన్షన్

**కాకినాడ జులై 19,(ప్రభాత వార్త):** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఉపాలయమైన కొండ దిగువ మెట్ల మార్గం వద్ద గల కనకదుర్గమ్మ ఆలయంలో హోమాలు, నిత్య ధూప, ధీప నైవేద్యాలకు వినియోగించే నెయ్యిని ఆలయ పరిచారకుని సాయంతో అర్చకుడు చోరీ చేస్తూ పట్టుపట్టాడు. తదుపరి సస్పెన్సన్ కు గురయ్యారు. కనకదుర్గమ్మ ఆలయంలో ఉప ప్రధాన అర్చకునిగా చిట్టెం వివిఎస్ఎస్ హరగోపాల్ విధులు నిర్వహిస్తున్నాడు. పరిచారకునిగా ఎన్ ఎస్ సుబ్రహ్మణ్యం కృష్ణ కుమార్ అక్కడే పని చేస్తున్నాడు. ఆలయంలో పూజలకు గాను కొండపై గల స్టోర్ నుండి 15 కేజీలు గల ఆవు నెయ్యి డబ్బాలు కనకదుర్గమ్మ ఆలయానికి వచ్చాయి. అందులో మూడు నెయ్యి డబ్బాలు అర్చకులు హర గోపాల్ సొంత కారులో తరలిస్తుండగా ఆ సమాచారం ఇఓ వీర్ల సుబ్బారావు కు చేరింది. ఇఓ ఆదేశాలతో హుటాహుటిన ఆలయ ఎఈవో పెండ్యాల భాస్కర్ అక్కడకు చేరుకుని సీసీ కెమేరాలను క్షుణ్ణంగా పరిశీలించిన పిదప వాస్తవమేనని నిర్ధారించుకున్న తరువాత ఈ నేరానికి పాల్పడిన చిట్టెం హర గోపాల్ తో పాటు అతనికి సహకరించిన పరిచారకుడు కృష్ణ కుమార్ ను సస్పెండ్ చేస్తూ ఇఓ ఆదేశాలు జారీ చేసారు. దీంతో అన్నవరం దేవస్థానం ఈవో అందుబాటులో ఉండకుండా ఉద్యోగం నిర్వహిస్తూండడం వల్లనే ఆలయంలో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్టర్ లు, అర్చకులు వారి ఇష్టారాజ్యంగా వ్యవహరించి ఆలయం ఆదాయానికి గండివేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దోపిడీ లో స్దానిక ప్రజాప్రతినిధుల చేతివాటం ఉందని అందుచేతన ఆరోపణల్లో ఇరుక్కున్న వారిని తప్పించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆలయంలో పనిచేసే సిబ్బంది బాహాటంగా చెబుతున్నారు. ఇప్పటికైనా అన్నవరం దేవస్థానంలో జరిగిన అవినీతి, ఉప ఆలయంలో జరిగిన నెయ్యి చోరి సంఘటనలతో పాటు ఆలయం పరిధిలోని ఉప ఆలయాలు వాటి అభివృద్ధి నిధులు వినియోగం తదితర వాటిపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఈవో అందుబాటులో లేకపోవడంపైన సమగ్ర దర్యాప్తు జరపాలని వారు కోరుతున్నారు.

# దుర్గమ్మ ఆలయంలో ఆగస్టు 8 నుండి పవిత్రోత్సవాలు

**ఇంద్రకీలాద్రి, జూలై 19, ప్రభాతవార్త**

దుర్గమ్మవారి ఆలయంలో ఆగస్టు 8 నుండి 10వ తేదీ వరకు పవిత్రోత్స వాలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. 10వ తేదీ ఉదయం 10.30 లకు పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు.



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

– ఆగస్టు 8న వరలక్ష్మి వ్రతాలు:

దుర్గమ్మవారి ఆలయంలోఆగస్టు 8న వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

– ఆగస్టు 22న సామూహిక వరలక్ష్మి వ్రతాలు:

దుర్గమ్మవారి ఆలయంలో ఆగస్టు 23న సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తామని ఇఓ తెలిపారు. ఈ సామూహిక వ్రతాలు ఉదయం ఉదయం 7 నుండి 9గంటల వరకు ఆర్జిత సేవగా నిర్వహిస్తామన్నారు. ఆర్జిత సేవలో పాల్గొనదలచిన వారు ఉదయం 7 గంటలకు రు.1500 లు (ఒక్కరికి మాత్రమే) చెల్లించి పాల్గొంటే వారికి వ్రతం అనంతరం రు.300 క్యూలైన్లో దర్శనం, కుంకుమ, రవికముక్క, పెద్దలడ్డు, పూర్ణములు 2, గాజులు 6, శక్తికంకణము అందిస్తామన్నారు. ఇక ఉదయం 10 గంటల నుండి 11.30 వరకు ఉచిత సేవగా నిర్వహిస్తామన్నారు. ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న వారికి వ్రతం అనంతరం రు.100 క్యూలైన్లో దర్శనం ఏర్పాటు చేస్తామన్నారు. వారికి కుంకుమ, రవికముక్క, 2 పూర్ణములు, పులిహోర 1, గాజులు 6, శక్తికంకణము అందిస్తామన్నారు. పాల్గొనదలచిన వారు 18-8-2025న ఆఫీసులో దరఖాస్తులు తీసుకోవాలన్నారు.

– వేడుకగా ఆషాడం సారె:

దుర్గమ్మవారికి శనివారం నాడు పలువురు భక్తబృందాలు వేడుకగా ఆషాడం సారెను సమర్పించారు.

– నేడు క్యూలైన్లన్నీ ఉచితం:

గత రెండు ఆదివారాలలో దుర్గమ్మను దర్శించుకోడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నందున ఈ ఆదివారం నాడు దుర్గమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు క్యూలైన్లలన్నీ ఉచిత దర్శనాలు చేసుకోవాలని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఉదయం 10 నుండి సాయంత్రం 3గంటల వరకు అన్ని క్యూలైన్లు ఉచితమేనన్నారు. ఈ సందర్భంగా భక్తుల రద్దీకి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలను ఇఓ అధికారులు, సిబ్బందికి ఆదేశాలిచ్చారు.

# కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం

**నెల్లూరు ( పెంచలకోన రాపూరు),జూలై 19ప్రభాతవార్త**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్స వం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్ధాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ,చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చిఉత్స వం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

# ప్రజారోగ్య సిబ్బందిని సన్మానించిన సిఎం చంద్రబాబునాయుడు

**విజయవాడ కార్పొరేషన్,జులై 19,ప్రభాతవార్త**

ప్రతి 3వ శనివారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో సిఎం చంద్రబాబునాయుడు ఎపిలో 2024 స్వచ్ఛ సర్వేక్షన్‌లో అవార్డులు గెలుపొందిన నగరాలకు, అందులో ఒకటైన విజయవాడకు సిఎం చంద్రబాబునాయుడు అవార్డు ఇచ్చి ప్రజారోగ్య సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నందు శానిటనీ సూపర్‌వైజర్ డి.సోమరాజు, శానిటరీ మేస్త్రి జె.రమేష్, పిహెచ్ వర్కర్స్ అయిన వై చాణిక్యకు పురస్కారం అందించి అభినందించారు.

# రాష్ట్రంలో తారాస్థాయికి కక్షసాధింపు రాజకీయాలు

## - ఎంపి మిథున్‌రెడ్డి అరెస్ట్‌పై అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, జూలై 19 (ప్రభాతవార్త బ్యూరో)** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్షసాధింపు రాజకీయాలు తారాస్థాయికి చేరాయని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. మద్యం అక్రమ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడంపై ఆయన స్పందించారు. ఉద్యోగులను బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి స్టేట్‌మెంట్లు తీసుకుని అక్రమ కేసులో మిథున్‌రెడ్డిని ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు రాజకీయ జీవితం అంతా కుట్రలతో సాగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుండడంతోనే వైసీపీలోని కీలక నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు.

# పని ఒత్తిడి తాళలేక బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య!



**పుణె, జూలై 19:** విధినిర్వహణలో పని ఒత్తిడిని అధిగమించలేకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయిన బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పూణె జిల్లాలోని బారామతి బ్రాంచ్ బ్యాంక్ ఆఫ్ బరోడాలో 52 యేళ్ల శివశంకర్ మిత్రా పనిచేస్తున్నాడు. నెలరోజులక్రితమే రాజీనామా చేసిన మిత్రా ఇపుడు నోటీస్ కాలంలో ఉన్నాడు. 90 రోజులముందే ఆతడు బ్యాంకు ఉన్నతాధికారులకు నోటీసు పంపించాడు. ఆమోదం పొందేంతవరకూ విధులకు హాజరవుతున్నట్లు తేలింది. ఈనెల 17వ తేదీ రాత్రి మేనేజర్‌మిత్రా ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమా నిస్తున్నారు. కేవలం పనిఒత్తిడివల్లనే ఆత్మహత్యచేసుకున్నట్లు భావిస్తున్నారు. అంతేకాకుండా ఆతడి వద్దనుంచి ఒక స్యూసైడ్‌నోట్ కూడా స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు గంటలుముగిసాక అందరినీ వెళ్లిపోవాలని మిత్రా ఆదేశించి ఆ తర్వాత బ్రాంచ్‌ను మూసివేయించాడు. సెక్యూరిటీ గార్డుకూడా రాత్రి 9.30గంటలప్రాంతంలో వెళ్లిపోయాడు. అంతకుముందే మిత్రా తన సహోద్యోగి ఒకరిని తాడు తీసుకురావాలని కోరాడని, ఆ తాడుసాయంతోనే ఆతడు ఉరివేసుకున్నట్లు భావిస్తున్నారు. బ్యాంకుశాఖ సీలింగ్‌కు రాత్రి పదిగంటలసమయంలో ఉరివేసుకుని ఉన్నట్లు తేలింది. బ్యాంకు సిసిటివి ఫుటేజిలో స్పష్టంగా కనిపించింది. ఎన్నిసార్లు ఫోన్లుచేసినా స్పందన లేకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదుచేసింది. అంతేకాకుండా ఆమె స్వయంగా బ్యాంకు నరబాంచ్‌వద్దకువెళ్లింది. లైట్లు ఇంకా వెలుగుతూనే ఉండటం, లోపలినుంచి ఎలాంటిస ్పందన లేకపోవడంతో ఇతర సిబ్బందిని అప్రమత్తంచేసారు.

తలుపులు తెరిచిన తర్వాత తన భర్త మిత్రా జీవచ్ఛవంగా వేలాడుతున్న స్థితిని గమనించి ఆమె ఒక్కసారిగా రోదిస్తూ కూలబడి పోయింది. బారామతి సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ విలాస్ నాలే మాట్లాడుతూ ఆయన రాజీనామా లేఖ, ఆత్మహత్య లేఖలను స్వాధీనంచేసుకున్నామని, ఇందులో ఎలాంటి నాటకం లేదని అనుకోని, అనుచిత ఒత్తిడి ఏదైనా ఉందే మోనన్న కోణంలోను, నోటీస్‌పీరియడ్‌లో వచ్చిన వొత్తిడులపైనా విచారణ చేస్తామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించారు.



పెద్దవరం గ్రామంలో జరిగిన స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

# ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములవుదాం

## - ప్రతి గ్రామాన్నీ స్వచ్ఛ గ్రామం, స్వర్ణగ్రామంగా తీర్చిదిద్దుదాం..

## - ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు డా.లక్ష్మీశ

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. తద్వారా మన ఆరోగ్యాన్ని, పర్యావరణాన్నీ, ఆర్థిక ఆరోగ్యాన్నీ కాపాడుకుందామన్నారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం, పెద్దవరం గ్రామంలో జరిగిన స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి నెలా మూడో శనివారం ప్రత్యేక థీమ్‌తో స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది జనవరిలో న్యూ ఇయర్ క్లీన్ స్టార్ట్‌తో కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఈ నెల ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం ఇతివృత్తంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగం దిశగా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఈ కార్యక్రమాలను ఊరూవాడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం లేచింది మొదలు, పడుకునే వరకు రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ భాగమై పోయిందని.. ఇది ఇలానే కొనసాగితే పర్యావరణానికీ, మన ఆరోగ్యానికీ పెను ముప్పు తప్పదని, భావితరాల మనుగడ ప్రమాదంలో పడుతుందన్నారు. ప్లాస్టిక్ వస్తువులను విచ్చలవిడిగా వాడి బయటపడేస్తే.. అవి డ్రెయిన్లలోకి చేరుతాయని, దాంతో కాలువలు పూడుకుపోయి మురుగునీరు రోడ్లపైకి వస్తుందన్నారు. దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలబారినపడే ప్రమాదముందన్నారు. అదేవిధంగా భూమిలోకి చేరిన ప్లాస్టిక్‌లు మైక్రో ప్లాస్టిక్స్‌గా మారి మనల్ని మెల్లమెల్లగా కబళించేస్తాయన్నారు. ఈ నేపథ్యంలో తొలి అడుగుగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి దూరంగా ఉందామని, క్లాత్ బ్యాగ్స్, జ్యూట్ బ్యాగ్స్, పేపర్ ప్యాకింగ్ వంటివాటికి చేరువవుదామని కలెక్టర్ పేర్కొన్నారు. గౌరవ ప్రధాని, గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు ప్రతిరూపాలైన వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి సమష్టిగా కృషిచేద్దామని.. మనసుంటే మార్గం ఉంటుందని, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందమున్న పాలిథీన్ కవర్లు వినియోగించినా, ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్ వస్తువులు వినియోగించినా చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపర చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.

కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయ వస్తువులు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తదితరాలతో ఏర్పాటుచేసిన స్టాళ్లను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. తడి చెత్త పొడిచెత్తను సక్రమంగా, క్రమశిక్షణతో, నిబద్ధతతో వేరుచేసి ఇస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న 12 మందికి మొక్కలు, సర్టిఫికెట్లు, జ్యూట్ బ్యాగులు అందించారు.

# నేటి నుంచి అజ్మీర్ మీదుగా కాచిగూడ-భగత్‌కీ కోఠి మధ్య కొత్త రైలు

## - రాయలసీమ వాసులకు అందుబాటులో రైలు వేళలు

**గుంతకల్లు రైల్వే, జూలై 19,ప్రభాతవార్త** రాయలసీమలోని అనంతపురం, కర్నూలు జిల్లాల ప్రజలకు అందుబాటు వేళల్లో ముస్లింల ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన అజ్మీర్ మీదుగా నేటి(ఈనెల 20)నుంచి దక్షిణ మధ్య రైల్వే కాచిగూడ-భగత్‌కీ కోఠి మధ్య కొత్తగా డైలీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను ప్రవేశపెడుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. కాచిగూడ నుంచి భగత్‌కీ కోఠి వెళ్లే నెంబర్ 17605డైలీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20వ తేదీన ఆదివారం రాత్రి 11.50గంటలకు కాచిగూడలో బయలుదేరి, నిజామాబాద్‌కు(రెండోరోజు) తెల్లవారుజామున 3.15/17, నాందేడ్ ఉదయం 6.55/7.00పూర్ణా 7.45/8.05, హింగోలీ 9.29/30, వాశీమ్ 10.54/55, అకోల12.50/55, మలక్‌పూర్ మధ్యాహ్నం 2.10/12, ఖండ్వా సాయంత్రం 6.02/05, ఇటార్సీ రాత్రి 8.55/9.05, నర్మదాపురం (హోసంగాబాద్) 9.22/24, రాణీకమళాపతి(హబీబ్‌గంజ్) అర్ధరాత్రి 12.25/30, సంత్ హర్ధరంనగర్ (బైరా ఘర్) 1.15/20, సెహోర్ 1.41/43, మక్సీ 3.22/24, ఉజ్జయిని తెల్లవారుజామున 4.10/15, రత్లాం(మూడోరోజు) ఉదయం 7.05/15, జౌరా 7.45/47, మన్డ్‌సోర్ 8.24/26, నిమచ్ 9.14/16, ఛిత్తౌర్‌ఘర్ 10.40/45, భిల్వారా 11.45/50, విజయనగర్ 12.33/35, నసీరాబాద్ మధ్యాహ్నం 1.02/04, అజ్మీర్ మధ్యాహ్నం 2.10/45, పాళీ మర్వార్ 6.25/30, భగత్‌కీ కోంకి రాత్రి 8గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో భగత్‌కీకోఠి నుంచి కాచిగూడకు వెళ్లే నెంబర్ 17606డైలీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22న మంగళవారం నుంచి రాత్రి 10.30గంటలకు బయలుదేరి, పాళీ మార్వార్ 11.30/35, మర్వార్ అర్ధరాత్రి 12.12/45, సోజత్ రోడ్ 1.04/06, బేవార్ 1.56/58, అజ్మీర్ తెల్లవారుజామున 3.05/40, నసీరాబాద్ 4.18/20, విజయ్‌నగర్ 4.48/50, భిల్వారా 5.55/6.00, ఛిత్తౌర్ ఘర్(రెండోరోజు) ఉదయం 7.20/25, నిమచ్ 8.08/10, మన్డ్‌సోర్ 8.54/56, జౌరా 9.48/50, రత్లాం 10.40/50, ఉజ్జయిని మధ్యాహ్నం 1.00/05, మక్సీ 1.50/52, సెహోర్ 3.19/20, సంత్ హర్ధరం నగర్ (బైరా ఘర్) సాయంత్రం 4.30/35, రాణీకమళాపతి(హబీబ్‌గంజ్) 5.10/15, నర్మదాపురం(హోసంగాబాద్) 7.08/10, ఇటార్సీ 7.40/50, ఖండ్వా రాత్రి 10.42/45, మలక్‌పూర్ అర్ధరాత్రి 12.58/1.00, అకోల 2.45/50, వాశీమ్ 3.54/55, హింగోలీ 4.54/55, పూర్ణా(మూడోరోజు)ఉదయం 6.40/7.00, నాందేడ్ 7.45/50, నిజామాబాద్ 11.25/27, కాచిగూడకు మధ్యాహ్నం 3.40గంటలకు చేరుకుంటుంది.



# నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నివేదికను, కలెక్టర్‌కు సమర్పించిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి

**నెల్లూరు కలెక్టరేట్, జూలై 19, ప్రభాతవార్త** శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి జిల్లా కలెక్టర్‌తో భేటీ అయ్యారు. ఈ భేటిలో విద్య, వైద్యంతో పాటు జాఫర్ సాహెబ్ కెనాల్ వద్ద ఫుడ్ కోర్ట్స్‌పై ఎన్జిటి ఇచ్చిన నివేదికను జిల్లా కలెక్టర్ సమర్పించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నివేదిక ప్రకారమే కలెక్టర్ తుది నిర్ణయం తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. 200 ఫుడ్ కోర్ట్స్ ఒకే దగ్గర పెడితే ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని జాఫర్ సాహెబ్ కెనాల్ మొత్తం వ్యర్థాలతో కూడుకు పోతుందని దానివల్ల అక్కడ ఉన్న ప్రజలు అనారోగ్యం పాలవుతారని ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు. చంద్రశేఖర్ రెడ్డి వెంట వైఎస్ఆర్సిపి కార్పొరేటర్ నాగార్జున వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆగష్టు 1,2 వ తేదీలలో భారీగా జాబ్ మేళా

## - దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**నెల్లూరు ( చేజర్ల ) జులై 19 ప్రభాతవార్త** ఆత్మకూరు ఇంజినీరింగ్ కళాశాలలో ఆగష్టు 1,2 తేదిలలో భారీ జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పెరమళ్ళపాడు వ్యవసాయ క్షేత్రంలో శనివారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నియోజకర్గంలో 87.26 గృహాలను సందర్శించామని తెలిపారు. నియోజకవర్గంలో 86696 కుటుంబాలు ఉండగా 75619 కుటుంబాలను కలవడం జరిగిందని అన్నారు. ఈనెలాఖరకు వందశాతం గృహాలను సందర్శించి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ ఫలాలను వివరించుచున్నామని తెలిపారు. ఈ ఏడాదిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారని



తెలిపారు. ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు పెంచి ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అలాగే మహిళలకు ఏడాదికి 3 సిలిండర్లను ఫ్రీగా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి నగదు ఇవ్వడం జరిగిందని అన్నారు. రైతులకు ఇబ్బంది కరంగా ఉన్న ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేయడం జరిగిందని అన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ అమలు చేస్తామని అలాగే ఆగష్టు 15న మహిళలకు ఆర్టీసిలో ఉచితంగా ప్రయాణం చేయన్నుట్లు తెలిపారు. మెట్ట ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఆగష్టు 1,2 తేదిలలో భారీగా జాబ్ మేళ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆద్వర్యంలో మంత్రి నారా లోకేష్ సహకారంతో జాబ్ మేళాకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. జాబ్ మేళాలలో అన్ని రకాల అర్హత కలిగిన యువత యువకులు భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని ఉద్యోగాలు పొందాలని కోరారు. సుమారు 60కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గోని వారికి అవసరమైన ప్రతిభ గల యువతి యువకులకు ఉద్యోగులుగా నియమ ఇంచుకునేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఆత్మకూరులో ప్రభుత్వ ఐటిఐ, పాలిటిక్నెకు ,ప్రవేటు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసించి ఖాళీగా ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధీ కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామని అన్నారు.

సాఫ్ట్ వేర్ ఉద్యోగులు కూడా జాబ్ మేళాలో పాల్గొంటున్నారని సుమారు 3 వందలపైగా సాఫ్ట్ వేరు ఉద్యోగాలు కల్పించేందుకు సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. జాబ్ మేళా పై ఆత్మకూరు ఆర్‌డిఒ పావనీ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలోని ప్రజా ప్రతినిదులు, అధికారులు, ఈ జాబ్ మేళా పట్ల ముమ్మర ప్రచారం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జి. సతీష్‌రెడ్డి, జిల్లా మంత్రి పొంగూరు నారాయణ, ఎంపి వేమిరెడ్డి ఉన్నారు.

# మానసిక ఉల్లాసానికి హాస్యం దివ్య ఔషధం

## - ప్రపంచ రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ

**విజయవాడ,జూలై19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుత పరిస్థితుల్లో హాస్య నాటికలు మరిన్ని రావాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు అన్నారు. భావ తరంగిణి ఆధ్వర్యాన స్థానిక మహతి కళావేదికలో శనివారం సాయంత్రం హాస్య లఘు నాటికల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ ఎన్నో రకాల ఒత్తిడిలకు గురవుతూ జీవితాన్ని సాగిస్తున్న నేపథ్యంలో ఇటువంటి హాస్య నాటికలు మానసిక ఆనందాన్ని ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. మానసిక ఉల్లాసానికి హాస్యం దివ్య ఔషధమని ప్రతి ఒక్కరూ జీవితంలో హాస్యాన్ని ఆస్వాదించాలని అన్నారు. ఆర్టీసీ మచిలీపట్నం డిపో మేనేజర్ టి. పెద్దిరాజు మాట్లాడుతూ మన సాహిత్యంలో హాస్యానికి ప్రత్యేక స్థానం ఉందని గతంలో వచ్చినటువంటి హాస్య నవలలు నాటికలు నాటి నుంచి నేటి వరకు నిలిచి ఉండటమే అందుకు నిదర్శనం అన్నారు.

# ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం : ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు ( విడవలూరు ), జూలై 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంటింటికి తెలుగుదేశం సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు తెలియజేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న పథకాలపై శ్రీకర చుట్టినట్లు ఆమె తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. శనివారం చౌక చర్ల, దంపూరు పంచాయతీల్లో ప్రజలు ఎమ్మెల్యే రాకతో ప్రజలు పెద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస మౌలిక వసతులకు నోచుకోని గ్రామాలను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని కోవూరు ఎమ్మెల్యే ఆ గ్రామాలను పర్యటించారు. స్థానిక టిడిపి, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి గడప గడపకు వెళ్లి తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఆమె ప్రజలకు వివరించారు. ఇళ్ళు, ఇళ్ల స్థలాలు లేని పరిస్థితిని పరిశీలన చేయడం జరిగింది ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పేదల సొంతింటి కల సాకారం నెరవేరుస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి రాగానే రైతులకు ప్రయోజనం చేకూర్చే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసిన విషయాన్ని ప్రజలకు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలు చేసిన పెన్షన్ పెంపు, దీపం 2, మత్స్యకార సేవలో, తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాల గురించి ఆమె ప్రజలకు తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ నెలలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందిచడంతో పాటు ఆగస్ట్ 15 వ తేదీ నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించబోతున్నట్టు ఆమె వెల్లడించారు. పార్టీ ప్రతిపక్షంలో వున్నపుడు జండా మోసిన కార్యకర్తల కష్ట ఫలితంగానే ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిచానని, ఏ సమస్య వున్నా తనతో స్వయంగా చెప్పాలని ఎవరూ నిరాశ చెందవద్దని కోరారు. కోవూరు ప్రజల ఆదరాభిమానాలే తన బలమన్నారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎన్నికల సందర్భంగా చేసిన ప్రతి వాగ్దానం అమలు చేస్తానని ప్రజలకు హామీ యిచ్చారు. గత ప్రభుత్వం కొత్త రోడ్లు వేయకపోగా అక్రమంగా తవ్విన గ్రావెల్ భారీ వాహనాలలో తరలించడం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు ధ్వంసం చేశారన్నారు.

20-7P▯g7exHMNWJQE.qxd:20-7P▯g7exHMNWJQE.qxd 01/01/01 9:43 AM Page 1



# మేడారం మాస్టర్‌ప్లాన్ వారం రోజుల్లో సిద్ధం

## సమ్మక్క సారలమ్మ జాతరపై మంత్రి సీతక్క సమీక్ష



**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** మేడారంలోని సమ్మక్క సారలమ్మ ఆలయం ఆధునీకరణ పనులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. శనివారం రాష్ట్ర సచివాల యంలో అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రాబోయే మేడారం జాతరకు సంపూర్ణ ఏర్పాట్లు చేసేందుకు సమావేశం అయినట్లు తెలిపారు. ఆదివాసిల సంప్రదాయాలను, పూజారుల ఆలోచ నలకు అనుగుణంగా మేడారం ఆధునీకరణ పనులు చేపట్టాలని సిఎం ఆదేశించినట్లు తెలిపారు. సిం ఆదేశానుసారం భక్తులకు సౌకర్యాలు కలిగించే విధంగా ఆలయ ప్రాంగణాన్ని ఆధునీకరణ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. దేవా దాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ లో ఉన్న కారణంగా సమావేశానికి రాలేకపోయారని తెలిపారు. మంత్రి సురేఖ సూచన మేరకు మేడారం ఆధునీకరణ రాష్ట్రస్థాయి రెండో సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమ్మక్క సారలమ్మల ప్రధాన గద్దెల్లో ఎలాంటి మార్పులు చేయకుండా పరిసరాలను భక్తుల ఆకాంక్షల మేరకు, పూజారుల ఆలోచనల మేరకు విశాలంగా తీర్చిదిద్దుతామన్నారు. పూజారుల ఆలోచనలు కనుగుణంగానే మేడారం మాస్టర్ ప్లాన్ ఉంటుందని, ఒక వారం రోజుల్లో గద్దెల చుట్టూ ఆధునీ కరణ పనులకు సంబంధించి ప్లాన్లు సిద్ధం చేస్తామన్నారు. పూజారుల ఆమోదంతో పనులు ప్రారంభిస్తామని, పనుల ప్రతి దశలో వారి అభిప్రాయాలను తీసుకొని ముందుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఆధునీకరణ పనులకు సంబంధించి ప్లాన్లు సిద్ధం చేస్తామన్నారు.

పూజారుల ఆమోదంతో పనులు ప్రారంభిస్తామని, పనుల ప్రతి దశలో వారి అభిప్రాయాలను తీసుకొని ముందుకెళ్లాలని అధికారులకు సూచించారు. వచ్చే జాతర లోపు చేయాల్సిన పనులను ముందస్తుగా చేపడుతామన్నారు.

భక్తులు పుణ్య స్నానాలు చేసే జంపన్న వాగు అభివృద్ధి కోసం ఐదు కోట్లు మంజూరు చేశామని అన్నారు. జంపన్నవాగు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అత్యవసర సేవలు, భద్రత, వైద్య సిబ్బంది, పూజారులు, భక్తులకు, మీడియా ప్రతినిధులకు మరిన్ని వస్తువులు కల్పించే విధంగా గుడి చుట్టూ ఏర్పాట్లు చేస్తామన్నారు. మేడారంలో బస చేసే భక్తులకు ఎలాంటి లోటు రాకుండా అన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. కుంభమేళాలో భక్తులకు వసతులు కల్పించిన ఏజెన్సీలను సంప్రదించి వారి సలహాలు తీసుకుంటామని వివరించారు.



## మట్టి పరీక్షలు, పశు పాలనపై శిక్షణ

### మొబైల్ వలస కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో రైతులకు మట్టి పరీక్షలు, సేంద్రీయ వ్యవసాయ విధానాలు, పశు పాలనపై వర్చువల్ శిక్షణ ఇవ్వాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు. వలసదారులు, బడుగు, బలహీనవర్గాల సంక్షేమాభివృద్ధికి, జీవనోపాధి అవకాశాలను పెంచేందుకు మద్దతుగా హైదరాబాద్‌లో శనివారం మొబైల్ వసల సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. తదుపరి మాట్లాడుతూ ఈ మొబైల్ వలస సహాయ కేంద్రం ద్వారా నిజామాబాద్, నారాయణ్‌పేట్ జిల్లాల్లో వసల వెళుతున్న గ్రామీణ కుటుంబాలకు వలసకు ముందు, వచ్చిన తర్వాత వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత, సేవలు అందించబడతాయని తెలిపారు. ఇదే సమయంలో ఈ వసల వాహనాన్ని పూర్తి స్థాయిలో వినియోగించి ఎంపిక చేసిన ప్రాంతాల్లోని రైతులకు మట్టి పరీక్షలతో పాటు, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖలకు సంబంధించిన వివిధ సేవలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డైరక్టర్ డాక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ మగాడు కాబట్టే మిమ్మల్ని మట్టి కరిపించారు

### ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్

**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొనగాడు, మగాడు కాబట్టే మిమ్మల్ని మట్టి కరిపించాడని ఎఐసిసి కార్యదర్శి ఎ.సంపత్ కుమార్ అన్నారు. గాంధీభవన్‌లో శనివారం మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రాబోయే పదిపదిహేనేళ్ల ఉండాలని కొల్లాపూర్ ప్రజలు కోరుకున్నారని జనం చెప్పిన దాన్నే సిఎం సభలో చెప్పారని అన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి ఉంటే తమ జిల్లా పెండింగ్ పనులు అవుతాయని సభకు వచ్చిన ప్రజలు భావిస్తున్నారని కెటిఆర్ మాటలు శ్రుతి మించుతున్నాయని సంపత్ తెలిపారు. రావుగారి రాసలీలలు, కల్వ కుంట్ల కథాకమిస్ట్, తారక్ తోడేలు అనే మూడు పుస్తకాలు ఉన్నాయనీ, ఆ పుస్తకాలలో ఒక పేజీ మాత్రమే చదివామని ఇంకా చాలా కథ ఉందని ఆయన వెల్లడించారు. కెటిఆర్ నీకంటే ఎక్కువ భాష మాట్లాడగలను.. నీవు తట్టుకోలేవని ఆయన అన్నారు. లోకేష్‌ను కలవలేదంటావ్ కలిస్తే తప్పేంటి అని నువ్వే అంటావ్ ఇంత పరస్పర విరుద్ధ వ్యాఖ్యలతో ప్రకటనలు చేయడాన్ని సంపత్ ఎద్దేవా చేశారు. సిఎంను ఉద్దేశించి మాట్లాడే పద్ధతి నేర్చుకో కేటీఆర్ అని ఆయన హితవు చెప్పారు.

# వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ఇంటి ముందు, చుట్టుపక్కల నీరు నిల్వ ఉంచుకోవద్దు

### సీజనల్ వ్యాధుల నుంచి అప్రమత్తంగా ఉండాలి

### డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్

**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాబోయే 5 రోజుల పాటు తేలికపాటి నుంచి భారీ వర్షాలు పడనున్నాయని.. ముఖ్యంగా రాబోయే రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ ప్రజలను అప్రమత్తం చేసింది. వర్షాలు కురవనున్న నేపథ్యంలో ఇంటి ముందు, చుట్టు పక్కల ప్రాంతాల్లోనూ నీరు నిల్వకుండా చూసుకోవాలని డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డైరక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో ప్రజలకు సూచిం చారు. వర్షాలు పడే సమయంలో తక్కువ ఉష్ణోగ్రత, అధిక తేమకు దారితీయ వచ్చని.. దాంతో సీజనల్ వ్యాధులకు దారితీస్తుందన్నారు. ప్రధానంగా నీరు, గాలి ద్వారా సంక్రమించే వ్యాధుల నుంచి రక్షణ కోసం, ఈ సీజన్‌లో ఆరోగ్యంగా ఉండటానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా రాకుండా ఉండటానికి దోమలను నివారించే చర్యలను తీసుకోవాలని రవీందర్ నాయక్ ప్రజలకు సూచించారు. ప్రధానంగా దోమతెరలను ఉపయోగించాలన్నారు. నీరు నిలిచిపోకుండా గృహ కాలువలను నిర్వహించాలని.. గృహ సెప్టిక్ ట్యాంకులను మెష్‌తో కప్పాలి. ఇంటి చుట్టూ నిలిచి ఉన్న నీటిని తొలగించడానికి ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. నీటి ద్వారా సంక్రమించే ఇన్ఫెక్షన్లను నివారించడానికి తీవ్రమైన గ్యాస్ట్రోఎంటెరిటిస్, కామెర్లు, టైఫాయిడ్ రాకుండా ఉండటానికి వేడిచేసిన నీటిని తాగాలని సూచించారు. తరచుగా హ్యాండ్ శానిటైజర్‌లను వాడాలని, ఇన్ఫెక్షన్ బారిన పడకుండా ఉండటానికి తుమ్మినప్పుడు లేదా దగ్గినప్పుడు చేతి రుమాలు వాడాలని సూచించారు. ఎవరికైనా జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి సంబంధిత ఫ్లూ వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలని పబ్లిక్ హెల్త్ డైరక్టర్ సూచించారు.

## ఫుడ్‌పాయిజన్ సమస్యలను పరిష్కరించాలి

### గురుకులాలను సిఎం సందర్శించాలి: ఎఐఎస్ఎఫ్

**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న వివిధ సంక్షేమ గురు కులాల్లో జరుగుతున్న ఫుడ్ ఫాయిజన్ సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్(ఎఐఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. గురుకులాల్లో అధికారుల పర్య వేక్షణ లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురుకులాలను సందర్శించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు, సంక్షేమ హాస్టల్ విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారని, నిత్యం రాష్రంలో ఏదో ఒకచోట ఫుడ్ పాయిజన్స్ అవుతున్నాయన్నారు. గత విద్యాసంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులు అస్వస్థతకు గురై పాముకాట్లతో, అనుమానాస్పదస్థితిలో కొందరు విద్యార్థులు మరణించగా.. ప్రభుత్వం ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పినప్పటికీ మళ్లీ విద్యాసంవత్సరం ప్రారంభమైన గురుకులాల్లో ఫుడ్ పాయిజన్స్, విద్యార్థుల ఆత్మ హత్యలు ఆగడం లేదన్నారు. గురుకుల విద్యార్థుల పట్ల వారి సంక్షేమం పట్ల అధికారులు నిరక్ష్య వైఖరి వ్యవహరిస్తున్నారని, గురుకులాలు సంక్షేమ హాస్టల్లో ఫుడ్ పాయిజన్ గల కారణాలు గుర్తించాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలల పట్ల అధికారుల పర్యవేక్షణ లేదని విద్యార్థుల సంక్షేమంపై వారి దృష్టి లేకుండా పోతుందని, ప్రభుత్వం కేటాయించే నిధులు సక్రమంగా విద్యార్థుల సంక్షేమానికి ఉపయోగించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురుకుల పాఠశాలలను సందర్శించాలని.. సమస్యలను గుర్తిం చాలని, గురుకుల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష చేసి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పశుసంవర్ధక శాఖ గోపాలమిత్రలకు పెండింగ్ వేతనాలు విడుదల

**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పశుసంవర్ధక శాఖలో విధులు నిర్వహిస్తున్న గోపాలమిత్రలకు పెండింగ్ వేతనాలను విడుదల చేస్తూ రాష్ట్ర సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 1,484 మంది గోపాల మిత్రలకు ఆరు నెలల పెండింగ్ వేతనాలు కింద మొత్తం 9 కోట్ల రూపాయలను ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పెండింగ్ వేతన బకాయిలను విడుదల చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా గోపాలమిత్రలు గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు మెరుగైన సేవలు అందించడంలో కృషి చేస్తున్నారు.

అంతేకాకుండా వ్యాక్సినేషన్ వంటి కీలక విధుల్లో సైతం ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. వేతనాల విడుదలతో వారి ఆర్థిక ఇబ్బందులు తీరి, సేవలు మరింత సమర్థవంతంగా అందించేందుకు ఊతం లభిస్తుందని ఈ సందర్భంగా గోపాలమిత్రలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కెటిఆర్.. నీ జీవితంలో సిఎం కావు!

### మమ్మల్ని రెచ్చగొడితే దాడులు తప్పవు

### మాజీ ఎమ్మెల్యే, మల్కాజిగిరి ఇన్‌చార్జి మైనంపల్లి




గాంధీభవన్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పదేళ్ల అరాచక పాలనపై ఓ బుక్ రాసి గడపగడపకు పంచుతా.. కెటిఆర్.. నీ జీవితంలో సిఎం కావు అని మాజీ ఎమ్మెల్యే, మల్కాజిగిరి ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు హెచ్చరించారు. గాంధీభవన్‌లో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కెటిఆర్ షాడో సిఎంగా వ్యవహరించి కెటిఆర్ ఇష్టారాజ్యంగా నరంలేని నాలుక మాదిరి అహం కారపూరిత మాటలు మాట్లాడు తున్నారని ఆరోపించారు. ఇంటింటికి ఉద్యోగం, దళిత ముఖ్యమంత్రి, మూడు ఎకరాల దళితులకు భూములు ఇస్తామని మోసపూరిత హామీలు ఇచ్చారని అన్నారు. డబుల్‌బెడ్ ఇళ్లు అంటూ కాలయాపన చేశారని విమర్శిం చారు. సిఎం రేవంత్ పెద్ద మనసుతో డబుల్ బెడ్ ఇళ్లు కట్టిన వాళ్ల కోసం తొమ్మిది వేల కోట్లు నిధులు కేటాయించారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌తో సినీ, ప్రజా ప్రతినిధుల కుటుంబాల్లో చిచ్చుపెట్టారని ఆరోపించారు. నా గన్‌మెన్ల, కుటుంబ సభ్యుల ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో లా అండ్ ఆర్డర్ బ్రహ్మాండంగా ఉందని కితాబు ఇచ్చుకున్నారు. బిఆర్ఎస్ హయంలో ఐఎఎస్, ఐపిఎస్‌ల జీవితాలను నాశనం చేశారని ఆరోపించారు. మీ హయాంలో కబ్జాపెట్టిన ప్రభుత్వ భూములను సందీప్ ఝా కలెక్టర్ కి సిరిసిల్ల లో మీ కార్యకర్తలు హ్యాండ్ ఓవర్ చేశారని ఆయన గుర్తుచేశారు. మమ్మల్ని రెచ్చగొడితే దాడులు చేస్తాం, తగ్గేది లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోసం దేనికైనా సిద్ధం గుర్తుపెట్టుకో కేటీఆర్, హరీశ్‌రావు.. అవసరమైతే ఇళ్లపై దాడులు చేస్తామని ఆయన హెచ్చరిక చేశారు. నవీన్ పట్నాయక్, బీహార్‌తో ఇతర రాష్ట్ర నాయకులను రాష్ట్రానికి పిలిచి మరీ బురదపూసి వదిలారని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల ప్రజలు చెప్పుతో కొట్టే రోజులు వస్తాయి గుర్తుపెట్టుకో కెటిఆర్ అని హెచ్చరించారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని విషప్రచారం చేయడమే కెటిఆర్ పని అని అన్నారు. రెడ్ బుక్ అంటున్నావ్ ఏం చేస్తావని కేటీఆర్ అని మైనంపల్లి సవాల్ చేశారు. మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు హరి వర్ధన్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, సిదీర్ రెడ్డి నాయకులు బండి రమేష్, భూపతిరెడ్డి నర్సారెడ్డి, హరి కృష్ణ, చరణ్ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యధిక లోడ్ ఫ్యాక్టర్‌లో టాప్‌లో యాదాద్రి విద్యుత్ ప్లాంట్

**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** తెలంగాణలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్-1 రికార్డులు సృష్టిస్తున్నది. ప్రస్తుత 2025-26 అర్థిక సంవత్సరంలో అత్యధిక ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్)తో టాప్‌లో (77.56శాతం) నిలిచింది. తదుపరి 75.90శాతం పీఎల్ఎఫ్‌తో కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్ యూనిట్-2 రెండోస్థానంలో, 71.37 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌తో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్-4 యూనిట్ మూడోస్థానం లో నిలిచాయి. విద్యుత్తు ప్లాంట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌గా పిలుస్తారు.

రాష్ట్రంలో మొత్తం 12 థర్మల్‌ప్లాంట్లు ఉండగా, ప్రస్తుతం 10 యూనిట్లు నడుస్తున్నాయి. రెండు యూనిట్లు ఓవరాలింగ్(మరమ్మ తులు) జరుగుతు న్నాయి. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో మొత్తం 2 యూనిట్లుండగా, అందులో ప్రస్తుతం 800 మెగావాట్ల యూనిట్-2 అందుబాటులోకి వచ్చింది. మరో 800 మెగావాట్ల సామర్థం గల యూనిట్-1లో ఈ నెల 12న కమిషనింగ్ ఆఫ్ డేట్ (సీవోడీ) విజయవంతమైంది. 72 గంటలపాటు నిరంతరాయంగా నిర్వహించిన ఈ సీవోడీలో 800 మెగావాట్లకు 814 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అయ్యింది. బాయిలర్ లైటప్, ట్రయల్స్, సీవోడీ వరకు యూనిట్1 అత్యధిక పీఎల్ఎఫ్‌ను నమోదు చేసింది.



## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలుపు కాంగ్రెస్‌దే

### కాంగ్రెస్‌లో చేరిన జూబ్లీహిల్స్ వివిధ పార్టీ నేతలు

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికను కాంగ్రెస్ కైవసం చేసుకోబోతుందని మంచి మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తాడని టిపిసిసి అధ్య క్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తంచేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం జూబ్లీహిల్స్ నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసిన మురళిగౌడ్, మాజీ కార్పొరేటర్ సంజయ్‌గౌడ్‌తో పాటు పలువురు బిఆర్ఎస్ నాయకులు రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరి కండువా కప్పుకొన్నారు. కాంగ్రెస్ లోకి సాదరంగా ఆహ్వానించిన టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఏ ఎన్నిక వచ్చినా ఇక నుండి బిఆర్ఎస్ ఉనికి ఉండదని కాంగ్రెస్ అభ్యర్థి మంచి మెజార్టీతో గెలు స్తుందని జోస్యం చెప్పారు. కెసిఆర్ కెటిఆర్, కవిత అబద్దాలా డుతూ ప్రజలను మోసం చేశారని అన్నారు. బనకచర్ల విషయంలో హరీష్ రావు పచ్చి అపద్దాలు ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు. హైదరాబాద్ ను ప్రపంచ పటంలో ఉంచేందుకు రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ప్రజల ఆకాంక్షల మేరకే పాలన జరుగుతుందని అందుకే కాంగ్రెస్‌లో చేరికలు జరుగుతున్నవని ఆయన చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రజాపాలనకు నిదర్శనమే ఈ రోజు కాంగ్రెస్ లో చేరికలని, భవిష్యత్‌లో జరుగబోయే ఉప ఎన్నికలలలో మంచి మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తాపు అని ఆయన అన్నారు.

## అప్పులబాధతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

**మేడ్చల్, జూలై 19. ప్రభాతవార్త:** తీవ్రమైన అప్పుల బాధ, రుణ దాతల వేధింపులతో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్యకు పాల్పడిన విషాదఘటన మేడ్చల్‌లో చోటుచేసుకుంది. పోలీస్‌లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ పట్టణానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యా యుడు కామిని రమేష్ శనివారం మేడ్చల్‌లోని ఓ లాడ్జిలో ఉరేసుకుని ప్రాణం తీసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆత్మహత్యకు ముందు రమేష్ ఒక సెల్ఫీ వీడియోను చిత్రీకరించినట్లు సమాచారం. ఈ వీడియోలో తన మరణానికి గల కారణాలను వివరిస్తూ, రుణదాతల వేధింపులపై తీవ్ర ఆరోపణలు చేశారు. 'అప్పులిచ్చిన వారి ఒత్తిడితో మెదక్‌లో ఉన్న సొంత బిల్డింగ్, ప్లాట్లు అమ్మి అప్పులు చెల్లించాను. అప్పులు చెల్లించిన కొందరు ఇంకా తీసుకున్న డబ్బుల కోసం వేధిస్తున్నారు. కోర్టులో చెక్స్ కేసులు వేసి ఇబ్బంది పెడుతు న్నారు. నా భార్య, పిల్లలను రోడ్డుకు ఈడ్చారు' అని రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తన ఈ దుస్థితికి కారణమైన వారిని కఠినంగా శిక్షి ంచాలని ఆయన ముఖ్యమంత్రి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ను మెదక్ పోలీసులను వేడుకు న్నారు. ఈ సెల్ఫీ వీడియోను స్వాధీనం చేసుకున్న పోలీసులు, రమేష్ మరణానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు ప్రారంభిం చారు. ఈ ఘటనతో రమేష్ కుటుంబ సభ్యులతో పాటు, ఉపాధ్యాయ లోకం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. అప్పుల వేధింపుల సమస్య తీవ్రతను ఈ ఘటన మరోసారి కళ్లకుకట్టింది. రుణదాతల వేధింపులకు గురవుతున్న బాధితులకు తక్షణ న్యాయం అందించాలని, ఇటువంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరు తున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు పంచాయతీరాజ్ శాఖ ఏర్పాట్లు

**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త :** రాష్ట్రంలో స్థానిక సంసల ఎన్నికల నిర్వహణకు పంచాయతీ రాజ్ శాఖ ఏర్పాటు ముమ్మరం చేసింది. ఈ క్రమంలో అన్ని జిల్లాల్లో డీపీవోలకు పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ అత్యవసర ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సామగ్రి సేకరణ, వాటి పనితీరుపై మండలాలు, గ్రామాల వారీగా తనిఖీలు చేసి నివేదిక అందించాలని కోరింది. అవసరమైనచోట కొత్తవి సమకూర్చేందుకు ఇండెంట్ పంపాలని స్పష్టం చేసింది. కాగా బిసి రిజర్వేషనపై కారిటీ రాగానే నోటిఫికేషన్ విడుదల య్యే ఛాన్స్ ఉంది. కాగా, తెలంగాణలో సానిక సంసల ఎన్నికలకు హైకోర్టు ఆదేశించడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు ముమ్మరం చేసింది. రెండు విడతలో సర్పంచ్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ముందుగా, ఎంపీటీసీ ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు సమాచారం.



## మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్‌లతో రాష్ట్ర స్వర్ణకారుల సహకార సంఘం భేటీ

**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వర్ణకారుల సంక్షేమానికి, స్వర్ణకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి స్వరకారులకు హామి ఇచ్చారు. రాష్ట్ర స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి ఆధ్వర్యంలో శనివారం మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామిలను వేరువేరుగా కలిసి స్వర్ణకారుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి స్వర్ణకారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడంతో పాటు స్వర్ణకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తామని స్వర్ణకారుల సంఘం ప్రతినిధులకు మంత్రులు హామి ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వింజమూరి రాఘవాచారి మాట్లాడుతూ..సాధ్యమైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలలోపే స్వర్ణకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని మంత్రులకు విన్నవించినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వర్ణకారులందరూ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి పూర్తి మద్దతు ప్రకటించి అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తామన్నారు. మంత్రులనున కలిసి వారిలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వింజమూరి రాఘవాచారి, చేపూరి వెంకటస్వామి, రాష్ట్ర సలహాదారులు దుబ్బాక కిషన్ రావు తదితరులు ఉన్నారు.

# తెలుగు కళలను కాపాడుతున్న ప్రవాసాంధ్రులనూ సత్కరించాలి

### కార్మిక ఉపాధి గనుల శాఖ మంత్రి వివేక్




పురస్కారగ్రహీతలతో మంత్రి వివేక్, నిత్యానందరావు, వ్యాసకృష్ణ, హనుమంతరావు, రామమూర్తి తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), జూలై 19, ప్రభాతవార్త :** తెలుగు విశ్వవిద్యాలయం తెలుగుభాష, సాహిత్యం, లలితకళల అభ్యున్నతకి విశేష కృషిచేస్తున్న వారిని గుర్తించి వివిధ పురస్కారాలతో సత్కరించడం చాలా గొప్పవని అని, అయితే విదేశాల్లో ఉంటూ తెలుగు మాతృభాష, కళలు, సాహిత్యంపై మక్కువ కన బరుస్తూ తమవంతు అనితర కృషిసల్పుతున్న తెలుగు సంఘాలవారి కృషినీ గుర్తించి పురస్కారాలతో సత్కరించి ప్రోత్సహించాలని విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావుకు కార్మిక, ఉపాధి, కర్మాగారాలు, గనులశాఖ మంత్రి గడ్డం వివేక్ సూచించారు. తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవావిభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి గడ్డం వివేక్ విశిష్ట అతిథులు ఉగాండలో నివసించే ప్రవాసాంధ్రుడు వ్యాసకృష్ణ, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, విస్తరణ సేవా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రింగు రామమూర్తి తదితరులతో కలిసి వివిధరంగాల 12 మంది ప్రముఖులను 2024 సంవత్సరానికి ప్రతిభా పురస్కారాలను, పురస్కారంతోపాటు 20,116 నగదు, శాలువాతో ఘనంగా సత్కరించారు. విశ్వవిద్యాలయ ప్రతిష్టాత్మక పురస్కారాలను అందజేయడం వల్ల భావితరానికి స్ఫూర్తి కలుగుతుందన్నారు. ప్రతీయేటా తెలుగు విశ్వ విద్యాలయం అంద జేస్తున్న వివిధ పురస్కారాల నగదు బహుమతిని పెంచడం కోసం 5లక్షల విరాళాన్ని సభాముఖంగా ప్రకటించారు. ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షోపన్యాసంలో విశ్వవిద్యా లయ సువిశాల బాచుపల్లి ప్రాంగణంలో విద్యా ర్థులకు మరిన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు, త్వరలో అధునాతన కళా వేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభా పురస్కారగ్రహీతల్లో ఆయా విభాగాలకు చెందిన డా.యాకూబ్, డా.ఎం.ఎ. శ్రీనివాసన్, ఎల్. నరేందర్, భైరోజు చంద్రశేఖర్, డా. ఆర్.ప్రసన్నరాణి, డా. బి.రాధాసారంగపాణి, కె.కైలాష్, దుప్పల్లి శ్రీరాములు, గజవెల్లి సమ్మయ్య, ఆముదాల మురళి, డా.పులిగడ్డ విజయలక్ష్మి, పోల్కంపల్లి శాంతాదేవి ఉన్నారు.

## డ్రగ్ డిటాక్స్ చేసుకొని బ్లడ్ శాంపిల్స్ ఇస్తానంటున్న కెటిఆర్

### ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్

**హైదరాబాద్, జూలై 19,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్ అమెరికాలో మూడనెలల్లో ఉండి డ్రగ్ డిటాక్స్ చేసుకొని విదేశాలకు వెళ్లొచ్చిన తరువాత బ్లడ్ శాంపిల్స్ ఇస్తా అంటున్నాడని ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ ఆరోపించారు. శనివారం గాంధీభవన్ ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ కెటిఆర్ మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడని అన్నారు. కేదార్ కు మాకు ఎలాంటి సంబంధం లేదని కెటిఆర్ బుకాయించడం తగదని అన్నారు. కేదార్,అశ్విన్ లకు సంబంధించిన కంపెనీ కార్ మీ బామ్మర్ది రాజ్ పాకాల ఎలా వాడుతున్నాడని ఆయన ప్రశ్నించారు. మీ కుటుంబం ఫంక్షన్స్ కేదార్ ఆర్గనైజ్ చేశారని గుర్తుచేశారు. డ్రగ్స్ టెస్ట్ కి రావాలి అని సవాలు విసిరితే చాలా సార్లు కోర్టుకు వెళ్ళావ్ అన్నారు. కోర్టు తీర్పును కూడా వక్రీకరించావ్ అని ఆరోపించారు. కోర్టుకి క్షమాపణ చెప్పకపోతే కోర్టు తీర్పు ఉల్లంఘన కేసు నమోదు చేసేలా కేసు వేస్తానని హెచ్చరించారు. రక్తనమూనాలు ఇన్ని రోజులు ఎందుకు ఇవ్వడానికి ముందకు రాలేదని అనుమానం వ్యక్తం చేశారు

కేదార్‌తో ఎలాంటి సంబంధాలు లేకపోతే పూర్తి విచారణ చేయాలి అని ముఖ్యమంత్రికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ చేయలేదని అంటున్న కెటిఆర్ కెసిఆర్ లై డిటెక్టర్ టెస్ట్ చేయించుకోవాలని హితవు చెప్పారు. ఇక నుండి కెటిఆర్ ప్రవ ర్తన ఎలా ఉంటదో అలానే నాది ఉంటదని చెప్పారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నువ్వు వైస్‌ప్రెసిడెంట్‌గా నేను చర్చకు సిద్ధం అని ఆయన అన్నారు. ఎమ్మెల్సీగా నేను ఎమ్మెల్యేగా నేను ఏ చర్చకు అయినా సిద్ధమా అని సవాల్ విసిరారు.



## యూరోపియన్ ఛాంపియన్‌షిప్‌లో
# నెదర్లాండ్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ సమాఖ్య (ఎఫ్ఐబిఎ) అండర్ 20 పురుషుల యూరోపియన్ ఛాంపియన్‌షిప్ లీగ్‌లో టర్కియే 81-61 తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. ఆర్మేనియా రాజధాని యెరెవాన్‌లో కరెన్ డెమిర్చ్యాన్స్పోర్ట్స్‌కాన్సర్ట్ కాంప్లెక్స్‌లో శనివారం జరిగిన మ్యాచ్‌ను టర్కియే ప్రారంభించి, మొదటి పిరియడ్‌ను 24-15తో ముగించింది. రెండవ క్వార్టర్‌లో నెదర్లాండ్స్ అంతరాన్ని తగ్గించడానికి ప్రయత్నించగా, జాతీయ జట్టు 39-36 ఆధిక్యంతో లాకర్ రూమ్‌లోకి వెళ్లింది. రెండవ అర్ధభాగంలో క్రెసెంట్‌స్టార్స్ జట్టు ఆటపై ఆధిపత్యం చెలాయించింది, ముఖ్యంగా బలమైన రక్షణాత్మక ప్రదర్శనతో నెదర్లాండ్స్‌ను మట్టి కరిపించింది. ఫలితంగా జాతీయ జట్టు టర్కియే కేవలం తొమ్మిది పాయింట్లు మాత్రమే ఇచ్చి చివరి క్వార్టర్‌లోకి 66-45 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మ్యాచ్ చివరి దశలో అంతరాన్ని తగ్గించడానికి అనుమతించని టర్కియే, 81-61 తేడాతో విజయం సాధించి కోర్టును విడిచిపెట్టి సెమీఫైనల్లో క్రొయేషియా ప్రత్యర్థిగా మారింది. జాతీయ జట్టు నుండి, ఎమ్రే మెలిహ్ తుంకా 20 పాయింట్లతో మరియు ఓజ్గున్ సెంగిజ్ 17 పాయింట్లతో విజయంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. క్రొయేషియాటర్కియే సెమీఫైనల్ మ్యాచ్ ఈ నెల 20న రాత్రి జరుగుతుంది.



## వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో..
# శ్రీహరి సంచలన రికార్డు

**న్యూఢిల్లీ:** ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలు-2025లో భాగంగా జరిగిన ఈత పోటీల్లో శ్రీహరి నటరాజ్ రికార్డు సృష్టించాడు. 2025 ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలలో ఈతగాడు శ్రీహరి అత్యుత్తమ సమయాన్ని నమోదు చేశాడు. పురుషుల 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో భారత ఈతగాడు శ్రీహరి తన రికార్డు బద్దలు కొట్టే ఫామ్‌ను కొనసాగించాడు. రెండవ సెమీఫైనల్ హీట్‌లో, నటరాజ్ 1:48.11 సెకన్ల సమయం సాధించాడు. హీట్స్‌లో అతను నెలకొల్పిన 1:48.22 సెకన్లతో తన జాతీయ ఉత్తమ సమయాన్ని మెరుగుపరుచుకున్నాడు. వ్యక్తిగత మైలురాయి ఉన్నప్పటికీ, పారిస్ ఒలింపియన్ ఫైనల్‌లో తృటిలో స్థానం కోల్పోయాడు, టాప్ ఎనిమిది అర్హత బ్రాకెట్ వెలుపల మొత్తం మీద తొమ్మిదో స్థానంలో నిలిచాడు. అంతకుముందు రోజు, నటరాజ్ 1:48.22 సెకన్ల సమయంతో హీట్ 5లో అగ్రస్థానంలో నిలిచాడు, అతని మునుపటి అత్యుత్తమ సమయం 1:48.66 సెకన్ల కంటే కీలకమైన మిల్లీ సెకన్లు తక్కువ. అతని ప్రదర్శన ప్రాథమిక రౌండ్లలో ఐదవ అత్యుత్తమం, సెమీఫైనల్స్‌లో బలమైన బెర్తును సాధించింది మరియు రౌండ్లలో అతని స్థిరత్వాన్ని నొక్కి చెబుతుంది. మరోవైపు, అదే ఈవెంట్‌లో అనీష్ గౌడ 1:52.42 సెకన్ల సమయంతో 33వ స్థానంలో నిలిచి మరపురాని ప్రదర్శన ఇచ్చాడు. ఈ క్రీడల్లో సెమీఫైనల్‌కు చేరుకున్న రెండవ భారతీయ స్విమ్మర్ శ్రీహరి, బెనెడిక్షన్ రోహిత్ తర్వాత, 50 మీటర్ల బటర్‌ఫ్లైలో రెండు కొత్త ఉత్తమ సమయంను నెలకొల్పి మొత్తం మీద 13వ స్థానంలో నిలిచాడు.

# ఫ్రీస్టైల్ చెస్ సెమీ ఫైనల్లో అర్జున్ ఓటమి
## ప్లేఆఫ్‌లో ముందుకు ప్రజ్ఞానంద

**న్యూఢిల్లీ:** ఫ్రీస్టైల్ చెస్ టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన సెమీ ఫైనల్లో భారత్ టాప్ గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్ ఓటమి పాలయ్యాడు. లాస్ వెగాస్‌లో జరిగిన 2025 ఫ్రీస్టైల్ చెస్ గ్రాండ్‌స్లామ్ సెమీ ఫైనల్స్‌లో అర్జున్ లెవాన్ అరోనియన్ చేతిలో పరాభం చెందాడు. ఫ్రీస్టైల్ చెస్ ఈవెంట్‌లో సెమీ ఫైనల్‌కు చేరుకున్న తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన 21 ఏళ్ల అర్జున్ అమెరికన్ గ్రాండ్ మాస్టర్ అర్మేనియన్ చేతిలో 0-2 తేడాతో ఓటమి చెంది తన కలల పరుగును నిలిపివేశాడు. సెమీ ఫైనల్స్‌లో అతడు మొదటి గేమ్‌లో సౌకర్యవంతమైన స్థానాన్ని పొందినా, అరోనియన్ తన అత్యుత్తమ సామర్థ్యాలతో డిఫెండ్ చేయడంలో అవకాశాలను అందిబుచ్చుకోలేకపోయాడు. మరింత అను భవజ్ఞుడైన అరోనియన్ తన ప్రత్యర్థి అర్జున్‌పై వత్తిడి తేవడంతో చివరకు దాని నుండి బయటపడలేక కుప్పకూలాడు. రెండో గేమ్‌లో అరోనియన్ జోరును ప్రదర్శించాడు. ఈ అర్మేనియన్ ఆటగాడు తొలి ఆటలోనే స్వల్ప ఆధిక్యాన్ని సాధించడంతో ఆత్మస్థైర్యంతో దూసుకుపోయాడు. అయితే తప్పక గెలవాల్సిన పరిస్థితుల్లో అర్జున్ బలవంతంగా ఆటను




కొనసాగిచండానికి ప్రయత్నించినా, అవి సఫలం కాలేదు. ఇక ఇదే టోర్నీలో పోటీలో ఉన్న మరో భారత్ గ్రాండ్ మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద 3 నుండి 8వ స్థానం కోసం జరిగిన ప్లే ఆఫ్ మ్యాచ్‌లో జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌పై 1.5-0.5 తేడాతో విజయం సాధించాడు. మొదటి గేమ్‌లో నల్ల పావులతో ప్రజ్ఞానంద డ్రాగా ముగించాడు. తద్వారా రెండవ గేమ్‌లో కీమర్‌ను ఓడించి తెల్ల పావులతో విజయం సాధించాడు.



# పాక్ విక్టరీ
## ఇంగ్లండ్‌పై 5 పరుగుల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** ఉత్కంఠభరితమైన వరల్డ్ క్రికెట్ లీగ్ (డబ్ల్యూసిఎల్)-2025 ఓపెనర్‌లో పాకిస్తాన్ 5 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ ఛాంపియన్స్‌పై విజయం సాధించింది. ఈ వరల్డ్ ఛాంపియన్స్ లీగ్ ప్రారంభ మ్యాచ్ బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగింది. టాస్ గెలిచిన ఇంగ్లాండ్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. అయితే, పాకిస్తాన్ ఛాంపియన్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనను ప్రదర్శించింది, ముఖ్యంగా ఇన్నింగ్స్ డెత్ ఓవర్లలో బంతితో ఇంగ్లాండ్ టాప్ ఆర్డర్ బలమైన ప్రతిఘటనను ప్రదర్శించినప్పటికీ, పాకిస్తాన్ చివరి వరకు పోరాడి స్వల్ప తేడాతో గెలుపొందింది. పాకిస్తాన్ తమ 20 ఓవర్లలో 9 వికెట్లకు 160 పరుగులు చేసింది. కెప్టెన్ మొహమ్మద్ హాఫీజ్ 34 బంతుల్లో 54 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు స్థిరత్వాన్ని అందించాడు. ఆమేర్ యామిన్ 13 బంతుల్లో 27 పరుగులు చేసి వేగంగా రాణించాడు. సోహైల్ తన్వీర్ కూడా 11 బంతుల్లో 17 పరుగులు చేసి స్కోరును పెంచాడు. అయితే, ఇంగ్లాండ్ బౌలర్లు విరామాలలో





వికెట్లు తీయడం కొనసాగించారు. లియామ్ ప్లంకెట్ (2/28) మరియు క్రిస్ ట్రెమ్లెట్ (2/36) కీలకమైన వికెట్లు తీయగా, ర్యాన్ సైడ్‌బాటమ్ 3 ఓవర్లలో 1/18 పరుగులు చేశాడు. ఇక విజయం కోసం 161 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లాండ్ స్థిరమైన ఆరంభాన్ని ఇచ్చింది కానీ ముఖ్యమైన సమయంలో అదే జోరును కొనసాగించలేకపోయింది. ఫిల్ మస్టర్డ్ 51 బంతుల్లో 58 పరుగులతో ఇన్నింగ్స్‌కు మద్దతు ఇవ్వగా, ఇయాన్ బెల్ 35 బంతుల్లో 51 పరుగులతో అద్భుతమైన ఆటతీరును కనబరిచాడు. అయితే, చివరి ఓవర్లలో ఫినిషింగ్ పవర్ లేకపోవడం ఇంగ్లాండ్‌కు సవాలుగా మారింది. పాకిస్తాన్ బౌలర్లు డెత్ ఓవర్లలో ఆటను బిగించారు. రమ్మాన్ రయీస్ (1/14), అమీర్ యామిన్ (1/27), మరియు సోహైల్ తన్వీర్ (1/41) తమ ధైర్యాన్ని నిలుపుకుని పాకిస్తాన్‌కు 5 పరుగుల స్వల్ప తేడాతో విజయాన్ని అందించారు.



# రెజ్లింగ్‌లో భారత్‌కు రెండు స్వర్ణాలు
## మెరిసిన పంఘల్, హర్షిత

**న్యూఢిల్లీ:** పొలియాక్ ఇమ్రే వర్గా జానోస్ మెమోరియల్ ర్యాంకింగ్ సిరీస్‌లో 53 కిలోల టైటిల్‌ను గెలుచుకుని, భారత రెజ్లింగ్ స్టార్ ఆంటిమ్ పంఘల్ అంతర్జాతీయ సర్క్యూట్‌లో తన స్వర్ణ పరుగును కొనసాగించింది. మహిళల 72 కిలోల విభాగంలో హర్షిత స్వర్ణ పతకం గెలుచుకోవడంతో భారతదేశం యొక్క బలమైన ఫామ్ కొనసాగింది, ఫైనల్‌లో నాలుగుసార్లు ఆసియా ఛాంపియన్ కజకిస్తాన్‌కు చెందిన జామిలా బక్‌బెర్గెనోవాను 10-0 తేడాతో ఓడించి అద్భుతం చేసింది. గత నెలలో మంగోలియాలో విజయం సాధించిన తర్వాత, 20 ఏళ్ల ఆంటిమ్ రష్యాకు చెందిన నటాలియా మలిషేవాను 7-4 తేడాతో ఓడించి వరుసగా రెండో ర్యాంకింగ్ సిరీస్ బంగారు పతకాన్ని గెలుచుకుంది. అండర్ 20 ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలుచుకున్న తొలి భారతీయ మహిళ అయిన పంగల్, భారత రెజ్లింగ్‌లో ప్రకాశవంతమైన అవకాశాలలో ఒకరిగా తనను తాను స్థిరపరచుకుంది. జూన్‌లో జరిగిన మంగోలియా ర్యాంకింగ్ సిరీస్‌లో ఆధిపత్య ప్రచారం తర్వాత కొన్ని వారాల తర్వాత బుడాపెస్ట్‌లో ఆమె విజయం సాధించింది, అక్కడ ఆమె వరుస నమ్మకమైన విజయాలతో స్వర్ణ పతకం సాధించింది. హర్యానాలోని హిసార్‌లోని భగనా గ్రామానికి చెందిన ఆంటిమ్ తన చిన్నప్పటి నుంచీ అత్యుత్తమ ప్రదర్శనకారిని. పంఘల్ అలంకరించబడిన కెరీర్‌లో ఇప్పటికే వయస్సు సమూహం మరియు సీనియర్ స్థాయి పోటీలలో అంతర్జాతీయ పతకాల శ్రేణి ఉంది. ఆమె 2023లో బెల్‌గ్రేడ్‌లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో మరియు 2022లో హాంగ్‌జౌలో జరిగిన ఆసియా క్రీడలలో కాంస్యం గెలుచుకుంది.



# వాణిజ్యం

# ఎగుమతుల్లో భారత్ దూకుడు!

**న్యూఢిల్లీ, జూలై 19:** వ్యవసాయ, ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతుల్లో భారత్ గణనీయమైన వృద్ధిని కనబర్చింది. 2025-26 మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) భారతదేశ వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతులు సంవత్సరానికి 7 శాతానికి పైగా పెరిగి 5.96 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. బియ్యం, మాంసం, పండ్లు, కూరగాయల ఎగుమతులు దీనికి కారణమయ్యాయని ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. బాస్మతి, బాస్మతియేతర రకాలు రెండూ సహా బియ్యం ఎగుమతులు 3.5 శాతం పెరిగి 2.9 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో బియ్యం ఎగుమతులు రికార్డు స్థాయిలో 12.47 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇది 2023-24తో పోల్చుకుంటే 20 శాతానికి పైగా పెరిగింది. ప్రపంచ బియ్యం మార్కెట్లో 40 శాతానికి పైగా వాటా కలిగి ఉన్న భారతదేశం, దశాబ్దానికి పైగా ప్రధాన బియ్యం ఎగుమతిదారుగా తన స్థానాన్ని నిలుపుకుంది. మాంసం, పాలు, పౌల్ట్రీ ఎగుమతులు 17 శాతం పెరిగి 1.18 బిలియన్ డాలర్లకు చేరుకోగా, పండ్లు, కూరగాయల ఎగుమతులు 13 శాతం పెరిగి 0.95 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. నివేదిక ప్రకారం. భారతీయ గేదె మాంసం నాణ్యత, పోషక విలువల కారణంగా ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోందని అధికారులు గుర్తించారు.



భారతదేశం ఇప్పుడు ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద గేదె మాంసం ఎగుమతిదారుగా ఉంది. వియత్నాం, మలేషియా, ఈజిప్ట్, ఇరాక్, సౌదీ అరేబియా, యుఎఇలలో కీలక మార్కెట్లు ఉన్నాయి. అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ బాస్కెట్ కింద ఎగుమతులు 2025లో 25.14 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇది 2024 నుండి 12 శాతానికి పైగా పెరిగి మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో 51 శాతం వాటాను కలిగి ఉంది. మిగిలిన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో పొగాకు, కాఫీ, టీ ఉన్నాయి.

# హెచ్‌డిఎఫ్‌సి నికరలాభం రూ.18,155 కోట్లు

**ముంబై, జూలై 19:** ప్రైవేటుబ్యాంకింగ్‌రంగంలో అతిపెద్దబ్యాంకు హెచ్‌డిఎఫ్‌సి నికరలాభాల్లో 12.2శాతం వృద్ధిని నమోదుచేసింది. తొలి త్రైమాసికంలో 18,155 కోట్ల నికరలాభం ఆర్జించినట్లు ప్రకటించింది. నికర వడ్డీ ఆదాయంలో వృద్ధి, రుణాల వృద్ధి మందగించడంతో లాభాలు పెరిగాయి. బ్యాంకు అనుబంధ సంస్థ హెచ్‌డిబి ఫైనాన్సియల్ సర్వీసెస్ పాక్షిక పెట్టుబడుల ఉపసంహరణ కూడా కొంత లాభాలకు ఊతం ఇచ్చింది. బ్యాంకు నికరంగా 6,949.27 కోట్ల రూపాయలు వాటాలు విక్రయంద్వారా రాబడులు పెంచుకుంది. కేటాయింపుల పరంగా 14,441 కోట్లుగా ఉన్నాయి. వీటిలో 9 వేల కోట్లు ఫ్లోటింగ్ కేటాయింపులున్నాయి. అదనపు తక్షణ కేటాయింపులు కింద 1700 కోట్లు కేటాయించింది. ఈ కాలంలో నికరవడ్డీ ఆదాయం 5.4శాతం పెరిగి 31,438 కోట్ల వరకూ వచ్చింది. నికర వడ్డీ మార్జిన్ కూడా 3.35శాతంగా పెరిగింది. డిపాజిట్ల కంటే మొత్తం ఆస్తులవృద్ధి అధికంగా ఉంది. ఇతర ఆదాయాలపరంగా చూస్తే 21,730 కోట్లు ఆర్జించింది. బ్యాంకు స్థిరాస్తి ప్రమాణాలు కొంతమేర క్షీణించాయి. స్థూల నిరర్ధక ఆస్తులు 1.4శాతంగా ఉన్నాయి. అంతకు ముందు ఏడాది ఇదేకాలంలో 1.33శాతంగా ఉన్నాయి. ఇక నికర ఎన్‌పిఎలు మొత్తం అడ్వాన్సుల్లో 0.47 శాతంగా ఉన్నాయి. స్థూల అడ్వాన్సులు 6.7 శాతం పెరిగి 26.53 లక్షల కోట్లకు చేరాయి. రిటైల్ రుణాలు 8.1శాతం, చిన్న, మధ్య తరహా మార్కెట్ సంస్థలకు 17.1శాతం రుణాలు అధికంగా ఇచ్చింది. మొత్తంగా టోకురుణాలు 1.7శాతంగా ఉన్నాయి. డిపాజిట్లు 27.64 లక్షల కోట్ల వరకూ ఉన్నాయి. 16.2శాతం వృద్ధిని నమోదు చేసింది. నికర లాభాలు పెరగ డంతో 1:1 నిష్పత్తిన బోనస్ ఈక్విటీషేర్లు ప్రక టించింది. ఒకరూపాయి ముఖవిలువ కలిగిన ప్రతిషేరుకు ఒక అదనపు షేరు వస్తుంది. అదనంగా ప్రత్యేకతాత్కాలిక డివిడెండ్ ను ఈక్విటీషేరుకు ఐదు రూపాయలు చొప్పున పెంచింది.





# 59% పెరిగిన యాక్సిస్‌బ్యాంకు లాభం

**ముంబై,జూలై 19:** ప్రైవేటురంగంలో అభివృద్ధిలోకి వస్తున్న ఎస్‌బ్యాంకు నిరకరలాభం 59శాతంపెరిగి రూ.801కోట్లకు నమోదుచేసింది. తొలిత్రైమాసిక ఫలితాలను ప్రకటించిన బ్యాంకు నికరవడ్డీ ఆదాయాన్ని పెంచుకుంది. బ్యాంకు నికరవడ్డీ ఆదాయం కూడా రూ.502కోట్లకు పెరిగింది. క్రామనుగతంగా చూస్తే నికరలాభం 8.5శాతం పెరిగి 738 కోట్లుగా గత త్రైమాసికంలో నమోదు చేసింది. నికరవడ్డీ కూడా 5.7 శాతం పెరిగింది. వార్షిక పద్ధతిన గణిస్తే 2371 కోట్లుగా ఉంది. వడ్డీయేతర ఆదాయం 46.12 శాతం పెరిగి 1752 కోట్లుగా నమోదయింది. బ్యాంకు నికరవడ్డీ మార్జిన్ చూస్తే 2.5శాతంగా ఉంది. ఇక వివిధరంగాలకు కేటాయింపులు 34శాతంగా ఉండి 284 కోట్లుగా ఉన్నాయి. స్థూల నిరర్థక ఆస్తులు మొత్తం అడ్వాన్సుల్లో 1.60శాతంగా ఉన్నాయి. నికర ఎన్పీయేలు కూడా 0.30శాతంగా ఉండటం బ్యాంకు ఆర్థికపరిపుష్టిని సూచిస్తోంది. బ్యాంకు ఈ త్రైమాసికంలో ఐదుశాతం రుణాల్లో వృద్ధినమోదు చేసింది. 2.41లక్షల కోట్లుగా న్నాయి. డిపాజిట్లు కూడా 4.1శాతం పెరిగి 2.75 లక్షల కోట్ల రూపాయలకు చేరాయి.




# సెంట్రల్ బ్యాంకు నికర లాభంలో వృద్ధి

ప్రభుత్వరంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 33శాతం నికరలాభాల్లో వృద్ధిని నమోదు చేసి 1169 కోట్ల రూపాయలు సాధించింది. కీలక రాబడుల్లో వృద్ధి, రుణాల్లో తగ్గుదల వల్లనే లాభాలు పెంచుకోగలిగింది. గత ఏడాది ఇదే కాలంలో 880 కోట్లు ఆర్జించిన బ్యాంకు ఈసారి 33శాతం వృద్ధిని నమోదు చేసింది. బ్యాంకు మొత్తం రాబడులు రూ.9500 కోట్లనుంచి రూ. 10,374 కోట్లుగా ఉన్నాయి. బ్యాంకు వడ్డీ రూపేణా 8589 కోట్లు రాబట్టుకోగా గత ఏడాది ఇదే కాలంలో 8335కోట్ల నుంచి కొంతమేర వృద్ధిని నమోదుచేయ గలిగింది. బ్యాంకు నిర్వహణ లాభం 2304 కోట్లుగా ఉంది. స్థూల నిరర్థక ఆస్తులు మొత్తం అడ్వాన్సుల్లో 3.13శాతంగా ఉన్నాయి. ఇక మొత్తం అడ్వాన్సులు 9.97శాతం పెరిగి 2,75,595 కోట్లుగా ఉన్నాయి. అలాగేనికర నిరర్ధక ఆస్తులు,రానిబాకీలు 0.49శాతానికి తగ్గాయి. ఇక తక్షణ కేటాయింపులు రూ.521కోట్లకు తగ్గాయి. కేటాయింపుల కవరేజి రేషియో 97.02శాతంగా ఉంది. ఆస్తులపై రాబడులు 1.02శాతం మెరుగు పడ్డాయి. క్యాపిటల్ అడక్వసీ రేషియో 17.6శాతంగా ఉన్నాయి. మొత్తం బ్యాంకు బిజినెస్ రూ.6,35,564 కోట్లనుంచి 7,04,485 కోట్లకు పెరిగింది.




# గూగుల్, మెటాకు ఇడి నోటీసులు

**ముంబై, జూలై 19:** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు ఎంతో మందిని ఆర్థికంగా కుంగదీసి, చివరికి ప్రాణాలనే బలితీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌పై చర్యలు తీసుకోవాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈ కేసులో తన దర్యాప్తును మరింత వేగంగా కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఈ యాప్‌ల ప్రమోషన్ ఆరోపణలపై ఇడి విచారణకు హాజరైన విషయం విదితమే. తాజాగా ఈ కేసులో పెద్ద మలుపు తిరిగింది. టెక్ దిగ్గజాలు గూగుల్, మెటా కంపెనీలు కూడా ఇడి సమన్లు జారీ చేసింది. మనీలాండరింగ్, హవాలా లావాదేవీలు ఇతర ఆర్థిక నేరాలకు సంబంధించి దర్యాప్తులో ఉన్న బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి ఈ రెండు టెక్ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లలో వేదిక కల్పించాయని ఇడి ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 21న విచారణకు హాజరుకావాలని ఇడి అధికారికంగా నోటీసులిచ్చింది. దీనిపై ఈ రెండు సంస్థలు ఏ విధంగా స్పందిస్తాయన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది.




# ఎస్‌బిఐకి గ్లోబల్ ఫైనాన్స్ అవార్డ్

**న్యూఢిల్లీ, జూలై 19:** భారత దేశపు అతిపెద్ద బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2025 సంవత్సరానికిగాను ప్రపంచంలోనే అత్యుత్తమ కన్జ్యూమర్ బ్యాంక్ అవార్డును గెలుచుకుంది. విశ్లేషణ, ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ ఫైనాన్స్ నిపుణులు, విశ్లేషకులు, బ్యాంకర్ల అభిప్రాయాల ఆధారంగా ఈ ఎంపిక జరిగింది. గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ తన వార్షిక వరల్డ్స్ బెస్ట్ బ్యాంక్ కార్యక్రమంలో భాగంగా, ఐఎంఎఫ్/ప్రపంచ బ్యాంకు వార్షిక సమావేశాల సందర్భంగా 2025 అక్టోబర్ 18న వాషింగ్టన్ డీసీలో ఈ అవార్డును ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టికి ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి మాట్లాడుతూ, తమ విలువైన ఖాతాదారు లకు, అంకితభావం తో పనిచేసే ఉద్యోగులకు, నమ్మకం ఉంచిన భాగస్వాములంద రికీ కృతజ్ఞతలు తెలిపారు. వినియోగదారులకు మెరుగైన అనుభూతిని అందించడమే తమ వృద్ధి వ్యూహానికి కీలకమని ఆయన పేర్కొన్నారు. ఆన్‌బోర్డింగ్‌ను సరళీకరించడం, ప్రాంతీయ భాషల్లో వాయిస్ బ్యాంకింగ్‌ను ప్రవేశపెట్టడం, 24/7 డిజిటల్ సపోర్ట్ అందించడం వంటి చర్యలతో గ్రామీణ, సెమీఅర్బన్ ప్రాంతాల్లోని వినియోగదారులకు మరింత నిరాటం కమైన, సమ్మిళి తమైన బ్యాంకింగ్ అనుభవాన్ని అందించడమే తమ లక్ష్యమ న్నారు. అలాగే, ఏఐ సామర్థ్యాలతో హైపర్‌పర్సనలైజ్డ్ సేవలను అందిస్తూ, ఆమ్ని ఛానల్ ఎంగేజ్‌మెంట్ మోడళ్లను కూడా అభి వృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ మ్యాగజైన్ గ్లోబల్ ఫైనాన్స్ నాలుగు దశాబ్దాలుగా ఈ అవార్డులు అంద జేస్తోంది. ఎడిటోరియల్ విశ్లేషణలు, అంతర్జాతీయంగా ఫైనాన్షియల్ నిపుణుల అభిప్రాయాల ఆధారంగా 150కి పైగా దేశాలకు చెందిన సంస్థలను ఈ పురస్కారం కోసం ఎంపిక చేస్తారు.




# ఐసిఐసిఐ నికరవడ్డీ రాబడి రూ.21,635కోట్లు!

**ముంబై, జూలై 19:** దేశంలోనే రెండో అతిపెద్ద ప్రైవేటు బ్యాంకు ఐసిఐసిఐ బ్యాంకు నికరలాభాల్లో 15.5శాతం వృద్ధినమోదుచేసి రూ.12,768 కోట్లు ఆర్జించింది. తొలిత్రైమాసికంలో 2025-26 కాలానికిగాను ట్రెజరీ రాబడులు పెంచుకోగలిగింది. నికరవడ్డీ ఆదాయం 10.6శాతం వృద్ధిని నమోదుచేసి 21,635 కోట్లుగా ఉంది. వడ్డీయేతర ఆదాయం ట్రెజరీ రాబడులు మినహాయిస్తే 13.7శాతంగా పెరిగి 7264 కోట్లుగా ఉంది. ట్రెజరీ రాబడులు తొలిత్రైమాసికంలో రెట్టింపు అయ్యాయి. ట్రెజరీ లాభాలు రూ.1241 కోట్లుగా ఉన్నాయి. గత తొలిత్రైమాసికంలో 613కోట్లు మాత్రమే రాగా ఈసారి రెట్టింపు అయ్యాయి. దేశీయంగా అడ్వాన్సులు 12శాతంపెరిగాయి. రిటైల్ రుణపరపతి కూడా 6.9శాతంపెరిగింది. మొత్తం రుణాల పోర్టుఫోలియోలో 52.2శాతంగా ఉంది. బిజినెస్ బ్యాంకింగ్ విభాగం కూడా 29.7శాతం వృదిధని నమోదుచేస్తే దేశీయ కార్పొరేట్ పోర్టుఫోలియో 7.5శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం 0.4శాతం క్షీణించింది. మొత్తం అడ్వాన్సులు 11.5శాతంగా ఉన్నాయి. రూ.12.64 లక్షలకోట్లకు చేరాయి. మొత్తం డిపాజిట్లు కూడా 12.8శాతం పెరిగి 16.08 లక్షల కోట్లుగా ఉన్నాయి. కేటాయింపులు 1815 కోట్లుగా ఉంటే స్థూల నిరర్థక ఆస్తులు 2.15 శాతంగా ఉన్నాయి. నికర అడ్వాన్సుల పరంగాచూస్తే 0.41 శాతంగా ఉన్నట్లు బ్యాంకు ప్రకటించింది. స్థూల ఎన్పీయేలు 6245 కోట్లుగా ఉన్నాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps